ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణ:

పొడుపు కథలు

రచయిత:

శ్రీ జి. శంకరరావు



ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాదమి

సైఫాబాద్,


హైదరాబాద్-500004

ప్రథమ ముద్రణ :

1975, మార్చి

ప్రతులు : 2000

వెల : రు. 2-50



ముద్రణ :

లలితా ప్రెస్,

ఖైరతాబాద్, హైదరాబాదు-4.

ముందుమాట

ఎన్నో ఏళ్లుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వ సమయం ఆసన్నమవుతున్నది. ప్రపంచంలోని తెలుగువారి ప్రతినిధులందరిని ఒకచోట సమీకరించవలెనని పెద్దలందరూ కన్న కలలు ఫలిస్తున్న శుభ సమయమిది. రాబోయే ఉగాది రెండువేల అయిదువందల సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టము కాగలదు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దికిచెందిన శాతవాహన రాజుల కాలంనుండి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారతదేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదుకోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడేవారి తరువాతి స్థానం తెలుగువారిదే. బౌద్ధపూర్వయుగంనుంచి ఇటీవల బ్రిటిష్ సామ్రాజ్య పరిపాలనాయుగంవరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్లడం జరిగింది. అట్లా వెళ్ళిన తెలుగువారు తమ భాషా సంస్కృతి సంప్రదాయాలను ఆయా జాతీయ జీవనవిధానాలతో మేళవించి, వాటిని సుసంపన్నం చేస్తున్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదికమీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషినిగూర్చి చర్చించి, నిర్ణయించుకోవడానికి, తద్వారా వివిధ చైతన్యస్రవంతులను ఏకోన్ముఖంచేసి మన సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేసుకోవడానికి ఈ మహాసభలు దోహదకారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు అర్థవంతమైన భావ సమైక్యతకు ప్రాతిపదికలై తెలుగు జాతిని సమైక్యం చేయగలవనీ, ఆవిధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవనీ విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12వ తేదీన తెలుగు ఉగాది రోజున ప్రారంభమై ఒక వారం రోజులపాటు జరిగే ఈ మహాసభలో వివిధ దేశాలనుండి, వివిధ రాష్ట్రాలనుండి, మన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనుండి వచ్చే ప్రముఖులు ప్రతినిధులుగాను పరిశీలకులుగాను పాల్గొంటారు. ఈ మహాసభల సమయంలో

చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల కళల అభివృద్ధి వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాలనుంచి ప్రస్ఫుటంచేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రహాలయాన్ని (మ్యూజియంను) స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజ భూతమవుతుంది. తెలుగువారి సంస్కృతిని నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారంరోజులపాటు సాగుతవి తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలను విశదంచేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ ఉర్దు భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజలు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘనవిజయాలను విశదంచేసే గ్రంథాలు అనేకం ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి. ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయితలందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకు వచ్చిన అకాడమీ అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగువారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయు లందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంత మాత్రం చేతనే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడంలేదు. చేయవలసినది ఇకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న "అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ" మహాసభల ఆశయ సాధనకు పూనుకొనడమే కాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

జలగం వెంగళరావు
అధ్యక్షులు
ప్రపంచ తెలుగు మహాసభలు

విషయసూచిక

—(ం)—

ప్రార్థన

"అంబలిద్వేషిణం వందే
ఊరు పిండీకృతాసురం
పాలనేతి ప్రియంగవాం
చింతకాయ శుభప్రదమ్॥"

ఉపోద్ఘాతము

మన భారతదేశంలో నగరాల సంఖ్యకన్న జనపదాల సంఖ్యే ఎక్కువ. నగరాలలో నివసించే వారు నాగరకులు. జనపదాలలో నివసించేవారు జానపదులు. నాగరకులది నాగరకత అయితే జానపదులది జానపదం. జాతి జీవనానికి జనపదం మూలకందం. భాషాజీవనానికి జానపదం మూలస్తంభం. పండితలోకం దానిని విస్మరించి జానపద సాహిత్యంమీద కొంతకాలం చిన్నచూపు చూసింది. తెలుగు పలుకుబడి జానపదంలో ఉన్నంత నిండుగా సొంపుగా ఇతరత్రా లేదు అనటం సాహసం కాదు.

పండితభిషక్కుల భాషాభేషజాలు, అనుప్రాసల అట్టహాసాలు, యమక గమకాలు, శబ్దాడంబరాలు, అలంకారాది చీని చీనాంబరాలు లేకపోయినా భావ సంపదకు గానీ, భావనా పటిమకుగానీ రసస్ఫూర్తికి గానీ జానపద సాహిత్యంలో లోటులేదు. ఇదే తెలుగు పలుకుల తల్లికి పసిడి పల్లకి.

వేదాలను వల్లించిన పురుషులూ, కోశాదులను కంఠగతం చేసుకొన్న పండితులూ, ఆర్షవిజ్ఞానాన్ని సంరక్షిస్తే, స్త్రీలు ఆనోటా ఈనోటా పాటల రూపంలో పల్లె పదాలరూపంలో జానపద సాహిత్యాన్ని ప్రోది చేశారు.

ఈ జానపద సాహిత్యాన్ని అలక్ష్యం చేయరాదన్న వారిలో ప్రాతఃస్మరణీయులు, చిరస్మరణీయులు కీ. శే. శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు, కీ. శే. శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు, శ్రీ నేదునూరి గంగాధరంగారు. డాక్టరు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు, డాక్టరు బిరుదురాజు రామరాజుగారు, వ్యావహారిక భాషోద్యమ రథసారథి శ్రీ గురజాడ, జగన్నాథ రథసారథి శ్రీశ్రీ, శ్రీ నండూరు, శ్రీ హరి ఆదిశేషువు మున్నగు వారు ముఖ్యులు.

జానపద సాహిత్యంలో వివిధ ప్రక్రియలు ఉన్నాయి. వాటిలో పొడుపు కథలకు ఒక ప్రత్యేకమైన అధ్యాయమే తెరవవలసిన అవసరం ఎంతైనా ఉంది. శ్రీ నేదునూరి గంగాధరంగారు పొడుపు కథలను సంగ్రహించారు. పసిడి పలుకులు, జానపద గేయవాఙ్మయం మున్నగు గ్రంథాలలో వారు తాము సంక

లించిన కొన్ని పొడుపు కథలను వెలువరించారు. వీటిని వర్గీకరించడం మొదల యినవి చేయలేదు. అందుచే వీటి వర్గీకరణ, వీటి పుట్టుపూర్వోత్తరాలు, వీటి ప్రయోజన ప్రాభవాలు, వీటి వ్యాప్తి, వీటికి సాహిత్యంలో ఉన్న స్థానం, ఉండ వలసిన స్థానం, వీటికి ఇతర భాషలతో ఉన్న సన్నిహిత సంబంధాలు మున్నగు వాటిని చర్చించడం సమంజసం.

ఆదికవిగా గణనకెక్కిన నన్నయ నుండి చిన్నయ వరకు గ్రాంథిక భాష బహుముఖంగా వ్యాపించింది. వీరగ్రాంథికులు కూడా ఉద్భవించారు. నన్నయకు ముందునుంచి జానపద సాహిత్యం మనకు ఉంది. దానిని వెలుగులోకి తీసుకొని రావాలి అని కొంతమంది శ్రమించారు. యక్షగానాలమీద డాక్టరు యస్వి జోగారావుగారు, జానపదవాఙ్మయంమీద డాక్టరు బిరుదురాజు రామరాజుగారు, డాక్టరు యస్ గంగప్పగారు, నాయని కృష్ణకుమారి మున్నగు ప్రముఖులు పరిశోధనలు జరిపారు. గ్రంథ రచనలు వ్యావహారికంలో చేయాలని కొంతమంది నడుం కట్టారు. గ్రాంథికభాష కృతక మనీ వ్యావహారిక భాష సహజమనీ వాదోపవాదాలు, రాద్ధాంత సిద్ధాంతాలు జరిగాయి. కొంతమంది మాధ్యస్థము వహించేరు. కొందరు రెండింటినీ సమాదరించేరు. రసాస్వాదనమే సహృదయ లక్షణము. జానపద సాహిత్యంలోని రసము చెట్టున పండిన పండువంటిది.

తదన్యమున రసము అంటే మార్గసాహిత్యంలోని రసము పాక విశిష్ట మయిన భక్ష్య రస సమానము. జానపద సాహిత్యంలోని పదాల పొందిక, నడబెడగు, అందచందాలు వేరు..మార్గ సాహిత్యంలోని ఠీవి, ఠేవ వేరు. అందులో స్వచ్ఛత, అమాయకత ఉంటాయి. ఇందులో (మార్గ సాహిత్యంలో) వాటికి పై పూతలు, పై తొడుగులు ఉండి ప్రకృతి రామణీయకాన్ని కన్పడనీయవు. జాన పద సాహిత్యంలో రేఖామాత్రంగా ఉన్నవే మార్గ సాహిత్యంలో వేషధారణతో మార్పులు, కూర్పులు, చేర్పులతో మనకు అనేకం దర్శనమిస్తున్నాయనడానికి పొడుపు కథలే నిదర్శనము. ఈ పొడుపు కథలు అంటే ఏమిటో కొంచెం పరిశీలిద్దాము.

కథలు అనేకరకాలు. పురాణ కథలు, కల్పిత కథలు, కట్టు కథలు, నీతి కథలు, ఆత్మ కథలు, జీవిత కథలు, పొడుపు కథలు. కథా కథనం మొదట మౌళిక విభాగంగా ఉండేది. పురాణ కథలు, కట్టు కథలు, పిట్ట కథలు మొదలయినవి ఎవరయినా చెబితే, ఊకొట్టి గ్రహించేవారు, కాబట్టి వాటికి

"ఊకుడు కథలు" అనే పేరు వచ్చింది. నేడు బుర్ర కథలు, హరి కథలు మరికొంత అధికంగా ఆనందదాయకంగా ఉండేటట్లు హంగులు సమకూర్చుకొని అనేక మంది శ్రోతలను రంజింపచేస్తున్నాయి. దాసరులు, జముకులవారు. జంగంవారు చెప్పే కథలమీద మెరుగులు దిద్దిన కథలే హరికథలు, బుర్రకథలు. వీటికి మూలరూపాలు యక్షగానాలు అయి ఉంటాయి. కాని పొడుపు కథలు వీటికన్న భిన్నమైనవి

మెదడుకు మేతవేసేవి, బుద్ధికి నైశిత్యాన్ని కలిగించేవి, ఆలోచనలను ప్రేరేపించేవి, తెలివితేటలకు సానపెట్టేవి, పదును పెట్టేవి, జ్ఞానతృష్ణనుకలిగించేవి, యుక్తిప్రయుక్తి ప్రకటనా సామర్థ్యాన్ని పెంపొందించేవి, సమస్యలను పరిష్కరించే కౌశలాన్ని వృద్ధి చేసేవి. విద్యావైశద్యాన్ని కలిగించేవి, స్ఫూర్తిని కలిగించేవి, చమత్కారాన్ని ఆహ్లాదాన్ని కలిగించేవి, ఈ పొడుపు కథలు. పల్లెలలో తీరుబడిగా ఉన్నప్పుడు ప్రజలు ఏ రచ్చపట్టు వద్దనో చేరి, ఉజ్జీలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు ఈ పొడుపు కథలు పొడుచుకొంటూ వాటికి సమాధానాలు చెప్పుకొంటూ ఉత్సాహంతో కాలం గడుపుతూ ఉండేవారు. ఎక్కువగా పనిపాట్లు ఉన్నప్పుడు కూడా శారీరక కష్టాలను మరిచి ఉత్సాహంతో పని చేయడానికి కూడా పొడుపు కథలు ఉపయోగపడుతూ ఉండేవి.

పొడుపు కథలనే "విప్పుకథలు" (విప్పే కథలు) అని అనడం ఉంది. పొడుపుడు మాటలు=ఎత్తిపొడుపులు, a taunt or jeer అని బ్రౌణ్యంలో ఉంది, దీనికే "దెప్పుట" అని కూడా ఉంది. "వాడొక కథ పొడిచినాడు" అన్నదానికి "గూఢభావము గల చిక్కు ప్రశ్న వైచినాడు" అని ప్రయోగ విశేషాలతో సూర్యరాయాంధ్ర నిఘంటువులో చూపబడి ఉంది. నామట్టుకు నాకు ఇలా అనిపిస్తూ ఉంది. "నెల పొడుపునాటి వెన్నెల అలవడునే గాదె బోయ అమవసనిశికిన్" అన్న ప్రయోగం చూస్తే "పొడుచు" అంటే "ఉదయించు" అన్న అర్థం వస్తుంది. ప్రొద్దు పొడిచింది అన్న మన తెలుగు నుడికారం ఈ ఊహనే బలపరుస్తుంది. "పొడుచుకథ" పొడుపుకథ అయింది. ఎత్తి పొడుపు, దెప్పిపొడుపులలో బాధ ఉంది. కాని పొడుపుకథలో రమణీయార్థ ప్రతిపాదకత్వమూ చమత్కృతీ ఉన్నాయి. అందువల్ల పొడుపుకథ అంటే (జ్ఞానం) ఉదయించేకథ అని అర్థం చెప్పుకోవడం సమంజసము. కథలంటే పిల్లలకే కాదు అందరికీ ఇష్టమే. అవి జ్ఞానదాయకాలయినప్పుడు ప్రతివారు వాటికి పరుగులెత్త

పలసిందే. అన్ని వయస్సుల వారికి జ్ఞానాన్ని ఇచ్చే పొడుపుకథలు ఉన్నాయి. నేడు ఉన్న విద్యావిధానానికి భిన్నమైన విద్యావిధానం పూర్వం ఉండేది. శరీరానికి బలాన్నిచ్చే వ్యాయామాది క్రీడలు ఉన్నట్లే బుద్ధికి బలాన్నిచ్చే ఈ పొడుపు కథలు ఆటలుగా ఆడించేవారు. ఇందులోను గెలుపు ఓటములు ఉన్నాయి. యుద్ధంలో కానీ విద్యలో కానీ తమ ఆధిక్యాన్ని చూపుకొన్నప్పుడు కలిగే ఆనందం, విజయగర్వం అన్నిటికన్నా హెచ్చు. ఆ విజిగీష, విజయం పిల్లలలో ఆత్మ విశ్వాసముద్ర వేస్తుంది. ఈ పొడుపు కథలలో గెలుపు ఓటము లకు ఇదే ఫలితం. అయితే గెలిచినవారికి ఆనందం, ఉత్సాహం కలగ వచ్చు. ఓడినవారికి నిరుత్సాహం కలిగ వారు నిరాశ, నిస్పృహలతో నిండి పోరాః అనవచ్చు. ఇది పశుబల ప్రదర్శనకాదు. బుద్ధిబల ప్రదర్శనమాత్రమే. ఇది అతిసున్నితంగా ఉంటుంది. ఓడినవారు గెలవాలనే కోరికను పెంపొందించు కొంటారు. ఇది మంచి క్రమశిక్షణతో మన పూర్వులు ఏర్పాటు చేసిన జ్ఞానక్రీడ.

పొడుపు కథలు గేయరూపంలోనూ, పద్యరూపంలోనూ, వచన రూపం లోనూ ఉన్నాయి. జానపద సాహిత్యంలో చిన్న చిన్న ప్రశ్నలుగా, చిక్కు ప్రశ్నలుగా, యుక్తిప్రయుక్తులుగా ఉన్న పొడుపు కథలు మార్గ కవితా సంప్ర దాయంలో చిత్రకవిత్వంగా, గర్భకవిత్వంగా, బంధ కవిత్వంగా, అవధానాది విధానాలలో "సమస్య" ప్రక్రియగా కొత్తరూపు సంతరించుకొన్నాయి. ఇది ఏమిటి తెలుపుతూ ఉందంటే జానపద సాహిత్యంలోని పొడుపు కథ అనే ప్రక్రియ ఛందశ్శాస్త్రంలో ప్రవేశించిన తీరుతీయాలు చూడగా చూడగా అలంకార శాస్త్రంలోకూడా ఈ పొడుపు కథలు చోటుచేసుకొన్నాయనవచ్చు. గూఢోక్తి, వక్రోక్తి, సమాసోక్తి, విరోధాభాస, ముద్రాలంకారము, ఉత్తరాలంకారము, శ్లేష, అపహ్నవంలో ఛేకాపహ్నుతి, ఉత్ప్రేక్ష మున్నగు వాటిలో పొడుపు కథల ఛాయలున్నాయి అని కచ్చితంగా చెప్పవచ్చు. ఇక ఆనందవర్ధనుని ధ్వని వాదా నికి ప్రధానమయిన "వ్యంగ్యం" సర్వే సర్వత్ర కాకపోయినా పొడుపు కథలలో ప్రముఖపాత్ర వహిస్తుందనడం సాహసం కాదు. ఈ విషయాలను అవసరమయిన చోట వివరంగా తరవాత పరిశీలిద్దాం.

భారతంలోని యక్ష ప్రశ్నలలోనూ, భట్టివిక్రమార్కుని కథలలో భేతాళుడు వేసిన ప్రశ్నలలోనూ, కొన్ని కాశీమజిలీ కథలలోనూ, వినోద కల్ప

వల్లిలోనూ ఈ పొడుపు కథలు మొలకెత్తి, కొనసాగి, మారాకు తొడిగి, శాఖోప శాఖలుగా విస్తరిల్లి మొగ్గ తొడిగి, మూడుపువ్వులూ ఆరుకాయలుగా వర్ధిల్లినాయి.

సంస్కృతంలో వీటిని ప్రహేళికలంటారు. ఇంగ్లీషు భాషలో వీటిని Riddles అంటారు. హిందిలో వీటినే పహేళీ లేదా చుట్‌కులే అంటారు. ఉర్దూ భాషలో లతీఫా అంటారు. నేడు హిందీ ఉర్దూ భాషంలో ప్రచారంలోఉన్న "కవాలీ" మన పొడుపు కథ కోవలోకే చేరుతుంది. చుట్‌కులే పదంలో "చుట్" దాచడాన్ని "కులే" విప్పడాన్ని సూచిస్తున్నాయి. ఇవి మన పొడుపు కథ అర్థాన్ని చెప్పడంలో సరిపోయి ఉన్నాయి.

కొన్ని పొడుపు కథలు సామెతలుగా, జాతీయాలుగా కాలానికి కరిగి, ఆనోటా ఈ నోటా నలిగి అరిగి తరిగి నేడు అక్కడక్కడ మనకు కని పిస్తున్నాయి.

—:(o):—

పొడుపు కథలు

పొడుపు కథలు - లక్షణాలు

వీటిని సృష్టించినవారు ఎవరో చెప్పలేము. ఏక కర్తృకములు అసలేకావు. జానపదుల సృష్టి ఎక్కువగా వీటిలో ఉందనవచ్చు. వారు వారికి పరిచయమైన పరిమితమైన అనుభూతులను పొడుపు కథలుగా మలచినారు. సంఘంలోని బాంధవ్యాలు, కొన్ని వృత్తులలో వాడే పరికరాలు, కొన్ని విచిత్రమైన ఊహలు జన సన్నిహితమైన భాషలో శైలిలో సుకుమారంగా సుతారంగా చెప్పడం జానపద సాహిత్యంలోని పొడుపు కథలలో సర్వత్ర కనిపిస్తుంది. వీటిలో అనల్ప మయిన కవితాశిల్పం కూడా ఉంది.

పచ్చ పచ్చని తల్లి
పసిడి పిల్లల తల్లి
తల్లిని చీల్చితే
తియ్యని పిల్లలు

పనసపండులో తల్లి పిల్లలను చూడగలిగిన మధురహృదయం ఈ పొడుపు కథలో ఉంది. ఇంతకు మించిన కవితాశిల్పం ఎక్కడ ఉంది? సరస రస హృదయం ఈ భావనలో లేదనగలమా?

"తోక లేని పిట్ట తొంభై ఆమడలు పోతుంది." ఇది మరో పొడుపు కథ. ఈ రకం పొడుపు కథలు చాలా ఉన్నాయి. పొడుపు కథలకు అపార్థ కల్పన ఒకముఖ్య లక్షణంగా కనిపిస్తూ ఉంది. దానిలో భావస్ఫూర్తి ఉంటూనే ఉంటుంది. పిట్ట అని చెప్పటంతో పూర్వం మనవాళ్ళు పావురాలద్వారా ఉత్తరాలు పంపే పద్ధతి స్ఫురిస్తుంది. పావురంపిట్ట నాటి ఉత్తరం పిట్టకదా? కాని దానికి తోక ఉంది. మరి తోకలేనిపిట్ట అనటంతో నేటి ఉత్తరం స్ఫురిస్తుంది. ఈ పొడుపుకథ నాటి నేటి నాగరకతలను ప్రతిబింబిస్తూంది అనటం సబబు.

ఇంతవరకు అనేకులు అనేక సాహిత్య ప్రక్రియలకు లక్షణాలు నిర్వచించారు. కొందరు నాటకాలకు లక్షణాలు చెప్పేరు. మరికొందరు కావ్యాలకు లక్షణాలు వివరించారు. ఇంక కొందరు నవలలకు, కథలకు, కథానికలకు లక్షణాలు నిర్దేశించారు. జానపద సాహిత్యంలోని యక్షగానాదులకు లక్షణాలు వెల్లడించారు. కాని పొడుపు కథలకు లక్షణాలు ఇదమిత్థంగా ఎవ్వరూ నిర్వచించినట్లు కనిపించదు. కొంత పరిశీలన చేస్తే పొడుపు కథలకు లక్షణాలు ఇవి అంటే బాగుంటుందనిపిస్తుంది.

పొడుపు కథకు లక్షణాలు :

1. సంక్షిప్తత. కొండంతభావాన్ని కొద్ది మాటలలో అందించడం దీని ముఖ్యలక్షణం.
2. నిగూఢత్వం. స్వరూపనిగూఢత్వం ఉంటుంది. అది అర్థస్వరూపం, భావస్వరూపం, విషయస్వరూపం, పదస్వరూపం, పదార్థస్వరూపం కావచ్చు. ఏదైనా స్వరూప నిగూఢత్వం ముఖ్యం.
3. అపార్థకల్పన. వేరొకటి అయి ఉంటుందేమో అని భ్రమ కల్పించే అపార్థ కల్పన తప్పక ఉంటుంది.
4. వినోదాత్మకమైన క్రీడారూపంగా ఉంటుంది.
5. రేఖామాత్రమైన భావస్ఫురణ ఉంటుంది.
6. రసస్ఫూర్తి కూడా ఉంటుంది.
7. సమస్యగా భాసించి పరిష్కారాన్ని కోరుతుంది.

ఇందులో కొన్ని లక్షణాలు మాత్రమే ఉంటే వాటిని పూర్తిగా పొడుపు కథలు అనలేము. వాటిని పొడుపు కథల ఛాయలున్న వాటిగా మాత్రమే చెప్పాలి.

వచనరూపంలోఉన్న పొడుపు కథలు :

1. అడవిలో ఆబోతు అంకె వేసింది. (గొడ్డలి)

ఆబోతు అంకెవేస్తే దానికి ఎదురు, తిరుగు ఉండదు. దాని విజృంభణను ఎదిరించేదేలేదు. అడవి కలపకు ప్రతీకగా తీసుకొంటే దానిమీద

విజృంభణ చేసేగి గొడ్డలి. దీనికి ఎదురులేదుగదా! ఇది కట్టెలు కొట్టే వాని పనిముట్టు. జానపదులు వివిధ వృత్తులవారు వాడే పనిముట్లను చాలా వరకు పొడుపుకథలుగా మలచినారు.

2. "అన్న" కందవు "అమ్మ" కందుతాయి. (పెదవులు).
ఇది శబ్దవిషయ స్వరూప నిగూఢత్వం.

3. ఇంతింతాకు బ్రహ్మంతాకు, పెద్దలు పెట్టిన పేరంటాకు. (మంగళసూత్రం).

4. ఊరంతకీ ఒక్కటే దుప్పటి. (ఆకాశము).
చెట్టు తొఱ్ఱలలోనూ, కొండగుహలలోనూ నివసించే ఆదిమమానవులు నిలువ నీడ, గూడు లేనివారు. వారికి ఆకాశమే పైకప్పు అన్న నాటి నాగరకతను సూచిస్తూంది.

5. ఏ రాయి వద్దన్నా ఆ రాయి కావాలి. (ఉప్పు రాయి).
ఇదే మన జీవనానికి ముఖ్యం.

6. గుప్పెడు పిట్టకు బారెడు తోక. (కలువ పువ్వు).

7. చలి లేక నిప్పు కాగేవాడు, తాపం లేక చెరువులో నానే వాడు, బ్రతికుండీ గోతిలో కూర్చుండేవాడు ఏ వూళ్లోబడితే, ఆ వూళ్లోనే ఉన్నాడు. (కంసాలి, చాకలి, సాలె).
ఇది నాటి సాంఘిక జీవనం తెలుపుతూఉంది.

8. చాప చుట్టనూ లేము - చంకబెట్టనూ లేము. (ఆకాశము).

9. జొన్న చొప్పలో చుప్పనాతి. (తేలు).

10. దోసెడు నీళ్లల్లో దొరసాని జలకాలాడుతోంది. (వెన్నముద్ద).

11. నడచిపోయే నల్లరాతికి నాలుగే లింగాలు. (గేదె).

12. నిటారు నిలువులు పటాకుబయళ్ళు మజ్జిగముంతలు మాణిక్యాలు. (కొబ్బరి చెట్టు).

13. నోరులేని పిట్ట తోకతో నీళ్ళు త్రాగుతుంది. (దీపం వత్తి).

14. పిఠాపురం చిన్నవాడా! పిట్టల వేటకాడా! బతికిన పిట్టను కొట్టావద్దు. చచ్చిన పిట్టను తేనూవద్దు కూరకు తేకుండా రానూవద్దు అందిట. (కోడి గ్రుడ్డు).

15. మారు కథా మంకెన్నా మా మామ కొంకెన్నా మళ్ళావస్తే కుంచన్నా నాకూ నీకూ లంకెన్నా. (గొళ్ళెము).

16. రాజా వారి తోటలో రోజాపూలు చూచేవారే కానీ కోసేవారు లేరు. (ఆకాశాన నక్షత్రాలు).

17. వస్తాడు పోతాడు నాకొరకు, వచ్చి కూచున్నాడు నీ కొరకు. సగము చచ్చి ఉన్నాను నీ కొరకు, పూర్తిగా చచ్చేవు నా కొరకు. (గాలాన్నిగుచ్చిన ఎర, చేప).

18. వేయికళ్ళ పులి ఏట్లో వేటాడబోయింది. (వల).

గేయ రూపంలోని పొడుపు కథలు :—

చిన్నపిల్లలకు గేయ రూపంలోని పొడుపు కథలు వాచకశక్తిని పెంచుతాయి. ఇందులోని అనుప్రాసలు, అంత్యప్రాసలు, పిల్లలకు జ్ఞాపకశక్తిని వృద్ధి చేస్తాయి. ఊహను పెంపొందింపచేస్తాయి. క్రమేపి జ్ఞానతృష్ణను కలిగిస్తాయి. ఉదాహరణకు కొన్ని చూపిస్తాను.

1. అడవిలో పుట్టింది అడవిలో పెరిగింది
మాయింటి కొచ్చింది మాయమ్మ మెచ్చింది
తాడోసి కట్టింది తైతెక్క లాడింది
కడవలో దూరింది గట్టుమన్నాది
పెరుగులో మునిగింది వెన్నింత తెచ్చింది
నాకింత పెట్టింది.

(కవ్వము).

2. చెక్కని స్తంభం, చేరికందదూ
చెయ్యని కుండ, పొయ్యని నీళ్ళు
వెయ్యని సున్నం తెయ్యంగా

(కొబ్బరిచెట్టు, కొబ్బరికాయ).

3. నల్లని నాగీ నంగనాచీ
తెల్లని తిమ్మి తీట కసిందా

పచ్చని బాపీ బావ నోట్లో
కచ్చా పచ్చా కరా కరా.

(తాంబూలము).

4. పండు గాని పండూ పండువెన్నెల చెండూ
పువ్వు గాని పువ్వూ పూసుకొంటే నవ్వూ
కట్ల గాని కట్టా, కరేపాకు జుట్టా
గొడుగు గాని గొడుగూ, కోరరాని పిడుగు.

(విభూతిపండు, కుంకుమ పువ్వు, జీడికట్ట, కుక్కగొడుగు).

5. పొదల పొదల బువ్వా ! పొంకమైన గువ్వా !
బువ్వలోకి మువ్వా ! పురుగుల తినే అవ్వా !
రాజులు పొడిచే రవ్వా ! రాత్రి తెలిపే రవ్వా !
నున్ననైన గువ్వా, నూకలు తినే తవ్వా !

(కోడిపుంజు).

6. రాచవారికి నచ్చే చిన్నదీ !
రాజ్యాలల్లా మెచ్చే నన్నదీ !
బంగారు వారింటి కోడలూ !
పట్టుమంచేరాదు బేదలూ
చేంతాడుతో తోడకుండా
చెంబుతో ముంచకుండా
నీటుగాను కుల్కుతున్నదీ
నీళ్ళు తెస్తానంటువున్నదీ.

(కొబ్బరికాయ).

7. వంకర టింకర మానూ ! వయ్యారి మానూ!
రాజు లెక్కే మానూ ! మావూరొచ్చేగూనూ !
కాపు లెక్కే మానూ ! కష్టజీవుల మానూ !
ఎత్తుకు తిరిగేమానూ ! ఇంతుల పెండ్లికౌనూ !

(పల్లకి).

8. వంకర టింకర శొ; వాటి తమ్ముడు అ;
నల్లని పిల్లా మి; నాకేమిస్తావు తే.

(శొంఠి, అల్లము, మిరియాలు, తేనె)

ఇందులో వైద్యశాస్త్ర రహస్యం ఇమిడి ఉంది. దానిని వివరిస్తే పిల్లలకే కాదు పెద్దలకూ పనికివస్తుంది.

అర్థరాత్రి ఆసుపత్రికి ఆరు ఆమడల దూరంలో ఉన్న ఊళ్ళో కడుపు నొప్పి వచ్చి వంకరటింకరగా మెలికలు తిరిగిపోతున్న రోగికి ఏమిస్తావు? అంటే వంకరటింకర "శొ". వంకరటింకరగా ఉండేది "శొంఠి" అనీ, వాడి తమ్ముడు "అల్లము" అనీ, నల్లనిపిల్లా "మిరియము" అని అర్థం చెప్పేవారున్నారు. అదీ సొగసుగానే ఉంది. కానీ అంతకన్నా ముఖ్యమైన అర్థం ప్రాణాపాయ స్థితిలో కాపాడే చిట్కా ఒక రసఘుటిక తయారుచేసే విధానం ఇమిడి ఉంది. కడుపు నొప్పితో వంకరటింకరగా రోగి మెలికలు తిరిగితే శొంఠి ఇవ్వండి. కడుపు నొప్పికి తమ్ముడు అజీర్ణం. దానివల్ల కూడా కడుపునొప్పి రావచ్చు. అందుచే "అల్లం" కూడా ఇవ్వండి. నల్లనిపిల్ల మిరియం కూడా జోడించండి రక్త ప్రసరణ సరిగా లేక కూడా కడుపునొప్పి రావచ్చు. అంతేకాక ఒకదానిని చురుకుగా పని చేయించే శక్తి మిరియానికి ఉంది. ఈ మూడూ తేనెలో రంగరించి ఇస్తే అయిదు, పది నిమిషాలలో గుణం కనిపిస్తుంది.

నల్లనిపిల్లామి అన్నదానికి "నల్లాగుడ్లామి" అని మరో పాఠాంతరం ఉంది. ఇప్పుడు దీనిమీద మరోవిధమైన అర్థం వస్తుంది. వాడి తమ్ముడు అన్న దానికి కడుపునొప్పికి తమ్ముడు అజీర్ణమనీ దానికి అల్లం ఇవ్వండని చెప్పు కున్నాం. వాడి ఉంటే వాడిపోయిఉంటే అజీర్ణం వల్ల వచ్చి ఉంటుందని గ్రహించి అల్లం ఇవ్వాలి. తమ్ముడు అన్నది సంబోధన తమ్ముడు నాకేమిస్తావు ? అన్న దానికి అది సమన్వయించుకోవాలి. నల్లాగుడ్లా అంటే రోగి గుడ్లు తేలవేస్తే మిరియము ఇవ్వాలి అని రోగలక్షణాలు వాటికి మందులు చెప్పినట్లు గ్రహించాలి.

ఇట్లాంటి శాస్త్రాంశాలు పొడుపు కథల రూపంలో అవతరించాయి. ఇవి ప్రచారానికి ప్రచురసాధనాలు. ప్రతి ఇంటా, ప్రతినోటా ఇవి నలిగే అవకాశం ఉంది. అయితే ఎటొచ్చీ శాస్త్రాంశం ఇమిడి ఉందని తెలియకపోతే దానిని తెలుసు కొనే ప్రయత్నమే చెయ్యరు. శాస్త్రాంశాలున్న పొడుపుకథలు వేరుచేసి వాటికి

వివరణ వ్రాసే ప్రయత్నం జరిగితే లోకోపకారకమవుతుంది. వాటిని పదిమందికీ తెలియచెప్పే ప్రయత్నమైనా చెయ్యడం మన కనీసధర్మం.

9. పట్లవాడు చెక్కలేని వయ్యారి మొగ్గా
వాకిట్లో పడ్డాది వన్నెల్ల బుగ్గా,
ముంగిట్లో ఆ బుగ్గ మూతిపై వంగా,
వంగిన్న గూనిపై వన్నెల్ల మూట,
మూట చాటుగ వచ్చి ముసలి చంకెక్కా.

(ముగ్గు; ఎంగిలి; దాకలిమూత, పొది).

ఇది పల్లె శోభను చక్కగా వ్యక్తీకరిస్తూ ఉంది. వన్నెల్ల బుగ్గా అన్న ప్పుడు వన్నెల బుగ్గి + ఆ వన్నెల బుగ్గా అని అర్థం చేసుకోవాలి. అప్పుడే పల్లెలో ప్రతి వాకిట ప్రభాతవేళ ఉండే రత్నాల రంగవల్లుల శోభ, ముత్యాల ముగ్గుల శోభ అవగతమవుతుంది.

10. జీడి వారి కోడలూ సిరి గల వారికి ఆడబడుచూ
వయసులో కుల్కే వయ్యారీ వైశాఖమాసంలో వస్తుంది.

(మామిడిపండు).

మామిడి పండును సిరిగలవారికి ఆడబడుచుగా జీడి వారి కోడలుగా వయసులో కులికే వయ్యారిగా ఊహించడంలోని జానపదుల హృదయమంజులత స్పష్టమవుతుంది. వసంతంలోవచ్చే ఈ పండు వాడితే (తింటే) ఎన్ని వసంతాలు వెళ్ళినవారైన వయ్యారంగా మిసిమి వయస్సుతో సిరిగలవారికి ఆడపడుచులుగా ఉండవచ్చు నన్న వైద్యశాస్త్ర ఉపదేశం ఇందులో చోటు చేసుకుంది.

11. ముక్కుమీద కెక్కూ ! ముందరి చెవులు నొక్కూ !
టక్కుల నిక్కుల పొక్కూ ! జారిందందే పురుక్కూ !

(కళ్ళజోడు).

12. తెక్కలు ముయ్యని పక్షి
రెప్పలు ముయ్యని జాణ
రంయ్ మంటూ రేపెట్టు
రేపు మాపూ చేపెట్టూ !

(తూనీగ, చేప, కందిరీగ, చేతపెయ్య).

ఈ పొడుపు కథ భారత యక్షప్రశ్నను మించి ఉంది. యక్షప్రశ్నలలో నిద్రించియును కన్నుమూయని దెద్ది? అని ఉంది. చేప నిద్రించి కన్నుమూయదు. దానినే రెప్పలు (కనురెప్పలు) మూయని జాణ అన్నాడు ఇక్కడ. దానిని మించి రెక్కలు మూయ్యని పక్షి ఏది అన్నది మరో ప్రశ్న జోడించాడు. అది తూనీగ, ప్రకృతి పరిశీలనలో మనది అందె వేసిన చెయ్యి.

13. గోడమీద బొమ్మ । గొలుసుల్ల బొమ్మ
వచ్చిపోయే వారికి వడ్డించు బొమ్మ ।

(తేలు).

14. కిట కిట తలుపులు కిటారు తలుపులు
ఎంతమూసినా చప్పుడు కావు.

(కళ్ళు).

15. తండ్రి గర గర
తల్లి పీచు పీచు
బిడ్డలు రత్నమాణిక్యాలు.

(పనసపండు).

16. ఆకాశాన అరవై గదులు
గదికొక్క సిపాయి
సిపాయి కొక్క తుపాకి.

(తేనే పట్టు).

జానపదు లెరిగిన సత్యం. రాజులు, రాజుల కోట అరవై గదులు. అందే చాలా పెద్దది. గదికొక్క సిపాయి రక్షణచేస్తూ ఉంటాడు అన్నంతవరకు. వాడికో తుపాకి ఉంటుందన్నంతవరకే వారు ఎరుగుదురు. తేనె పట్టును వారికి తెలిసిన భావానికి సరిపోయే తీరులో కమ్మని జానపదుల పలుకుబడిలో పొడుపు కథగా పొదిగినారు.

ఏల పాటలు. కోలాటం పాటలు, కొన్ని కొన్ని తత్త్వాలు సంవాద రూపంలో ఉండి పొడుపు కథలనిపిస్తాయి. వాటిలో ఒకటి రెండు ఉదహరిస్తాను.

ఏలపాట - సంవాదం

సిద్ధయ్య :— బోడివాడెవదయ్యా ? బొచ్చు వాడెవదయ్యా ?
మొలచుట్టూ కత్తులున్న వానిపేరెవరయ్యా ।
పోతులోరో । శివపోతులోరో ।

వీరబ్రహ్మం :— బోడివాడు వెలక్కాయ, బొచ్చువాడు కొబ్బరికాయ
మొలచుట్టూ కత్తులున్న వాని పేరు వంకాయ ।
సిద్ధయ్యగారూ । జ్ఞాన సిద్ధయ్యగారూ ।

సిద్ధయ్య :— ఊరకున్నదేదయా ? ఊగులాదేదేదయా ?
కాళ్ళసందుదేదయా ? కమ్ము కొచ్చేదేదయా ?
పోతులోరో । శివపోతులోరో ।

వీరబ్రహ్మం :— ఊరుకున్నదావయా । ఊగులాదేది దూదయా ।
కాళ్ళసందుది ముంతయా । కమ్ముకొచ్చేవి పాలయా ।
సిద్ధయ్యగారూ । జ్ఞాన సిద్ధయ్యగారూ ।

కోలాటం పాట

పల్లవి :— తాన తందాని తాన । తక్కితై తాన తందానితాన
నల్ల నల్లని పక్షి యొకటి । నడినెత్తిని రెక్కలు వచ్చె
చేతులార గోళ్ళువచ్చె । చెవులసందున కొమ్ములొచ్చె
॥తాన తందాని తాన॥

దానిపచ్చ రత్నములు । కత్తిన కత్తిన కోసి
బ్రాహ్మ లనక బంటు లనక । బంతిని భోంచేసిరంట ।
॥తాన తందాని తాన॥

ఎంత చెప్పిన వేదశాస్త్రం తెలియదాయె దాని భావం
దానిభావం బట్టబయలు । దానిపేరె అరటిచెట్టు ।
॥తాన తందాని తాన॥

సందకాడ లగ్గమాయె । సానిపొత్తున గర్భిణాయె
తెల్లవారిన పిల్లతల్లి । పొద్దుపొడువ పేరుకొచ్చె ।
॥తాన తందాని తాన॥

ఎంత చెప్పిన వేదశాస్త్రం । తెలియదాయె దానిభావం
దాని భావం బట్టబయలు । దానిపేరె చల్లకుండ ।

॥తాన తందాని తాన॥

ఇంటివెనక కుప్పవేసి । కుప్పకు నిప్పును పెట్టి
కుప్ప కాలిపోతేను । అప్పులెల్ల తీరిపోయె

॥తాన తందాని తాన॥

ఎంత చెప్పిన వేదశాస్త్రం తెలియదాయె దానిభావం
దాని భావం బట్టబయలు । దానిపేరె కుమ్మరావం ।

॥తాన తందాని తాన॥

పద్యరూపంలోని పొడుపు కథలు :—

ఆ.వె. చలన శక్తి గలదు జంతువుగాదది
చేతు లెపుడు త్రిప్పు శిశువు గాదు
కాళ్ళు లేవు సర్వకాలంబు నడచును
దీని భావమేమి ? తిరుమలేశ !

ఇది ఇంగ్లీషు, హిందీ నుడికారాలతో ఉన్నది. ఇంగ్లీషు భాషలో గడియారపు ముళ్ళకు Hands అంటారు. దానిని తెలుగు చేసి చేతులు అని వాడటం జరిగింది. ఈ నుడికారం ఇంగ్లీషు భాషది. ఇంక గడియారం పని చేస్తున్నాది అనడానికి Working అనడం ఇంగ్లీషు భాషలో పరిపాటి. కాని "చల్‌రహీ" అంటారు హిందీ నుడికారంలో. దానికి తెలుగు "నడుస్తున్నాది". ఈ నుడికారాలు తెలిస్తేకాని ఇది గడియారము అని చెప్పలేం.

ఆ.వె. కాళ్ల రెండు గలవు గాని మానిసిగాదు
నోరు గల్గి యెదుటి వారి నణచు
గాలి మేసి లెస్సగా నరుమోయును
దీని భావమేమి ? తిరుమలేశ !

ఇక్కడ "చక్రాలు" అనటానికి బదులు "కాళ్లు" అని వాడినాడు. రెండూ నడవటానికి పనికి వచ్చేవే. దీని నోరు "బెల్" అన్నమాట. గంటకొట్టి ఎదుటి

వారిని దారినుంచి వైదొలగమని హెచ్చరిస్తుంది. గాలిమేత అంటే దాని ట్యూబులలో "గాలి" అన్నమాట. ఇప్పుడు సైకిలు అని స్పష్టంగా తెలుస్తుంది.

ఆ.వె. మనుజు డేమి కాదు మాటలాడగ నేర్చు
పాటగాడు కాదు పాడ నేర్చు
కథలు పెక్కు నుడువు - కాదు జేజయ్యయు
దీని భావమేమి ? తిరుమలేశ !

(రేడియో).

ఆ.వె వేయి కనులు గలిగి వెలయు నింద్రుడు కాదు
కాళ్లు నాల్గు కలిగు కాదు పసువు
నరుడు పట్టకున్న నడువగా జాలదు
దీని భావమేమి ? తిరుమలేశ !

ఇంద్రుడు వేయి కన్నులవాడు అని అతనిని సహస్రాక్షుడు అంటారని, మూడు కళ్ళవాడు ఈశ్వరు డనీ, వేయి చేతులవాడు సూర్యుడు అనీ. పది తలలవాడు రావణు డనీ, అయా యీ విషయాలన్నీ విద్యార్థికి చెప్పవచ్చు. విద్యాబోధనలో ప్రతి పదానికి అర్థం చెబితే సరిపోదు. ఒక సందర్భాన్ని తీసుకొని అటూ ఇటూ కొంతమేర ఇతర విషయాలను అందివ్వడమే మంచి విద్యాబోధనకు లక్షణం.

ఈ పొడుపు కథలో ఇవన్నీ చెప్పడానికి వీలుఅవుతుంది. ఇప్పుడు పొడుపు విప్పితే "మంచము". ఇది నులకతో నేసిన మంచము. దీనికి అనేకమైన గడులు (గళ్లు) ఉంటాయి. వీటిని కన్నులు అనడం కూడా కద్దు. వేయి అంటే నిజంగా పదివందలన్న అర్థంలో కాకుండా "చాలా" అన్న అర్థంలో వాడారని తెలియ చెయ్యాలి. ఇది తెలుగువారి నుడికారం.

ఆ.వె. వంగతోట నుండు వరిమళ్ళలో నుండు
జొన్న చేల నుండు చోద్యముగను
తలుపు మూలనుండు తలమీద నుండును
దీని భావమేమి ? తిరుమలేశ !

వంగ తోటలో ఉండేదీ, వరిమళ్ళలో ఉండేదీ, జొన్న చేలలో ఉండేదీ, తలుపు మూల ఉండేదీ, ఏదో ఒకటి ఉంటుందని దానికోసం వెతుకుతాం. అట్లా

మనలను భ్రమింప చేయడమే ఈ పొడుపులోని విశేషం. నిజానికి దేనికదే చూడాలి సమాధానం కూడా ఇందులో ఇమిడిఉంది. ప్రశ్నలో సమాధానం ఇమిడిఉంటే ఉత్తరాలంకారం అంటారు ఒక పద్యంలో మరో పద్యం ఇమిడి ఉంటే గర్భకవిత్వం ఉంటాము. అర్థలోనే సమాధానం ఇక్కడ ఇమిడి ఉంది.

వంగ - తోటనుండు, వరి - మళ్ళలోనుండు
జొన్న - చేలనుండు, తలుపు - మూలనుండును
తల - మీదనుండును.

సమస్యలేకుండా సమస్యగా భ్రమింపజేసే అపార్థ కల్పన దీనికి ఉంది. పదం విఱుపులతో సమస్య పరిష్కరించాం.

ఆ. వె. కొండనుండు నెమలి కోరిన పాలిచ్చు
పశువు శిశువు తోడ పలుక నేర్చు
వనిత వేదములను వల్లించు చుండును
బ్రాహ్మణుండు కాకి పలలము దిను.

దీని అర్థం చెప్పమంటే ఇది పొడుపుకథ అవుతుంది: బ్రాహ్మణుడు పలలము (మాంసం) తినడు. కాకి మాంసం ఎవ్వరూ తినరు. అది బ్రాహ్మణుడు తింటాడు అనటం అసలే కుదరదు. పై పాదాలలోని వాటికి అర్థం సమన్వయం కాదు. అందుకే ఇది పొడుపుకథ.

వాక్యంలో ఒకానొకండు తక్క అన్ని పదాలు క్రమ నిరపేక్షంగా ప్రయోగించవచ్చు అని చిన్నయ సూరి తన బాలవ్యాకరణంలో అన్నాడు. అంటే కర్త కర్మ క్రియలు ఒక క్రమంలో ఉండాలన్న నియమంలేదు. ఇది మనం గ్రహిస్తే పొడుపుకథ విప్పగలము.

పై పద్యంలో ఒక్కొక్కపాదం ఒక్కొక్క వాక్యంగా భాసించేటట్లు వ్రాయడంలోనే చమత్కారమంతా ఉమిడి ఉంది. దాని అర్థం ఇప్పుడు పరిశీలించండి. విరుపులతో సమస్య పరిష్కరించవచ్చు.

కొండునుండు నెమిలి - కోరిన పాలిచ్చు పశువు,
శిశువుతోడ పలుకనేర్చు వనిత,
వేదములను వల్లించుచుండును బ్రాహ్మణుండు
కాకి పలలము తిను.

క॥ శిల వృక్షలతల బుట్టిన
చెలువలు మువ్వురును గూడి చిడిముడిపడుచున్
తలవాకిట రమియింతురు
సులభముగా దీని తెలియ సుజనులు గలరే?

ఇది తాంబూలము సున్నపురాయి సున్నం పుట్టుకకు మూలం. పోక చెట్టు వక్కకు మూలం. తమలపాకుకు లత మూలం. తలవాకిలి నోరు. ఈ మూడూ చిడిముడి పడుతూ నోట ఉంటాయి.

తే.గీ. ఒక్క ఉద్యోగి పేరు నాల్గక్కరములు
మొదటి వర్ణంబు దెలపిన కదనమగును
మూడవది దెలుపగ హస్తమునకు జెల్లు
నట్టి యుద్యోగి ఎవ్వడో అరసి చెపుడు.

కరణము. ఇందులో నాలుగు అక్షరాలున్నాయి. మొదటి అక్షరం తీసి వేస్తే-రణము అంటే కదనము. మూడో అక్షరం తీసివేస్తే కరము. ఇది హస్తమునకు చెల్లుతుందిగదా!

తే.గీ. ఒక్క పురము పేరొప్పు నైదక్కరముల
మొదటి మూడును వత్సరమునకు పేరు,
చివరి రెండును వీథికి జెల్లు, వేణి
యగు ద్వితీయాంతముల జెప్పుడాపురంబు.

ఈ చెప్పిన కట్టుబాట్లకు ఒదిగి ఉండేది మాత్రమే దీనికి సమాధాన మవుతుంది. విజయవాద - ఇందులో అయిదక్షరాలున్నాయి. మొదటి మూడు "విజయ". ఇది ప్రభవాది అరవై సంవత్సరాలలో ఒక సంవత్సరానికి పేరు. చివరి రెండు "వాద" అంటే వీధి. ఇంక ద్వితీయాంతములు అంటే రెండో అక్షరం చివరి అక్షరములు చూడాలి. జవ - ఇది వేణికి చెల్లింది.

తే.గీ. అరయ నాల్గక్షరముల శివాఖ్య యొప్పు
వాని తల గొట్ట ఇందిరా వల్లభుదగు
వాని తల గొట్ట నర్ధంబు భర్తయగును
అట్టి పదమేదొ? పేర్కొను డార్యులార!

నాల్గక్షరాల పేరై ఉండాలి. శివునికి అర్థం రావాలి. ఈ పద్యంలో "తలకొట్ట" అన్న పదప్రయోగం ఉంది. దాని అర్థం తల బద్దలు గొట్టడం కాదు. మొదటి అక్షరం తీసివేస్తే అని గ్రహించాలి. ఆ నాల్గక్షరాల శివుని పేరులో మొదటి అక్షరం తీసివేస్తే విష్ణువు (లక్ష్మీభర్త). దాని మొదటి అక్షరం తీసివేస్తే "భర్త" కు అర్థం వస్తుంది. అదేమిటో చెప్పండి.

ఉమాపతి - నాల్గక్షరాలపేరు. శివుడు అని అర్థము దానిలో మొదటి అక్షరం తీసివేస్తే "మాపతి" (లక్ష్మీభర్త) అని అర్థం. దాని మొదటి అక్షరం తొలగిస్తే "పతి" (భర్త) అని అర్థం

క॥ చెట్టుకు నాల్గక్షరములు
తొట్టతొలుత యక్షరంబు త్రోసిన త్రాడౌ
చెట్టెయ్యది ? త్రాడెట్లగు ?
బట్టుగ దెల్పుటకు గడువు పదినెల లిత్తున్.

మందారము. సున్న ముందు అక్షరంతో కలిపి ఒకటిగా గ్రహిస్తే నాల్గక్షరాల చెట్టు. మొదటి అక్షరం తీసివేస్తే దారము (త్రాడు) అని అర్థము.

ఆ వె. కనులు మూడు గలవు - కాదు త్రినేత్రుండు
పక్షిగాదు చెట్టు పైన నుండు
జలము దాల్చి యుండు నలమేఘుడును గాదు
దీని భావమేమి ? తిరుమలేశ ?

ఈ ఛాయలతో ఉన్న శ్లోకం చూడండి. దాని కిది పూర్తిగా అనువాదం కాదు. కాని కొంతవరకు అనుకరణ ఉందనవచ్చు. రెండింటికీ అర్థం ఒక్కటే.

శ్లో॥ వృక్షాగ్రవాసీ నచ పక్షిరాజః
చర్మాంగ ధారీ నచ సోమయాజీ
త్రినేత్రధారీ నచ శూలపాణిః
జలంచ బిభ్రన్న ఘటో నమేఘః.

టెంకాయ అని సమాధానము. దీనికి మూడు కళ్ళు ఉంటాయి. ఈశ్వరుడు కాదు. చెట్టుపైన ఉంటుంది. కాని పక్షి కాదు. జలం దాల్చి ఉంటుంది కాని మేఘం కాదు.

శ్లోకంలో ఉన్న "చర్మాంగిధారీ న చ సోమయాజీ" అన్నదీ, "నఘటః" అన్నదీ పద్యంలో తెనిగించినట్లు లేదు. టెంకాయకు పైన ఉన్న పీచు ఇక్కడ చర్మంగా చెప్పబడింది. మేఘం, కుండా రెండూ నీటిని ధరించేవే. వీటిలో "ఏది కాదు" అంటాడు శ్లోకంలో. మొత్తంమీద శ్లోకంలోనూ, పద్యంలోనూ ఉన్నదానికి సమాధానం "టెంకాయ" అన్నదే అని మనం గ్రహించాలి.

తే గీ. ఆలి నొల్లక యున్న వానమ్మ మగని
అందులో దాగి యున్న వానక్క మగని
నమ్మినాతని జెరుచు దానమ్మ సవతి
సిరులు దయచేసి మిమ్ము రక్షించుగాత.


ఆలినొల్లకయున్నవాడు=భీష్ముడు. అతని అమ్మ=గంగ; ఆమె మగడు=సముద్రుడు; అందులో దాగియున్నవాడు=మైనాకుడు; వాని అక్క=పార్వతి; ఆమె మగడు=శివుడు; అతనిని నమ్మిన అతడు=రావణుడు; అతని జెరిచినది=సీత; దాని అమ్మ=భూదేవి; ఆమె సవతి=లక్ష్మి; సిరులు దయచేసి మిమ్ము రక్షించుగాత.

ఆ వె. తండ్రి కొడుకు లొక్క తరుణిని రమియింప
పుత్రు లిద్ద రొంది పోరు గలుగ
నొకని జంపి రాజ్య మొకని కిచ్చిన ప్రభు
వాతడిచ్చు మాకు నఖిల సిరులు.

సూర్యుడు-యముడు-వీరు తండ్రీ కొడుకులు వీరు కుంతీదేవిని పొందగా కర్ణుడు ధర్మరాజు కలిగారు. కర్ణుని చంపి ధర్మరాజుకు రాజ్యమిచ్చిన ప్రభువు శ్రీకృష్ణుడు. అతడు మాకు అఖిల సిరులు ఇచ్చును.

చ॥ మమతను తాను నొక్క చెలిమానిని! నీ విభునామమేమనన్
కమలజగంధి ఖల్కెకరి, కంధి, ప్రజాపతి, చంద్రికా, తప
త్రమును త్రివర్ణయుక్తముగ వ్రాసిన నందుల మధ్య వర్ణముల్
క్రమముగ వ్రాసి చూడు గజగామిని! నా విభునామమేర్పడున్.

పరువం పరవళ్లు తొక్కే చిన్న[...]చేరి స్నేహితురాలు "ఓ! మానినీ! నీ విభు నామమేమిటి[...] కదూ! చెప్పడానికి అభిమానం అడ్డమయింది. స్నేహితురాలు అడిగింది కనక చెప్పనని అనలేక



పోయింది. చెప్పననకుండా చెప్పిన ఆ సమాధానంలో పొగరూ సొగసూ కూడా ఉన్నాయి. ఏనుగు; సముద్రము; బ్రహ్మ, వెన్నెల, ఛత్రము- వీటి పేరులు మూడక్షరాలతో ఉండేటట్లు వ్రాసి వాటి అన్నిటి మధ్యమాక్షరాలు క్రమంగా వ్రాసి ఓ గజగామిని చూడు నా భర్త పేరు వస్తుంది అంటుండి. వీటికి మూడేసి అక్షరాలున్న పేర్లు చాలా ఉన్నాయి. ఏవి సరిపోతాయో? తెలీదు. ఆమె భర్త పేరు రాముడో? భీముడో? రంగధాముడో?!! మనం పరిశీలిద్దాం.

సారంగం; సాగరం; విధాత; కౌముది; గొడుగు

(రంగధాముడు).

చెలికత్తె తన భర్త పేరు ఇట్లా ఉంటుంది అని మాత్రం చెప్పింది.

తే గీ. సిరియు వృక్షంబు ధనపతి పరిమళంబు
నలు దసురయు నుపవనం బసియు నావ,
అందు మూడేసి వర్ణంబు లమరు శబ్ద
మధ్యమాక్షర పంక్తి నామగని పేరు

ఈమె భర్తపేరు తొమ్మిది అక్షరాల పేరుది. ఇంత పెద్ద పేరున్న వాడెవడో మరి మీరే ఆలోచించండి.

ఉ॥ మామను సంహరించి యొక మామకు గర్వమడంచి యన్నిఁ కా
మామను రాజుచేసి తన మామ తనూజుల కాత్మ బంధువై
మామకు కన్ను లిచ్చి సుతుమన్మథునింతికి తాను మామయై
మామకు మామయైన పరమాత్ముడు మాకు ప్రసన్నుడయ్యెడున్.

ఈ మామల కర్థం చెప్పడమే ఇందులోని పొడుపు. మొదటి మామ కంసుడు; రెండో మామ జాంబవంతుడు; మూడో మామ - చంద్రుడు; నాలుగో మామ - పాండురాజు; ఐదో మామ - ధృతరాష్ట్రుడు; ఆరో మామ - తానే రతీదేవికి మామ; ఏడో మామ - మామకు మామ - విష్ణువు. సముద్రుని కూతురు లక్ష్మి - లక్ష్మి భర్త విష్ణువు. దీనివల్ల విష్ణువుకు మామ సముద్రుడు. సముద్రుని భార్య గంగ. ఈ గంగ విష్ణుపాదం నుంచి పుట్టింది. అందుకే గంగ విష్ణువుకి కూతురు. అంచే మామకు మామ అయినాడు.

ఈ దిగువ పద్యంలో నాలుగు పాదాలలోను రెండేసి ప్రశ్నలు వేసి వాటికి కారణాలు ఒక్క మాటలో చెప్పమంటాడు. ఇవి భోగపట్టణం

వెంకటప్పయ్య పంతులుగారు చెప్పిన సమాధానాలుగా చెబుతూ ఉంటారు. ప్రశ్న వేసేవానికి, చెప్పేవానికి అసమానప్రతిభావిశేషాలు కావాలి. సమాధానం చెప్పే వానిలోని స్ఫూర్తి, విధానం మనలను ఆశ్చర్యచకితులను చేస్తాయి. ఇవి బాగా విద్యావంతులకు పనికివచ్చే పొడుపుకథలు.

సీ॥ రజక కవాటముల్ రహిదప్పి యుండుట
కేమి హేతువొ? దాని నెరుగ వలయు,
ఇల్లును శేమవు హీనమై యుండుట
కేమి హేతువొ? దాని నెరుగవలయు,
పాలిచ్చు మొదవును ఒక పక్షి హీనమై
యేమిటనుండెనో? ఎరుగవలయు,
సస్యంబు కుమ్మరి సంతోషవర్ధమై
యేమిటనుండెనో? ఎరుగవలయు

తే గీ. దీని యర్థంబు జెప్పిన దేశికులకు
నెలలు పండ్రెండు పురుసతునేర్పుతోడ
సమ్మతిగ జెప్పుభావజ్ఞ చక్రవర్తి
చెప్పలేకున్న నగుదు నేచిన్ని నగవు.

I 1. రజకుడు (చాకలి) రహిదప్పియుండుట కేమి హేతువు?
2. కవాటముల్ (తలుపులు) రహిదప్పి యుండుట కేమి హేతువు?
(ఉతకలేక).

చాకలి ఉతకలేక పోవుటచేత అని అర్థము. ఇంక రెండో దానికి ఈ సమాధానము ఎట్లా సరిపోతుందో చెప్పడానికి ముందు కొంత వివరణ అవసరం. నేడు తలుపులను మడత బందులతో ద్వారానికి బిగిస్తారు. ఇవి చిన్నచిన్న తలుపులకు మాత్రమే బిగిస్తారు. ఏకోట దేవిడీల వంటివాటికో ఉండే పెద్ద తలుపులకు (కవాటములకు) మడతబందులు బిగించడానికి పనికిరావు. వాటికి "ఉతక" లు వేస్తారు. తలుపు వెనుక భాగం నుంచి ఇనుపకమ్మి బిగించి చివర కన్నము ఉంచుతారు. ఈ కన్నము ఉతకమీద ఉండి మడతబందులా పని చేస్తుంది. "ఉతకలేక" పోవటంచేత కవాటములు తప్పి ఉంటాయి అనడం సరిపోతుంది.

II 1. ఇల్లు హీనమై ఉండటానికి హేతువేమిటి?

2. పాము హీనమై ఉండటానికి హేతువేమిటి?

(కప్పలేక).

ఇంటి పై కప్పును పెంకులతోనూ, దాబాతోనూ, సిమెంటురేకుతోనూ ప్రస్తుతకాలంలో కప్పుతున్నారు. కాని వీటిని పూర్వం గడ్డితోనూ, తాటాకుతోనూ కప్పేవారు. ఇప్పటికీ అక్కడక్కడ ఈ పద్ధతి ఉంది. ఇంటి పై కప్పును "కప్పలేక" పోవటం చేతనే ఇల్లు హీనమై ఉంటుంది.

పాముకు కప్ప ఆహారం కదా! అందుచే "కప్పలేక" పోవటంవల్ల పాము హీనమై ఉంటుంది.

III 1. పాలిచ్చే ఆవు హీనమై ఎందుకు ఉంది?

2. కొంగ హీనమై ఎందుకు ఉంది? (చేపలేక).

పాలు చేపలేకపోతే ఆవుకు సరిగా ఆహారం పెట్టరు. అందుచే అది "చేపలేక" హీనమై ఉంటుంది.

కొంగకు చేప ఆహారంకదా! అందుచే అది "చేపలేక" పోవటంచేత హీనంగా ఉంటుంది.

IV 1. సస్యము సంతోషరహితమై ఎందుకు ఉంది?

2. కుమ్మరి సంతోషరహితమై ఎందుకు ఉన్నాడు? (వానలేక).

"వానలేక" పోతే సస్యాలకు సంతోషమెక్కడ ఉంటుంది.

కుమ్మరి కుండలు వానును. ఆ కుండల అమ్మకం మీదనే జీవితం గడిపే కుమ్మరి కుండలు "వానలేక" పోతే అతనికి సంతోష మెక్కడ ఉంటుంది?

వీటిని చెప్పినవానికి 12 నెలలు గడువు. దీనినిబట్టి ఈ సమస్యను విప్పడానికి ఎంత శక్తియుక్తులు కావాలో మనం గ్రహించవచ్చు.

సీ. ఏనుగు సింహంబు నెలనాగయును గూడి
యొక మాటలోపల నుండవలయు
రారాజు రతిరాజు రాజరాజునుగూడి
యొక మాటలోపల నుండవలయు

పక్షియు వృక్షంబు పాషాణమునుగూడి
యొక మాటలోపల నుండవలయు
ఫణిరాజు ఫణివైరి ఫణిభూషణుడుగూడి
యొక మాటలోపల నుండవలయు

తే.గీ. దీని యర్థంబు దెలియంగ బూనుకొనుచు
మదివిచారించి పదునైదు మాసములను
సమ్మతిగ జెప్ప భావజ్ఞ చక్రవర్తి
చెప్పలేకున్న నగుదునే చిన్నినగవు.

ఈ పొడుపు విప్పడానికి 15 నెలలు గడువు అంటున్నారు. చెప్పి భావజ్ఞ చక్రవర్తి అవుతాడు. ఒక్కొక్క పాదంలో మూడేసి పదాలు ఇచ్చి ఆ మూడింటి అర్థాన్నిచూపే మూడు వేరుపదాలను వాటిని కలిపితే ఒకేపదంగా భాసించే దానిని చూపమంటున్నాడు.

ఏనుగు, సింహము, ఎలనాగస్త్రీ ఒక్కమాటలో వచ్చే మాట ఏమిటి? నాగకేసరాలు - ఒకానొక చెట్టు (బహువచనం). ఇందులో నాగ=ఏనుగు; కేసరి=సింహము; ఆలు=ఎలనాగ అని వేరు వేరుగా చూపవచ్చు.

రారాజు (దుర్యోధనుడు); రతిరాజు (మన్మథుడు), రాజరాజు (కుబేరుడు) ఒక్కమాటలో ఉన్న పదం ఏది?

పక్షి, వృక్షము, పాషాణము కూడి ఒక్కమాటలో ఉన్న దేది? సమాధానము:- పిట్ట పేపరాయి. ఇది ఒక్కమాట. దీనిలో పిట్ట (పక్షి); పేము (వృక్షము) రాయి (పాషాణము) కూడి ఉన్నాయి.

ఫణిరాజు (పాము); ఫణివైరి (గరుత్మంతుడు); ఫణిభూషణుడు (ఈశ్వరుడు) ఒక్కమాటలో ఉన్నదేది? సమాధానము:- అనంతపక్షీశుడు. దీనిలో అనంత (అనంతుడు ఫణిరాజు); పక్షి (గరుడుడు); ఈశుడు (ఫణిభూషణుడు) వేరువేరు పదాలున్నాయి.

సీ. దశరథాగ్రసుతుండు శశియును పట్టణం
బొకమాట లోపల నుండవలయు
దర్పకాంతకుడు నేత్రంబును మాలయు
నొకపేరు లోపల నుండవలయు

వేల్పును త్రోవయు వెలయు ప్రసూనంబు
నొక్కపేరు లోపల నుండవలయు
కనకంబు కార్పాస మొనరమహీజంబు
నొక్కపేరు లోపల నుండవలయు

తే.గీ. దీని యర్థంబు తెలియంగ బూనుకొనుచు
మది విచారించి పదునైదు మాసములను
సమ్మతిగ జెప్ప భావజ్ఞ చక్రవర్తి
చెప్పలేకున్న నగుదునే చిన్ని నగవు.

దశరథాగ్రసుతుడు (రాముడు); శశి (చంద్రుడు); పట్టణము ఒక్క పేరులో ఉండాలి. అది ఏది? సమాధానము:_ రామచంద్రపురము.

దర్పకాంతకుడు (ఈశ్వరుడు); నేత్రము (కన్ను); మాల (దండ) ఒక్క మాటలో ఉండాలి. అది ఏది? సమాధానము:_ రుద్రాక్షమాల. రుద్ర + అక్ష + మాల అని గ్రహించాలి

వేల్పును (దేవత); త్రోవ (మార్గము); ప్రసూనము (పువ్వు) ఒకమాట లోపల ఉండాలి. అది ఏది? జవాబు_ దేవదారి పుష్పము, దేవ, దారి, పుష్పము అని విడిగా పదాలు కూడా ఉన్నాయి కదా!

కనకము (బంగారం); కార్పాసము (ప్రత్తి, చీర); మహీజము (చెట్టు) ఒక్కమాటలో ఉండాలి. అది ఏది? జవాబు:_ పైడిపత్తిచెట్టు (వృక్షవిశేషము. పైడి, పత్తి, చెట్టు అని విరుచుకుంటే మూడు పదాలు కనిపిస్తాయి.

ఇట్లాంటివి చెప్పడానికి శబ్దంమీద మంచి అధికారం ఉండాలి. దానితోపాటు మంచి సమయస్ఫూర్తి కూడా ఉంటేనే ఇవి విప్పడం సాధ్యమవుతుంది.

సీ. ఎలనాగ నీదేశ మేదేశ మన్నను
చెలివంగ మానొక్క చేత జూపె
భామరో! నీవున్న పట్టణంబేదన్న
చంద్రుని గూడి పాషాణమనియె

ఇందీవరాక్షి ! నీ యిల్లెక్క డన్నను
తలనీరు మోసె నత్తరువు క్రింద
నేజాతి కోమలి ! ఎరిగింపుమన్నను
ఏటిలో రెజ్జెల్లు ఇసుగ వుచ్చె

తే.గీ. నింతి నీకు విలువ ఎంతసి అడిగిన
చుక్క జూపి సుదతి సున్న జుట్టె
సమ్మతిగ జెప్పు భావజ్ఞ చక్రవర్తి
చెప్పలేకున్న నగుదునే చిన్ని నగవు.

వంగమాను చూపించడం ఒక సంకేతం. ఆమె దేశము వంగదేశము. ఆ భామ తన పట్టణం చంద్రుని గూడి పాషాణమన్నది. అంటే చంద్రశిలానగరం. తలనీరు మోసే తరువుకింద అంటే కొబ్బరిచెట్టు కింద తన ఇల్లు అన్నది. కోమలీ ! నీ జాతి ఏది ? అంటే "ఏటిలో రెజ్జెల్లు ఇసుగవుచ్చె !" దాని అర్థం బెస్త జాతి కావచ్చు*. ననిపిస్తూఉంది. వర్షఋతువు రెండునెలలు మాత్రమే ఏటికి, సముద్రానికి పోరుబెస్తవారు. వాళ్లకు చేపలు దొరకకపోవటం నోటమన్నే (ఇసుకే) అన్నది, సూచించిందేమో అనిపిస్తూఉంది. నీకు విలువ ఎంత ? అంటే చుక్క జూపి సున్న చుట్టిందిట. అంటే 270 అన్నమాట.

సీ. నారీలలామ నీపేరేమి ? చెప్పమన్న
వామాక్షముంజూపి పలుకకుండె
మత్తేభయాన నీ మగనిపేరేమన్న
దనచేతి జీర్ణవస్త్రంబు జూపె
వెలది నీకెమైన బిడ్డలా ? చెపుమన్న
గరమొప్పమింటి చుక్కలను జూపె
కుటిల కుంతల నీదు కులము నామంబన్న
బంజరంబున నున్న పక్షి జూపె

తే.గీ. ప్రభువు మీకెవరన్న గోపకుని జూపె ?
ధవుని వ్యాపారమేమన్న దండమిడియె !

* ఇక్కడ "రెజ్జెల్లు ఇసుగవుచ్చె" అన్నది సరియైన పాఠంకాదని తోస్తుంది ....

చతుర మతులార ! యాప్రౌఢ జాణతనము
తెలిసికొనరయ్య ! బుద్ధికౌశలము మెరయ !!

నారీలలామ- వామాక్షి; జీర్ణవస్త్రం చూపడంవల్ల మగనిపేరు కుచేలుడు; మింటి చుక్కలను చూపడంవల్ల సంతానము 27 మంది; పంజరంబున నున్న పక్షిని చూపడంవల్ల ద్విజకులము అని గ్రహించాలి. ప్రభువు ఎవ్వరంటే గోపకుని చూపింది. అంటే శ్రీకృష్ణుడు అని అనుకోవాలి. భర్త ఏ పని చేస్తూ ఉంటాడని అంటే దండం పెట్టడంవల్ల తపస్సు చేసుకోవడం అని గ్రహించవలసి ఉంటుంది. ఇక్కడ కుచేలుని చరిత్ర చమత్కారంగా చెప్పడం జరిగింది.

సీ. కొమ్ములు కలవని కోపించి పొడువదు
కట్టి బంధించిన కదలకుండు
ఈనదు పొర్లదు ఎన్నాళ్లకైనను
బంధంబు వేసిన పాలొసంగు
మేత కాసించదు మేఘంబులో నీళ్ల
కావలె ననుచుండు కడుపునిండ
దాని కడుపునిండ దారిద్ర్యములు బాపు
బహుజీవరాశులు బ్రతుకవచ్చు

తే.గీ. దీని యర్థంబు తెలియగ దివిరి నరులు
మది విచారించి పదునైదు మాసములను
సమ్మతిగ జెప్ప భావజ్ఞ చక్రవర్తి
చెప్పలేకున్న నగుదునే చిన్ని నగవు.

సమాధానము:- చెరువు.

చెరువుకు కొమ్ములు ఉంటాయి. కాని పొడువదు. (గట్లు) కట్టి బంధిస్తే (నీరు) కదలక ఉంటుంది. ఈనదు. పొర్లరు. నీరు పొర్లిపోదు. బంధం వేస్తే పాలు ఉన్నాయి. అంటే కట్టుకడితే పాలు (వంతు) ఇస్తుంది. నీరు వంతుల వారీగా వాడుకోవడం పల్లెలలో నేటికీ ఆనవాయితీ. మేతకాసించదు. మేఘంలో నీళ్ళు కావాలి అంటుంది. కడుపునింద అంటే చెరువు గర్భం నిండా నీరు కోరుతుంది. ఆ చెరువు గర్భం నిండితే దారిద్ర్యములను పోగొడుతుంది. అంటే పంటలు పండిస్తుంది. దానివల్ల బహుజీవరాశులు దానివల్ల బ్రతుకవచ్చు. మొత్తంమీద పశువుకు చెరువుకు అర్థం వచ్చేటట్లా ఉన్న పొడుపుకథ ఇది.

సీ. మనుజుని యాకార మహిమకు మొదలేది?
నగవైరి వైరికి నగరమేది?
రాముడు గాచిన రాక్షస పక్షేది?
శిబికర్ణు లార్జించుచెలువమేది?
పంచబాణుని వింట బరగిన రుచి ఏది?
గిరిజాపతి భుజించు గిన్నె ఏది?
నయనాంగరక్షకు నయమొప్పు చెలువేది?
చెలగిమానముగాచు చెట్టదేది?

తే.గీ. అన్నిటికి జూడ రెండేసి యక్షరములు
ఆదు లుడుపంగ తుదలెల్ల నాదు లగును
సమ్మతిగ జెప్ప భావజ్ఞ చక్రవర్తి
చెప్పలేకున్న నగుదునే చిన్నినగవు.
తల, లంక, కాకి, కీర్తి, తీపు, పుర్రె, రెప్ప, పత్తి.

అన్నిటికి రెండేసి యక్షరములే ఉన్నాయి. ఆదులు ఉడుపంగ (మొదటి అక్షరాలు తొలగించగా) తుదలెల్ల ఆదులు అయ్యే. అంటే మొదటి పదం చివరి అక్షరం రెండోపదం మొదటి అక్షరమవుతుంది. "తల" దీని చివరి అక్షరం "ల". రెండో పదం మొదటి అక్షరంగా ఇది నిలిచి "లంక" వచ్చింది. "లంక"లో చివరి అక్షరం "క". ఇది మూడో పదానికి ముందు నిలవాలి. కాని "కాకి" అని ఇవ్వటం జరిగింది. అంటే చివరి అక్షరానికి హ్రస్వంకాని దీర్ఘంకాని వాడుకోవచ్చు నన్నంతవరకు ఈ నిబంధనను సడలించుకోవాలి. అప్పుడు సరిపోతుంది. ఇంక "కాకి"లో చివరి అక్షరం "కి". దీని దీర్ఘం కూడా దీని తరవాత పదం మొదట నిలపవచ్చు అన్నమాట. "కీర్తి" తరవాత పదమయింది. ఇక్కడ చివర సంయుక్తాక్షరం ఉంది. ఇట్లాంటప్పుడు సంయుక్తంలో చివరి అక్షరాన్నే గ్రహించాలి. అందుకే తరవాతిపదం "తీపు" అయింది. "పు" చివరి అక్షరం కనక తరవాతి పదం "పుర్రె" అయింది. శకట రేఫ మర్యాద పాటించలేదని గ్రహించాలి. తరవాత పదం "రెప్ప". ఆ తరవాతి పదం "పత్తి".

ముక్తపదగ్రస్తం అనే అలంకారంలో విడిచిపెట్టిన పదాలను తిరిగి గ్రహిస్తుంది. పైన చెప్పిన పదాల గొలుసు చూస్తే ముక్తాక్షర గ్రస్త లక్షణం కనిపిస్తుంది.

సీ. అసమాన కోదండుడైన రాజెవ్వడు ?
రాజుపేరిటగల రత్న మేది ?
రత్నంబుపేరిట రంజిల్లు ఋతువేది?
ఋతువుపేరిటగల రుద్రుడెవడు ?
రుద్రుని పేరిట రూఢిల్లు జగమేది?
జగముపేరిటగల జంతువేది?
జంతువుపేరిట జన్మించు పక్షేది?
పక్షిపేరిటగల వృక్షమేది?

తే.గీ. అన్నిటికి జూడ మూడేసి యక్షరములు
ఆదులుడుపంగ తుదలెల్ల నాదులగును
సమ్మతిగ జెప్ప భావజ్ఞ చక్రవర్తి
చెప్పలేకున్న నగుదునే చిన్నినగవు

అసమాన కోదండులయిన రాజులు శ్రీరాముడు, అర్జునుడు మాత్రమే. వీరిలో ఒకరిని తీసుకొని కొసవరకు ఈ పొడుపు విప్పుకోవాలి.

శ్రీరామ, మౌక్తిక, కర్కాశ, శంభువు, వసుధ, ధేనువు, వాయసం, సంపెంగ.

"తుదలెల్ల నాదులగును" అన్న నిబంధనతో చివరి హల్లు గ్రహించి దానితో తరవాతిపదాదిని ప్రారంభించాలన్నంత వరకు నిబంధనను సడలించుకోవాలి అని గ్రహించాలి.

కర్కాశ ఋతువు గ్రీష్మమని గ్రహించాలి.

సీ. నక్షత్ర వీథికి నాథుండు ఎవ్వడు ?
రంగైన గుడిలోన లింగమేది ?
వాహనంబుల మీది వన్నెకు బేరేది ?
దేవతా ఋషులకు తిండి ఏది ?

నరకాసురునిగన్న నాతి నామంబేది ?
　　పొలతి చక్కదనంబు పోల్పనేది ?
తల్లికి కడబుట్టు తనయుని పైనేమి ?
　　బింబంబు గప్పెడి పేరదేది ?

తే.గీ. అన్నిటికి జూడ రెండేసి యక్షరములు
ఆదులుడుపంగ తుదలెల్ల నాదులగును
సమ్మతిగజెప్ప భావజ్ఞ చక్రవర్తి
జెప్పలేకున్న నగుదునే చిన్ని నగవు.

క్రమంగా ప్రశ్నలకు సమాధానాలు చూసుకోవాలి. కలి, కల, లక్క, కంద, ధర, రంభ, భ్రమ, మబ్బు.

ఇక్కడ "కంద-ధర" పదాలలో మొదటి పదం చివర "ద" ఉంది. కాని రెండోపదం మొదటి అక్షరంగా "ధ" గ్రహించడం జరిగింది. అల్ప ప్రాణానికి మహాప్రాణం గ్రహించవచ్చు నన్నంతవరకు నియమోల్లంఘన మున్నట్లు కనిపిస్తూఉంది.

సీ. రాముడెవ్వారితో రావణు మర్దించె ?
　　పరవాసుదేవుని పురమదేది ?
రాజమన్నారుచే రంజిల్లు శరమేది ?
　　వెలయగానుక పంటి విత్తదేది ?
అలరంభ కొప్పులో అలరు మాలిక ఏది ?
　　సభవారి నవ్వించు జాణ ఎవడు ?
సీత పెండ్లికి నోలిచేసిన విల్లేది ?
　　శ్రీకృష్ణు దేయింట జెలగుచుండు ?

తే.గీ. అన్నిటికి జూడ నైదేసి యక్షరములు
ఒనర నిరుదెస జదివిన నొక్క తీరె
చెప్పగలిగిన నేనిత్తు చిన్ని మాడ
చెప్పలేకున్న నగుదునే చిన్ని నగవు.

సమాధానాలు వరుసగా చూసుకోవాలి. లోకమ్మ్యాతో; రంగనగరం; లకోల కోల; జంబీర బీజం; మందార దామం; వికటకవి; పంచాస్య చాపం; నందసదనం.

సమాధానం ఉండవలసిన తీరులో ఒక కట్టుబాటు ఉంది. అది పాదక్రమ కాలకు, పద్య క్రమకాలకు సరితూగుతుంది.

సీ. శ్రీరామునకు సీత చెలగి యెచ్చట నుండు ?
నారాము డేదికి నడపి కేగె ?
ఏగిన మారీచు డేది దాల్చుచువచ్చె ?
నెసగిదైత్యుని రాము డెచట జంపె ?
సుగ్రీవు డారాము జూచి ఏమని పల్కె ?
వాలి రామునిచేత నేల చచ్చె ?
లంక నేరీతిని పొంకమడంచెను ?
ప్రజల నేదికతండు ప్రబల జేసె ?

తే॥ గీ॥ నన్నిటికి జూడ మూడేసి యక్షరంబు
లీవలావల జూడంగ నేకవిధము
సమ్మతిగ జెప్ప భావజ్ఞ చక్రవర్తి
చెప్పలేకున్న నగుదునే చిన్నినగవు

దీని సమాధానాలు క్రమంగా చూడండి. (1) డాకడా (ఎడమ భాగమున) (2) కైకకై (3) మెకమె (మృగ రూపమే) (4) నేలనే (5) సంతసం (6) కనక (రాముని చూడకపోవటం వల్లనే) (7) కలంక (8) కేళికే.

సీ॥ ఏమి చేయక వృథా ఏటి నీరేగును ?
భూపాలుదేటికి బుట్టు వొందు ?
తుంగముస్తెలె ప్రీతి తొలకాడు వేనికి ?
సభవారి నవ్వించు జాణ ఎవడు ?
కలహంస విహరించు కాసార మెయ్యది ?
వీరు డెద్దానిచే విజయమందు ?
లజ్జ యెవ్వరి కమూల్య పుటలంకారంబు ?
దేవాంగులకు దేన జీవనంబు ?

తే.గీ. అన్నిటికి జూడ నైదేసి యక్షరములు
ఒనర నిరుదెసఁ జదివిన నొక్క పేరె
చెప్పగలిగిన నే నిత్తు చిన్నమాడ
చెప్పలేకున్న నగుదునే చిన్ని నగవు

సమాధానాలు వరుసగా:- (1) కట్ట కట్టక (2) కేళి కాళికే (3) కిటికోటికి (4) వికటకవి (5) సురసరసు (6) చేతనతచే (7) కులస్త్రీలకు (8) నేతనేతనే.

సీ. రాజుల కెటువంటి రత్నముల్ ప్రియమయ్యె ?
కాయలే చెట్లవి కరులుమ్రింగు ?
నీశ్వరుం డెవ్వాని నెచ్చోట ధరియించె ?
జారు డెవ్వారినెసంగగోరు ?
వెన్నెన్ని దినములకెతెంచు పున్నమి ?
జనయిత్రి పుత్రునేజాడ మోసె ?
బిందువు లెయ్యెడ బలిసియేతెంతురు ?
ఈతకాడెందున భీతిజెందు ?

తె.గీ. నన్నిటికిజూడ నైదేసి యక్షరంబు
లీవలావల జూడంగ నేక విధము
సమ్మతిగ జెప్ప భావజ్ఞ చక్రవర్తి
చెప్పలేకున్న నగుదునే చిన్ని నగవు.

పాదభ్రమకాలను, పద్యభ్రమకాలను స్ఫురింపజేసేవి ముందు కొన్ని చూపాను. కాని వాటికన్న దీనిలో ప్రత్యేకత ఉంటుంది. రెండేసి ప్రశ్నలకు ఒక్కటే సమాధానము ఉండటం దీనిలోని విశిష్టత. ఒకే పదం విరుపులతో మరో అర్థాన్ని ఇవ్వటం దీనిలోని మరోవిశేషం. అందే శ్లేషకు కూడా తావు ఉందన్న మాట.

I. మొదటి రెండు ప్రశ్నలకు "వెలగలవె" అన్నది సమాధానం. రాజుల కెటువంటి రత్నములు ప్రియమైనవి ? అందే "వెలగలవె" అనిన్నీ, కాయలు ఏ చెట్లవి కరులు (ఏనుగులు) మ్రింగును ? అందే "వెలగలవె" అనిన్నీ పదం విరుపుతో రెండింటికీ సమాధానం చెప్పినాడు. ఇట్లే మిగిలిన వాటికి కూడా సమన్వయం చేసుకోవాలి.

II. ఈశ్వరుం-డెవ్వాని నెచ్చోట ధరియించె ? (నెల-తలనె).
జారు డెవ్వారి నెసంగగోరును ? (నెలతలనె).

నెల-తలనె అందే "చంద్రుని తలపై" అని అర్థము
నెలతల-నె అందే "స్త్రీలనే" అని అర్థము.

III. ఎన్నెన్ని దినముల కేతెంచు పున్నమి? నెలనెలన అంటే "ప్రతినెలకు" పున్నమి వస్తుంది. తల్లి గర్భంలో పుత్రుని ఒక్కొక్క నెల మోసింది. జనయిత్రి పుత్రునే జాదమోసె? నెలనెలనె. అని అర్థం.

IV. బంధువు లెయ్యెడ బలిసి ఏతెంతురు?
ఈతకాడెందున భీతి జెందు? సమాధానము రెండింటికీ "కెలకులకె".

సీ. అద్యంత మధ్యమాంతాడ మధ్యంబులో
తేటి రక్కసి రాజు దెలియదల్లి
అద్యంత మధ్యమాంతాది మధ్యంబులో
శివునిల్లు వరిచేను క్షీర ధార
అద్యంత మధ్యమాంతాది మధ్యంబులో
భార్యయు ఖడ్గంబు బరగచెట్టు
అద్యంత మధ్యమాంతాది మధ్యంబులో
మారువన్నెయు నీటి మందిజోదు

తే.గీ. అన్నిటికి జూడ మూడేసి యక్షరములు
మొదలు తుదలమ, నడితుద, మొదలు నడుమ
ప్రాణరక్షణ తలలందు పాదపముల
పరికరములందు నీ యర్థమరయవలయు.

మూడేసి యక్షరాల పదాలను చెప్పాలి. ప్రతిపదంలో ఆది అంతమూ అక్షరాలు ఒక అర్థాన్ని, మధ్యమ అంతిమాక్షరాలు మరో అర్థాన్ని, ఆది మధ్యాక్షరాలు వేరే అర్థాన్ని ఇచ్చేటట్లు పదాలు ఏర్పడాలి. అలాంటివి నాలుగు పదాలు చెప్పాలి.

మొదటి పదంలోని అక్షరాలు 1, 3 కలిపిచూస్తే తుమ్మెద; 2, 3 వల్ల రాక్షసరాజు; 1, 2 వల్ల తల్లి అని అర్థం రావాలి. అది ఏది?

అంబలి 1. 3. అలి_తుమ్మెద
2. 3. బలి-బలిచక్రవర్తి రాక్షసరాజు
1. 2. అంబ_అమ్మ.

రెండో పదంలో ఇదే క్రమంలో చూస్తే ఈ దిగువ అర్థాలు రావాలి అంటున్నాడు. శివుని ఇల్లు; వరిచేను; క్షీరధార. ఆపదమేది?

గుమ్మడి. దీనిలో వచ్చిన పదాలు గుడి; మడి; గుమ్మ.

ఇక్కడ మధ్యమాక్షరం ద్విత్వాక్షరంగా ఉంది. ఒకసారి ద్విత్వ యుక్తంగాను ఇంకోసారి ద్విత్వరహితంగానూ గ్రహించేరు. ఇట్లాంటివి తప్పవు.

మూడో పదంలో 1. 3. భార్య; 2. 3. ఖడ్గము; 1. 2. చెట్టు. దీనిలో వచ్చిన పదాలుగా ఉండాలి. ఆ పదమేది? జవాబు ఆవాలు. ఇప్పుడు క్రమంగా ఆలు, వాలు, ఆవ; ఇవి నిబంధనలకు లోబడి ఉన్నాయి.

నాలుగో పదంలో 1. 3. మారువన్నె; 2. 3. ఈటె; 1. 2. మంట జోడు కావాలి. ఆ పదమేది? సమాధానము :-పొగడ. 1. 3. పొడ; 2. 3. గడ; 1. 2. పొగ. ఇవి కట్టుబాట్లుకు ఒదిగి ఉన్నాయి.

కింద తేటగీతి పద్యంలో కొన్ని పరిధులను సూచించి కొంత శ్రమ తగ్గించారు. ఈ పదాలను కనుక్కోవడానికి సూచన కొంతవరకు ఉపయోగ పడినా ఇది సామాన్యమయినదేమీ కాదు.

మదనగోపాల శతకంలోని ఈ దిగువ రెండు పద్యాలు పౌరాణిక సంబంధమైన సమన్వయాలతోనిండి ఉన్నాయి. ఒక్కొక్క సమన్వయం ఒక పొడుపు కథగా భాసిస్తుంది. కొంచెం పరిశీలించండి.

సీ. హరి! నీవనాకారి వాలిపరాదారి
కూతురు వ్యభిచారి కొడుకు జారి
అమ్మ నిర్దయకారి అబ్బ సంకిలికారి
అత్తపరాధారి అక్క మారి
మరదలు శుభచారి మనుమడు జడదారి
మరిది క్షీణాకారి మామ శౌరి
వదినె నిర్దయకారి వాజి పక్షాకారి
భటుడు మర్కటరూపి పడకకహరి

తే.గీ. చూడు నీమర్మమెల్ల నే నాడు దాన
నేడు నన్నేలి సిగ్గు కాపాడుకొమ్ము
సరస దరహాస! ద్వారకాపుర నివాస!
మదనగోపాల! రాధికా హృదయలోల!

సీ. తొమ్మండ్రు మొగులనెత్తుకపోయె కోడలు
చెల్లెలు సన్యాసి జేసికొనియె
అత్తభూవరుల నెయ్యము మీర జెందెను
కూతురు పదకొండ్ర గూడుకొనియె
మరదలొక్కతె మారు మనువు గట్టుకుపోయె
నిల్లాలు పొరుగిండ్లకేగుదెంచె
వదినెగారును పల్కువావితో వర్తించె
మేనత్త భాగునిమీదవలచె

తే.గీ. పావు లిట్టట్టు జేసిన వన్నెకాడ!
తగవు రావయ్య! నీ జాణతనము మాని
సరస దరహాస! ద్వారకాపుర నివాస!
మదనగోపాల! రాధికా హృదయలోల!



పొడుపు కథల ఛాయలు

భారతంలోని యక్షప్రశ్నలు :- సమాధానం చెప్పడానికి ఊహకు సామాన్యంగా అందని ప్రశ్నలు యక్షప్రశ్నలు అని లోకవ్యవహారం. అసందర్భ ప్రశ్నలు; అక్కరమాలిన ప్రశ్నలు, చిక్కుప్రశ్నలు, మనిషిని తికమక పెట్టే ప్రశ్నలు; గజిబిజిచేసే ప్రశ్నలు యక్షప్రశ్నలు అని లోకరూఢి ఉంది. నిజానికి విజ్ఞానాన్ని వెదజల్లేవీ, మెదడుకు పదను పెట్టేవీ, సన్మార్గానికి సాక్షిభూతా లయ్యేవీ, ఈ యక్షప్రశ్నలు. ఆర్షసంప్రదాయాన్ని, భారతీయ సంస్కృతిని పండించిన దిక్కదే. ధర్మ చైతన్యమిక్కడ మూర్తీభవించింది. యక్ష పరీక్ష కఠిన పరీక్ష - అగ్నిపరీక్ష - రత్నపరీక్ష.

వాస్తవానికి ఈ యక్షప్రశ్నలు భారతంలోనివి. పాండవుల అరణ్యవాసం పూర్తికానున్న తరుణంలో ధర్మజుని ధర్మప్రవర్తనను చూడదలచి సాక్షాత్తు యమధర్మరాజే ఒక యక్షునిరూపంలో వస్తాడు.

తన మాయచేత ఒక జింక ఒక బ్రాహ్మణుని అరణి (నిప్పును పుట్టించే కొయ్యసాధనం) ఎత్తుకొనిపోయినట్లు సృష్టిస్తాడు. బ్రాహ్మణుడు వచ్చి ధర్మ రాజుని తన నిత్య కర్మానుష్ఠానము ఆగిపోకుండా చూడవలసిందని కోరతాడు. ధర్మరాజు వెంటనే సాయుధుడై తమ్ములతో జింకను వెంబడిస్తాడు. జింక బహుదూరము వీరిని తీసుకొనిపోయి అదృశ్యమై పోతుంది. అప్పటికి అందరూ బాగా అలసిపోతారు. ఒక మఱ్ఱినీడను అందరూ విశ్రమిస్తారు. నకులుడికి సందేహం వస్తుంది. మనకి అవస్థలకు కారణమేమిటంటాడు. ధర్మరాజు వీటన్ని టికీ కర్మమాత్రమే కారణం అంటాడు. భారతీయ సంస్కృతికి ఆ కర్మ సిద్ధాం తమే జీవగఱ్ఱ. దానిని అవగాహన చేసుకోవటంలో, ఆలోచన చేసేసరళిలో ఉన్న వైవిధ్యం కారణంగా దానికిచ్చే విలువలు వేరువేరుగా ఉన్నాయి.

భీముడిట్లా చెప్పాడు. "ప్రాతికామి నాడు ద్రౌపదిని సభలోపలికి దెచ్చి నప్పుడు నేను ఊరుకోవడమే నేటి ఈ పరిస్థితికి కారణం". ఇది అతని భుజ బలగర్వాన్ని సూచిస్తూ ఉంది.

అర్జునుడు "సూతనందనుడు ఇష్టం వచ్చినట్లు సభలో మాట్లాడినప్పుడు తాను కినుక వహించకపోవడమే ఈ ఇక్కట్టుకు మూలం" అన్నాడు.

"దుర్ద్యూతానికి పాల్పడిన దుర్యోధనుని తాను విడిచి పుచ్చడమే నేటి ముప్పుకు కారణ" మన్నాడు సహదేవుడు.

భీమార్జున సహదేవులు పురుషకారానికి ప్రాముఖ్యమిస్తే ధర్మజుడు విధికి, కర్మకు, ప్రాధాన్యమిచ్చాడు. మానవుని చేతిలో ఏమీలేదు. అంతా దేవుని ఇష్టమే అన్నాడు ధర్మజుడు. సాహంకారులైన భీమార్జున నకుల సహదేవులు యక్షునిచే శిక్షపొందారు. అహంకారరహితుడయిన ధర్మజుడు యక్షుని మెప్పు పొందగలిగాడు.

అందరూ దస్సి దప్పిగొని ఉన్నారు. పోయి మంచినీళ్ళు తెమ్మని ధర్మజుడు నకులుని, సహదేవుని, అర్జునుని భీముని ఒకరి తరవాత ఒకరిని పంపుతాడు. వెళ్ళిన వారు ఒక్కరూ తిరిగి రాలేదు. అశరీర రూపంలో యక్షుడు తన ప్రశ్నలకు సమాధానము చెప్పిన తరవాత కొలనులో ప్రవేశించ మన్నప్పటికీ దానిని పెడచెవినిబెట్టి ఒక్కొక్కరు మూర్ఛితులవుతారు. చివరకు ధర్మరాజు వస్తాడు. అతడు అక్కడ చేష్ట దక్కిపడిఉన్న తమ్ములను చూస్తాడు. కారణ మేమిటో తెలియలేదు. ఎవరితోనూ కలహించిన జాడ కానరాలేదు. మరి ఈ స్థితికి కారణమేమిటో? అని అనుకుంటాడు. ధర్మరాజు కూడా కొలనిలో దిగి దాహము తీర్చుకోబోతాడు. అప్పుడు అశరీరభూతమిట్లని చెబుతుంది. "అయ్యా! ఈ కొలను నాది. నేనొక బకమను. నా అనుమతి లేనిదే దీనిలో నీరు త్రాగిన వారెవ్వరయినా చస్తారు. నీ తమ్ములట్లే ప్రాణచ్యుతి బొందినారు. నీవు సాహసం చేయకు. ముందుగానే వారిస్తున్నాను. నా ప్రశ్నలకు సదుత్తరము లిచ్చి నీవు కోరినంత నీరు త్రాగుము."

"అయ్యా! నీవు బకరూపంలో ఉన్న ఏ రుద్రుడవో, పావకుడవో, వసుడవో కానిచో కులపర్వత సమవిక్రములైన నా సోదరుల నిట్లు చేయజాలవు. నాకు భయకౌతుకము లొక్కసారి కలుగుతున్నాయి. నీవు ఎవ్వరివో తెలిపి నన్ను కృతార్థుని జేయగోరుతున్నాను" అని ధర్మరాజు అంటే అప్పుడు "నేను నిజానికి ఒక యక్షుడను". అని తన నిజస్వరూపంతో ప్రత్యక్షమై, "ఓయీ! నీవు నీ తమ్ములవలె గాక నామాట విన్నావు. నా ప్రశ్నలకు సరియైన సమాధానాలిచ్చి ఇందులో నీరు త్రాగుము" అన్నాడు.

"సరే! నాకు తోచిన రీతిని సమాధానాలు ఇస్తాను. అడుగు" మని ధర్మరాజు అన్నాడు.

ఇక్కడ ఒక్కమాట చెప్పవలసి ఉంది భారతీయ సంస్కృతిని నాటి దేశకాలపరిస్థితులను ఆధారంగా చేసుకొని మాత్రమే ధర్మరాజు సమాధానాలు చెప్పినట్లు గ్రహించాలి. కాని నేటి వైజ్ఞానికశాస్త్ర దృక్పథంతో చూసి అవి సరిపోలేదని, భావించకూడదు. శ్లోకాలలోను, పద్యాలలోను ఉన్న ఈ యక్ష ప్రశ్నలు వాటి సమాధానాలు వచనరూపంలో మాత్రమే ఇస్తాను. అయితే అన్నిటిలోనూ సమయస్ఫూర్తిలేదు. సమాధానం చెప్పటానికి కష్టమైనదల్లా యక్షప్రశ్న కాదు. ప్రతి యక్షప్రశ్న పొడుపుకథ-అన వీలులేదు. కొన్ని యక్ష ప్రశ్నలు మాత్రమే పొడుపుకథలలాగ ఉన్నాయి. అందుకే బీజరూపంలో ఛాయా మాత్రంగా పొడుపుకథలు ఈ యక్షప్రశ్నలలో భాసిస్తున్నా యన్నాను.

యక్షుడు :- 1. సూర్యుని ఏది నడుపుతుంది?
2. ఆ సూర్యుని ఎవరు కొలిచి తిరుగుతారు?
3. దేనివల్ల అతడు అస్తమిస్తాడు?
4. అతనికి ఆధారభూతమయింది ఏది?

ధర్మరాజు :- సూర్యుని నడిపేది బ్రహ్మము.
సూర్యుని కొలిచి సురకోటి నడుస్తుంది.
సూర్యుడు ధర్మువుచే అస్తమితుడవుతాడు.
అతనికి సత్యమే ఆధారము.

ఇక్కడ సత్యము అంటే ఏమిటో కొంత వివరించవలసిఉంది. సత్యము అంటే నిజము అని లోకరూఢి. కాని అబద్ధమాడక పోవడం సూర్యునికి ఆధార మని అర్థంకాదు. సత్యము అంటే "ఉన్నది". ఏది ఉంది? ప్రకృతిధర్మము ఉంది. ఈ ప్రకృతి ధర్మమే సత్యమని నిర్వచనము.

యక్షుడు :- 5. దేనివల్ల శ్రోత్రియు డనవచ్చు?
6. పురుషుడు దేనివల్ల ఎక్కువ మహిమ పొందుతాడు?
7. దేనివల్ల సహాయయుతుడవుతాడు?
8. దేనివల్ల బుద్ధిమంతుడవుతాడు?

ధర్మరాజు :- శ్రుతము వలన శ్రోత్రియు డనవచ్చు.
అతుల తపోయుక్తిచే ఎక్కువ మహత్వం పొందుతాడు.

ధృతిచే సహాయయుతుడవుతాడు.
బుధ సేవచే బుద్ధిమంతుడవుతాడు.

యక్షుడు :- 9. బ్రాహ్మణుడు దేవభావమున దేనివల్ల ప్రకాశిస్తాడు?
10. అతనికి సాధుభావము ఏవిధంగా వస్తుంది?
11. దేనివల్ల అసాధుత్వం వస్తుంది?
12. దేనివల్ల అతడు మనిషి అవుతాడు?

ధర్మరాజు :- బ్రాహ్మణుడు అధ్యయనంవల్ల దేవభావం పొందుతాడు.
అతనికి సాధుభావము అధికవ్రత శీలతచేత వస్తుంది.
విశిష్ట వృత్తి దిగద్రావి అసాధువుతాడు.
శౌచనియతి లేక మృత్యుభయసంగతిచే అతడు మనిషి అవుతాడు.

యక్షుడు :- 13. జీవన్మృతు డెట్టివాడు?

ధర్మరాజు :- దేవతలను, అతిథులకు, పితృ, భృత్య జనానికి పెట్టకుండా తినే వాడే జీవించి ఉన్నా చచ్చిన వాడితో సమానుడు.

యక్షుడు :- 14. భూమికంటె బరువైనదేది?
15. ఆకాశంకంటె పొడవైనదేది?
16. గాలి కంటె ఎక్కువ వేగం కలదేది?
17. తృణోత్కరం కంటె తఱచైన దేది?

ధర్మరాజు :- తల్లి భూమి కంటె బరువైనది.
తండ్రి ఆకాశం కంటె పొడవైనవాడు.
గాలి కంటె ఎక్కువ వేగం కలది మనస్సు.
గడ్డిపోచల కంటె తఱచయినది చింత.

క్షమాగుణమున తల్లిని భూమితో సరిపోలుస్తారు. ధర్మరాజు భూమికన్న తల్లే ఈ క్షమాగుణమున బరువయినదన్నాడు. ఆకాశం కంటె తండ్రి పొడవయిన వాడు అన్నాడు. అంటే తండ్రి మహోన్నతుడు అని అర్థం. ఇంక చింత గడ్డిపోచల కంటె తఱచయినదన్నాడు. గడ్డిపోచలు అల్లిబిల్లిగా అల్లుకొని తఱచుగా ఉంటాయి. చింత అంతకన్న తఱచుఅని ఊహకావచ్చు.

యక్షుడు :- 18. నిద్రించి కూడా కన్ను మూయని దేది?
19. పుట్టి కూడా చేతనత్వంబు లేనిదేది?

20. రూపు ఉండీ హృదయం లేనిదేది?
21. వేగంవల్ల వర్ధిల్లేది ఏది?

ధర్మరాజు :- చేప నిద్రించికూడా కన్ను మూయదు.
పుట్టి కూడా చేతనత్వం లేనిది గ్రుడ్డు.
రూపము ఉండీ హృదయంలేనిది రాయి.
ఏఱు వేగంవల్ల వృద్ధి పొందుతుంది.

ఈ పైని యక్షుడు వేసిన 14 నుంచి 21 వరకు ఉన్న ప్రశ్నలు పృష్కాలంగా పొడుపు కథల ఛాయలు సంతరించుకొన్నాయి.

యక్షుడు :- 22. తెరువు నడుచువానికి, రోగార్తునకు, గృహస్థునకు, మృతి పొందిన వారికి ఎవ్వరెవ్వరు చుట్టాలు?

ధర్మరాజు :- ఆ నలుగురకు క్రమంగా సార్థము, వైద్యుడు, సద్భార్య, చేసుకొన్న ధర్మము చుట్టాలు.

యక్షుడు :- 23. ఏది ధర్మవునకు కుదురు?
24. ఏది కీర్తికి ఆశ్రయము?
25. దేవలోకానికి ఇమ్మైన మార్గమేది?
26. ఏది సుఖములకు తావు?

ధర్మరాజు :- ధర్మానికి దాక్షిణ్యము కుదురు.
కీర్తికి ఆశ్రయము దానము.
స్వర్గలోకానికి మార్గము సత్యము.
సుఖాలకు శీలమే తావు.

యక్షుడు :- 27. నరునకు ఆత్మ ఎవరు?
28. అతనికి దైవికమైన చుట్టమెవ్వరు?
29. అతని వర్తనం దేనివల్ల నడుస్తుంది?
30. దేనివల్ల అనవద్యత పొందుతాడు?

ధర్మరాజు :- మానవునకు పుత్రుడే ఆత్మ.
దైవికమైన చుట్టము భార్య.

మేఘునివల్ల అతని జీవిక సాగుతుంది.
అతడు దానము గొనియాడి అతిశయిల్లును.

యక్షుడు :- 31. మేటి ధర్మ మేది?
32. ఏది ఎప్పుడూ పండి ఉంటుంది?
33. ఏది నిగ్రహించినందువల్ల ప్రమోదసిద్ధి?
34. ఎవ్వరితో సంధి ఎప్పుడూ వికలంకాదు?

ధర్మరాజు :- అహింస పరమ ధర్మము.
యజ్ఞకర్మ మెప్పుడూ పండి ఉంటుంది.
మనస్సు క్రొవ్వు ఖండిస్తే ప్రమోదసిద్ధి.
సుజన సంధి ఏనాడూ వికలం కాదు.

యక్షుడు :- 35. లోకానికి ఏది దిక్కు?
36. నీరు, అన్నము దేనివల్ల సంభవిస్తాయి.
37. విషమంటే ఏది ?
38. శ్రాద్ధ విధికి సమయమేది ?

ధర్మరాజు :- ఈ సర్వానికీ దిక్కు సజ్జనులే.
ఆకాశం, భూమి - జలము, అన్నం
పుట్టడానికి స్థానాలు.
విప్రధనము విషము
బ్రాహ్మణుల రాక శ్రాద్ధానికి సమయము.

యక్షుడు :- 39. మనిషి ఏది విడిచిపెట్టి సర్వజనప్రియుడూ, నిశ్శోకుడూ, అర్థవంతుడూ, సుఖీ అవుతాడు ?

ధర్మరాజు :- మనిషి గర్వం విడిచి సర్వజనప్రియుడు అవుతాడు.
క్రోధము విడిచి నిశ్శోకు డవుతాడు.
లోభాన్ని విడిచి అర్థవంతు డవుతాడు.
తృష్ణ విడిచి సుఖి అవుతాడు.

యక్షుడు :- 40. పురుష శబ్ద వాచ్యు డెవడు ?
41. సర్వధని ఎవడు ?

ధర్మరాజు :- భూమి నాలుగు చెఱగులా వ్యాపించి నింగిని తాకిన కీర్తికలవాడే పురుష శబ్ద వాచ్యుడు. ప్రియాన్ని అప్రియాన్నీ, సుఖదుఃఖాల రెండింటినీ, భూతభవిష్యత్కార్యాలను సమగ్రంగా చూసేవాడే సర్వధని.

ఈ సమాధానాలతో తృప్తిపొందిన యక్షుడు "నీవు కోరిన వరమిస్తాను. నీ తమ్ములలో నీ కెవరు కావాలో కోరుకో" అంటాడు.

"నా తమ్ములలో నకులుని బ్రతికింపు"మంటాడు ధర్మరాజు. సరే: కాని "నీ ఈ కోరికకు అర్థమేమిటి ? భీముణ్ణో, అర్జునుణ్ణో కోరక నకులుణ్ణి ఎందుకు బ్రతికించమని కోరుతున్నావు ?" అంటాడు యక్షుడు. "మాకు కుంతి, మాద్రి ఇరువురు తల్లులు. అందు కుంతి కొడుకులలో పెద్దవాణ్ణి నేను బ్రతికి ఉన్నాను. మాద్రి కొడుకులలో పెద్దవాడైన నకులుణ్ణి బ్రతికించమని కోరడమే ధర్మ" మంటాడు ధర్మరాజు. అతని ధర్మాభినిరతికి సంతోషించి అందరినీ బ్రతికిస్తాడు. 'ఇంకేం కావాలం'టాడు? 'విప్రుని అరణి కావాలి' అంటాడు. అప్పుడు తాను యక్షుడను కాననీ తానే యమధర్మరాజు ననీ స్వస్వరూపంతో ప్రత్యక్షమవుతాడు. అందుకే ఇక్కడ ధర్మం మూర్తీభవించిందన్నాను. జింక విప్రుని అరణి దొంగిలించడం తన మాయా కల్పితమంటాడు యమధర్మరాజు.

ఇంక అరణ్యవాసం పూర్తికానున్నది; రానున్నది అజ్ఞాతవాసం వారు ప్రచ్ఛన్నవేషధారులయి ఉండటానికి వారు కోరుకొన్న రూపాలు వారు ధరించ డానికి వరమిచ్చి యముడు అంతర్ధానమవుతాడు.

ఇది యక్షుడు చేసిన ఇంటర్వ్యూ. దానికి ధర్మరాజు ఇచ్చిన సమాధానాలు పైని చూపినాను. ఈ ఇంటర్వ్యూలో ధర్మరాజు కృతకృత్యు డయినాడు.



పొడుపు కథలు - చిత్రకవిత్వం

"కవితా మార్గము నల్దెరంగులచటన్ గర్భంబు బంధంబు, నాశుపు చిత్రంబు" అని నాలుగు రకాలు. చతుర్విధ కవిత్వాలు. (1) గర్భ కవిత్వము (2) బంధ కవిత్వము (3) ఆశు కవిత్వము (4) చిత్ర కవిత్వము.

ఇందులో ఆశుకవిత్వము ప్రథమ గణ్యత పొందుతుంది. ఆశువు అంటే వేగము. ఈ ఆశుకవిత్వంలో వేగమే ప్రధానము. అప్పటికప్పుడు కోరిన విషయంపై పద్యరచన చేయుటం ఆశువులో ప్రధానమయినది. దానికి చాలా శక్తి సామర్థ్యాలు కావాలి. శబ్దంమీద అధికారం, అనేక ప్రయోగాల ఆకళింపు, సమయస్ఫూర్తి, బహుశాస్త్ర పరిచయం, కవితాధార దీనికి అవసరం.

"నిరుపహతి స్థలంబు, రమణీప్రియ దూతిక తెచ్చి ఇచ్చు, క
ప్పురవిడె, మాత్మకింపయిన భోజన, ముయ్యెలమంచ, మొప్పుతప్పు,
అరయురసజ్ఞు లూహతెలియంగల లేఖక పాఠకోత్తముల్

దొరికిన"......చెప్పేవి గ్రంథాలు. కాని ఆశుకవిత్వానికి ఇవేవీ సమకూరవు. సమకూర్చరు. అయినా నిరాఘాట రచన చేయడమే ఆశుకవితా లక్షణం.

కవిబ్రహ్మగా గణుతి కెక్కిన తిక్కన సోమయాజి భారత రచనకు గురునాథుని వ్రాయసకాడుగా పెట్టుకొన్నాడు. చెప్పినంత వేగంగా గురునాథుడు వ్రాస్తానని శపథం చేశాడు. చెప్పలేక ఘంటము ఆగితే తిక్కన తన నాలుక కోసుకొంటానని ప్రతిన పూని రచన సాగించినట్లు కథలున్నాయి. అదెంత తీవ్ర వేగమో! నిరాఘాటంగా ప్రతిజ్ఞా భంగం కాకుండా రచన సాగుతూఉంది. ఒకనాడు కందపద్యం చెబుతూ నాలుగోపాదంలో "ఏమి చెప్పుదున్ గురునాథా?" అని తిక్కన ఆగి తన ప్రతిన తప్పినందుకు నాలుక కోసుకుంటా నన్నాడట. పద్యం ఆగలేదే! "కురునాథా! ఏమి చెప్పుదున్" అని పూర్తిగా అర్థయుక్త రచన చేస్తూ ఎందుకిలా తొందరపడతారంటాడు గురునాథుడు. దీనినిబట్టి సహస్ర ఘంటకవులు తదనంతర కాలంలో వచ్చిఉంటారు. శతలేఖినీ పద్య

20. రూపు ఉండీ హృదయం లేనిదేది?
21. వేగంవల్ల వర్ధిల్లేది ఏది?

ధర్మరాజు :- చేప నిద్రించికూడా కన్ను మూయదు.
పుట్టి కూడా చేతనత్వం లేనిది గ్రుడ్డు.
రూపము ఉండీ హృదయంలేనిది రాయి.
ఏఱు వేగంవల్ల వృద్ధి పొందుతుంది.

ఈ పైని యక్షుడు వేసిన 14 నుంచి 21 వరకు ఉన్న ప్రశ్నలు వృక్షంగా పొడుపు కథల ఛాయలు సంతరించుకొన్నాయి.

యక్షుడు :- 22. తెరువు నడుచువానికి, రోగార్తునకు, గృహస్థునకు, మృతి పొందిన వారికి ఎవ్వరెవ్వరు చుట్టాలు?

ధర్మరాజు :- ఆ నలుగురకు క్రమంగా సార్థము, వైద్యుడు, సద్భార్య, చేసుకొన్న ధర్మము చుట్టాలు.

యక్షుడు :- 23. ఏది ధర్మమునకు కుదురు?
24. ఏది కీర్తికి ఆశ్రయము?
25. దేవలోకానికి ఇమ్మైన మార్గమేది?
26. ఏది సుఖములకు తావు?

ధర్మరాజు :- ధర్మానికి దాక్షిణ్యము కుదురు.
కీర్తికి ఆశ్రయము దానము.
స్వర్గలోకానికి మార్గము సత్యము.
సుఖాలకు శీలమే తావు.

యక్షుడు :- 27. నరునకు ఆత్మ ఎవరు?
28. అతనికి దైవికమైన చుట్టమెవ్వరు?
29. అతని వర్తనం దేనివల్ల నడుస్తుంది?
30. దేనివల్ల అనవద్యత పొందుతాడు?

ధర్మరాజు :- మానవునకు పుత్రుడే ఆత్మ.
దైవికమైన చుట్టము భార్య.

మేఘునివల్ల అతని జీవిక సాగుతుంది.
అతడు దానము గొనియాడి అతిశయిల్లును.

యక్షుడు :- 31. మేటి ధర్మ మేది?
32. ఏది ఎప్పుడూ పండి ఉంటుంది?
33. ఏది నిగ్రహించినందువల్ల ప్రమోదసిద్ధి?
34. ఎవ్వరితో సంధి ఎప్పుడూ వికలంకాదు?

ధర్మరాజు :- అహింస పరమ ధర్మము.
యజ్ఞకర్మ మెప్పుడూ పండి ఉంటుంది.
మనస్సు క్రొవ్వు ఖండిస్తే ప్రమోదసిద్ధి.
సుజన సంధి ఏనాడూ వికలం కాదు.

యక్షుడు :- 35. లోకానికి ఏది దిక్కు?
36. నీరు, అన్నము దేనివల్ల సంభవిస్తాయి.
37. విషమంటే ఏది ?
38. శ్రాద్ధ విధికి సమయమేది ?

ధర్మరాజు :- ఈ సర్వానికీ దిక్కు సజ్జనులే.
ఆకాశం, భూమి - జలము, అన్నం
పుట్టడానికి స్థానాలు.
విప్రధనము విషము
బ్రాహ్మణుల రాక శ్రాద్ధానికి సమయము.

యక్షుడు :- 39. మనిషి ఏది విడిచిపెట్టి సర్వజనప్రియుడూ, నిశ్శోకుడూ, అర్థవంతుడూ, సుఖీ అవుతాడు ?

ధర్మరాజు :- మనిషి గర్వం విడిచి సర్వజనప్రియుడు అవుతాడు.
క్రోధము విడిచి నిశ్శోకు డవుతాడు.
లోభాన్ని విడిచి అర్థవంతు డవుతాడు.
తృష్ణ విడిచి సుఖి అవుతాడు.

యక్షుడు :- 40. పురుష శబ్ద వాచ్యు డెవడు ?
41. సర్వధని ఎవడు ?

ధర్మరాజు :- భూమి నాలుగు చెఱగులా వ్యాపించి నింగిని తాకిన కీర్తికలవాడే పురుష శబ్ద వాచ్యుడు. ప్రియాన్ని అప్రియాన్నీ, సుఖదుఃఖాల రెండింటినీ, భూతభవిష్యత్కార్యాలను సమగ్రంగా చూసేవాడే సర్వధని.

ఈ సమాధానాలతో తృప్తిపొందిన యక్షుడు "నీవు కోరిన వరమిస్తాను. నీ తమ్ములలో నీ కెవరు కావాలో కోరుకో" అంటాడు.

"నా తమ్ములలో నకులుని బ్రతికింపు"మంటాడు ధర్మరాజు. సరేః కాని "నీ ఈ కోరికకు అర్థమేమిటి? భీముణ్ణో, అర్జునుణ్ణో కోరక నకులుణ్ణి ఎందుకు బ్రతికించమని కోరుతున్నావు?" అంటాడు యక్షుడు. "మాకు కుంతి, మాద్రి ఇరువురు తల్లులు. అందు కుంతి కొడుకులలో పెద్దవాణ్ణి నేను బ్రతికి ఉన్నాను. మాద్రి కొడుకులలో పెద్దవాడైన నకులుణ్ణి బ్రతికించమని కోరడమే ధర్మ" మంటాడు ధర్మరాజు. అతని ధర్మాభినిరతికి సంతోషించి అందరినీ బ్రతికిస్తాడు. 'ఇంకేం కావాలం'టాడు? 'విప్రుని అరణి కావాలి' అంటాడు. అప్పుడు తాను యక్షుడను కాననీ తానే యమధర్మరాజు ననీ స్వస్వరూపంతో ప్రత్యక్షమవుతాడు. అందుకే ఇక్కడ ధర్మం మూర్తీభవించిందన్నాను. జింక విప్రుని అరణి దొంగిలించడం తన మాయా కల్పితమంటాడు యమధర్మరాజు.

ఇంక అరణ్యవాసం పూర్తికానున్నది; రానున్నది అజ్ఞాతవాసం. వారు ప్రచ్ఛన్న వేషధారులయి ఉండటానికి వారు కోరుకొన్న రూపాలు వారు ధరించ డానికి వరమిచ్చి యముడు అంతర్థానమవుతాడు.

ఇది యక్షుడు చేసిన ఇంటర్వ్యూ. దానికి ధర్మరాజు ఇచ్చిన సమాధానాలు పైని చూపినాను. ఈ ఇంటర్వ్యూలో ధర్మరాజు కృతకృత్యు డయినాడు.



పొడుపు కథలు - చిత్రకవిత్వం

"కవితా మార్గము నల్దెరంగులచటన్ గర్భంబు బంధంబు, నాశుపు చిత్రంబు" అని నాలుగు రకాలు. చతుర్విధ కవిత్వాలు. (1) గర్భ కవిత్వము (2) బంధ కవిత్వము (3) ఆశు కవిత్వము (4) చిత్ర కవిత్వము.

ఇందులో ఆశుకవిత్వము ప్రథమ గణ్యత పొందుతుంది. ఆశువు అంటే వేగము. ఈ ఆశుకవిత్వంలో వేగమే ప్రధానము. అప్పటికప్పుడు కోరిన విషయంపై పద్యరచన చేయుటం ఆశువులో ప్రధానమయినది. దానికి చాలా శక్తి సామర్థ్యాలు కావాలి. శబ్దంమీద అధికారం, అనేక ప్రయోగాల ఆకళింపు, సమయస్ఫూర్తి, బహుశాస్త్ర పరిచయం, కవితాధార దీనికి అవసరం.

"నిరుపహతి స్థలంబు, రమణీప్రియ దూతిక తెచ్చి ఇచ్చు, క
ప్పురవిడె, మాత్మకింపయిన భోజన, మయ్యెలమంచ, మొప్పుతప్పు,
అరయురసజ్ఞు లూహతెలియంగల లేఖక పాఠకోత్తముల్

దొరికిన"......చెప్పేవి గ్రంథాలు. కాని ఆశుకవిత్వానికి ఇవేవీ సమకూరవు. సమకూర్చరు. అయినా నిరాఘాట రచన చేయడమే ఆశుకవితా లక్షణం.

కవిబ్రహ్మగా గణుతి కెక్కిన తిక్కన సోమయాజి భారత రచనకు గురునాథుని వ్రాయసకాడుగా పెట్టుకొన్నాడు. చెప్పినంత వేగంగా గురునాథుడు వ్రాస్తానని శపథం చేశాడు. చెప్పలేక ఘంటము ఆగితే తిక్కన తన నాలుక కోసుకొంటానని ప్రతిన పూని రచన సాగించినట్లు కథలున్నాయి. అదెంత తీవ్ర వేగమో! నిరాఘాటంగా ప్రతిజ్ఞా భంగం కాకుండా రచన సాగుతూఉంది. ఒకనాడు కందపద్యం చెబుతూ నాలుగోపాదంలో "ఏమి చెప్పుదున్ గురునాథా?" అని తిక్కన ఆగి తన ప్రతిన తప్పినందుకు నాలుక కోసుకుంటా నన్నాడట. పద్యం ఆగలేదే! "కురునాథా! ఏమి చెప్పుదున్" అని పూర్తిగా అర్థయుక్త రచన చేస్తూ ఎందుకిలా తొందరపడతారంటాడు గురునాథుడు. దీనినిబట్టి సహస్ర ఘంటకవులు తదనంతర కాలంలో వచ్చిఉంటారు. శతలేఖినీ పద్య

సంధాన ధౌరేయుడు రామరాజభూషణుడు. జగత్ప్రాణనందన కారుణ్య కటాక్ష లబ్ధ కవితాధారా సుధారాశి సంజని త్రైత్రైక దిన ప్రబంధమటనా సద్యశ్శత గ్రంథ కల్పనుడు పుట్టాడు. తిరుపతి వేంకట కవులు, కొప్పరపు సోదర కవులు మున్నగువారు ఆశుకవితా ప్రసిద్ధులు. అడిదము సూరకవి " గడియకు నూరు పద్యములు ఘంటము లేక రచింతు దిట్టగా" అని తన అత్యాశు రచనా పాటవాన్ని ప్రకటించుకొన్నాడు.

ఇట్టి ప్రజ్ఞ అవధాన విధానాలమీదకు కవుల దృష్టిని మళ్ళించింది అష్టావధానాలు, శతావధానాలు, సహస్రావధానాలు బయలు దేరినాయి. దీనికి అసాధారణ ధారణాపటిమ అవసరం. ఇవి చిత్రకవిత్వంలో అంతర్భాగాలుగా చెప్పవచ్చు. అష్టావధానాలలో ఉండే చిత్రాక్షరి, దత్తపది, న్యస్తాక్షరి, సమస్యలలో పొడుపు కథల ఒడుపులు మడుపులు కనిపిస్తాయి. చిత్రకవిత్వంలో పద్యభ్రమకాలు, పాదభ్రమకాలు, అనులోమాలు, విలోమాలు, సంస్కృత తెలుగుభాషలు రెండింటికీ సరిపోయేటట్లు పద్యరచన, అనులోమంగా చదివితే తెలుగుపద్యం, విలోమంగా చదివితే సంస్కృత శ్లోకం. అర్థకాఠిన్యాలు, అర్థచిత్రరచనలు ఇవన్నీ ఉన్నాయి. అప్పకవి చెప్పిన చిత్రకవిత్వ వివరాలు వేరే మనవి లేస్తాను.

గర్భకవిత్వంలో వచనగర్భ పద్యాలు, కందగర్భ మత్తేభాలు, ఆటవెలది గర్భ సీసాలు ఉన్నాయి. ఒక భాషలో మరొభాష ఉండేటట్లు చేసే రచన కూడా చిత్రకవిత్వం కోవలోకే కాక గర్భకవిత్వం కోవకు కూడా వస్తుంది. ప్రశ్నలోనే సమాధానాన్ని ఉంచిన పొడుపుకథలు కూడా ఈ కోవలోకే చేరతాయి.

బంధకవిత్వంలో గోమూత్రికాబంధం, ఛత్రబంధం, గుచ్ఛబంధం, కుండలినాగబంధము, కంకణబంధము, మర్దలబంధము, ఖడ్గబంధం, చక్రబంధము, అష్టదళపద్మబంధము, నాగబంధము, సర్వతోభద్రబంధము, మాలికాబంధము, ఛురికాబంధము, షోడశదళచక్రబంధము, పుష్పబంధము ఉన్నాయి. ఇవి రకరకాల రంగవల్లులను పోలి ఉంటాయి. బొమ్మలు (చిత్రాలు) వేసినట్లుంటాయి. కవిత్వం స్త్రీలలో కూడా వ్యాప్తి చెందిన రోజులలో రంగవల్లుల లోని రకాలే బంధకవిత్వానికి ఆట పట్టులు అయి ఉంటాయి. చిత్రకవిత్వంలో చిత్రాలు (బొమ్మలు) లేవు. దాని అంతర్భాగంగానే ఈ బంధకవిత్వం ఆవిర్భవించి ఉండవచ్చు.

అప్పకవి చెప్పిన చిత్రకవిత్వ భేదాలను ఒక్కసారి పరిశీలించండి.

సీ. అనులోమము విలోమము నిరోష్ఠ్యమును దల
 కట్టును గుడులు శృంగములు నక్ష
రవిలోపమును బద్ధ్రభమకంబు పద్య భ్ర
 మకమును నల్లెంట్లు మఱియు నేక
పదియు ద్విపదియు త్రిపదియును నేకవ
 ర్ణంబును ద్వ్యక్షరి త్ర్యక్షరియును
సరవి నిద్రా వాక్య సంఘట్టనంబును
 నాదిగా గొన్ని పద్యంబులెల్ల

తే.గీ క్షితిని జిత్రకవిత్వ ప్రసిద్ధ నామ
ధేయములచేత బెంపొంది తెలివిమీరు
వాని దెలియగ వచియింతు వాసుదేవ
నంద గోపాంగనా పుత్ర! నరక జైత్ర!

1. అనులోమము :- ఒక కందపద్యము ముందు నుంచి వెనుకకు చదివితే ఒక అర్థం వస్తుంది.

2. విలోమము :- పైన చెప్పిన కందపద్యాన్నే వెనకనుంచి ముందుకు చదివితే గణ యతిప్రాసలు తప్పని మరో కందపద్యం మరో అర్థంతో వస్తుంది. ఇట్లా వ్రాయడం ఒక సర్కసు లాంటిది.

విలోమము ఇమడకపోతే అది అనులోమం కాదు. అంటే అది మామూలు పద్యమే అవుతుంది. అనులోమంలేని విలోమం గాని, విలోమంలేని అనులోమం గాని పద్యరూపంలో ఉండదని సారాంశం. దీని ఉదాహరణ చూడండి.

అనులోమం.-

కం. దామోదరసామ తన ధ
రామా సరసాకర దశరథ హరి రాధా
కామా సదయాతి పరమ
ధామా వర యాదవ కుల దారక రాసా!

విలోమం:-

కం. సారాకర దాలకువద
యారవ మాధామరపతి యాదస మాకా

ధారారిహధర శదకర
సారసమారాధన తమ సారద మోదా।

అనులోమ విలోమాలు సర్కసువంటివే అయినా రహస్య గోపన చేసే ప్రహేళికాలక్షణం ఇమిడి ఉంది.

8. నిరోష్ఠ్యము :- ఓష్ఠ్యములు "ప, ఫ, బ, భ, మ, వ". ఇవి లేకుండా పద్యములు చెబితే అవి నిరోష్ఠ్యా లవుతాయి.

4. తలకట్టు :- హల్లులకు తలకట్టు మాత్రమే ఉంచి పద్యమల్లటం. కందంలో రెండు, నాల్గు పాదాల చివర గురువు ఉండి తీరాలన్న నియమ ముంది. దానికి కేవల దీర్ఘాన్ని మాత్రమే వాడుకోవచ్చు గాని గుడిదీర్ఘము కొమ్ముదీర్ఘాలు మొదలైన దీర్ఘాలు వాడకూడదని గ్రహించాలి. సర్వలఘుకం దానికి దీనికి తేడా ఏమిటంటే "దానిలో తలకట్లతో పాటు మిగిలిన హ్రస్వాలను వాడవచ్చు. కాని దీనిలో కేవలం తలకట్లే వాడుకోవాలి."

5. *గుడులు* :- అన్నీ గుడులే దీనిలో వాడతారు.

6. కొమ్ములు :- అన్నీ కొమ్ములే (ఉత్వాలే) ఉంటాయి.

7. అక్షర విలోపం :- ఇందులో అక్షరం లోపంచేసి చదవాలి. ఇది చ్యుతాక్షర, దత్తాక్షర ప్రహేళికలకు మారురూపు అని గ్రహించాలి.

8. పాదభ్రమకం :- పద్యపాదమును వెనుకనుంచి చదివి నప్పటికీ అదే వచ్చేటట్లు వ్రాస్తే అది పాదభ్రమకం అవుతుంది. ఏపాదానికి ఆపాదమే భ్రమ కంగా ఉంటుంది. ఉదాహరణ చూడండి:

కం. ధీర శయనీయ శరధీ
మార విభానుమత మమతమను భావి రమా
సారస వనవన సరసా
దారద సమ తార తారస దరదా।

భ్రమకంగా ఒక్కపదాన్ని చెప్పడమే కష్టం. అట్లాంటప్పుడు ప్రతి పాదం భ్రమకంగా చెప్పడం ఎంతో కష్టమని అందరికీ తెలుసు భ్రమకం పొడుపు కథలలో ఒక శైలీవిభాగం.

9 *పద్యభ్రమకం* :- ఇది మరీ కష్టమైనది. మొత్తం పద్యం తిప్పి చదివినా ఒక్కలాగే ఉండేదే పద్యభ్రమకం

కం. రాధా నాధా తరళిత
సాధక రథ తావరసుత సరస నిధానా।
నాధానిసరసతసురవ
తాధరకధసాతళిరత ధానాధారా।

"సభవారి నవ్వించు జాణ ఎవదు, కాయలే చెట్లవి కరులుమ్రింగు... అన్నిటికి జూడ నైదేసి యక్షరములు ఈవలావల జూడంగనేకవిధము..." అనే పదభ్రమ కాల పొడుపు కథలు ఆ భ్రమకమే పాదంలోనూ, పద్యంలోనూ చోటు చేసుకొని పాదభ్రమకాలు, పద్యభ్రమకాలుగా అవతరించాయని అనుకోవచ్చు.

10. నల్లెంట్లు :- అప్పకవి చెప్పిన లక్ష్య లక్షణాలను పరిశీలించండి.

కం. నారదముని శార్దూలము
కూరిమి నజినంబు గప్పుకొని వేదుకతో
నారాయణవాసమున క
నారత మేతెంచు ననగ నల్లెంటు లగున్.*

11. ఏకపాది :- ఒకేపాదం అన్ని పాదాలలోనూ ఉంటుంది. అర్థం మారుతుంది.

తే.గీ. మతి వినాయక భరిత సమ్మదు దనంగ
మతి వినాయక భరిత సమ్మదు దనంగ
మతి వినాయక భరిత సమ్మదు దనంగ
మతి వినాయక భరిత సమ్మదు దనంగ.

సీసపద్యంలో నాలుగు పాదాలు ఏకరీతిగాను కింద గీత పద్యంలో నాలుగు పాదాలు ఏకరీతిగాను వ్రాయడం కూడా ఏకపాది కోవకే చెందుతుంది. ఇవి అర్థ

---

* ఇందులో "నారదముని" పదం చేర్చి వెనుక దానికి సమన్వయం చేకూర్చడం దీని ప్రత్యేకత. సమస్యకు దీనికి భేదం ఉంది. అందులో చివరి పాదం మాత్రమే ఇస్తారు. దానిని కొన్ని అక్షరాలు ముందు చేర్చి కాని అర్థ కల్పన చేసికాని దానికి సమన్వయం చూపుతారు. కాని ఇందులో ఇంచుమించు అన్ని పాదాలు ఇచ్చి కేవలం కొన్ని అక్షరాలు చేర్చి దాని "నల్లెంట్ల" లోని విశేషము. సంస్కృత ప్రహేళికల విభాగంలో "హతో హనుమతా రామః" ఈ కోవకే చెందుతుంది.

సంధాన ధౌరేయుడు రామరాజభూషణుడు. జగత్ప్రాణనందన కారుణ్య కటాక్ష లబ్ధ కవితాధారా సుధారాశి సంజని త్రైత్రైక దిన ప్రబంధఘటనా సద్యశ్శ్రుత గ్రంథ కల్పనుడు పుట్టాడు. తిరుపతి వేంకట కవులు, కొప్పరపు సోదర కవులు మున్నగువారు ఆశుకవితా ప్రసిద్ధులు. అడిదము సూరకవి "గడియకు నూరు పద్యములు ఘంటము లేక రచింతు దిట్టగా" అని తన అత్యాశు రచనా పాటవాన్ని ప్రకటించుకొన్నాడు.

ఇట్టి ప్రజ్ఞ అవధాన విధానాలమీదకు కవుల దృష్టిని మళ్ళించింది అష్టావధానాలు, శతావధానాలు, సహస్రావధానాలు బయలు దేరినాయి. దీనికి అసాధారణ ధారణాపటిమ అవసరం. ఇవి చిత్రకవిత్వంలో అంతర్భాగాలుగా చెప్పవచ్చు. అష్టావధానాలలో ఉండే చిత్రాక్షరి, దత్తపది, న్యస్తాక్షరి, సమస్యలలో పొడుపు కథల ఒడుపులు మడుపులు కనిపిస్తాయి. చిత్రకవిత్వంలో పద్యభ్రమకాలు, పాదభ్రమకాలు, అనులోమాలు, విలోమాలు, సంస్కృత తెలుగుభాషలు రెండింటికీ సరిపోయేటట్లు పద్యరచన, అనులోమంగా చదివితే తెలుగుపద్యం, విలోమంగా చదివితే సంస్కృత శ్లోకం. అర్థకాఠిన్యాలు, అర్థచిత్రరచనలు ఇవన్నీ ఉన్నాయి. అప్పకవి చెప్పిన చిత్రకవిత్వ వివరాలు వేరే మనవి లేస్తాను.

గర్భకవిత్వంలో వచనగర్భ పద్యాలు, కందగర్భ మత్తేభాలు, ఆటవెలది గర్భ సీసాలు ఉన్నాయి. ఒక భాషలో మరోభాష ఉండేటట్లు చేసే రచన కూడా చిత్రకవిత్వం కోవలోకే కాక గర్భ కవిత్వం కోవకు కూడా వస్తుంది. ప్రశ్నలోనే సమాధానాన్ని ఉంచిన పొడుపుకథలు కూడా ఈ కోవలోకే చేరతాయి.

బంధకవిత్వంలో గోమూత్రికాబంధం, ఛత్రబంధం, గుచ్ఛబంధం, కుండలినాగబంధము, కంకణబంధము, మర్దలబంధము, ఖడ్గబంధం, చక్ర బంధము, అష్టదళపద్మబంధము, నాగబంధము, సర్వతోభద్రబంధము, మాలికా బంధము, ఛురికాబంధము, షోడశదళచక్రబంధము, పుష్పబంధము ఉన్నాయి. ఇవి రకరకాల రంగవల్లులను పోలి ఉంటాయి. బొమ్మలు (చిత్రాలు) వేసినట్లుంటాయి. కవిత్వం స్త్రీలలో కూడా వ్యాప్తి చెందిన రోజులలో రంగవల్లుల లోని రకాలే బంధకవిత్వానికి ఆట పట్టులు అయి ఉంటాయి చిత్రకవిత్వంలో చిత్రాలు (బొమ్మలు) లేవు. దాని అంతర్భాగంగానే ఈ బంధకవిత్వం ఆవిర్భవించి ఉండవచ్చు.

అప్పకవి చెప్పిన చిత్రకవిత్వ భేదాలను ఒక్కసారి పరిశీలించండి.

సీ. అనులోమము విలోమము నిరోష్ఠ్యమును దల
కట్టును గుడులు శృంగములు నక్ష
రవిలోపమును బంధ భ్రమకంబు పద్య భ్ర
మకమును నల్లెంట్లు మఱియు నేక
పదియు ద్విపదియు త్రిపదియును నేకవ
ర్ణంబును ద్వ్యక్షరి త్ర్యక్షరియును
సరవి నిద్ధా వాక్య సంఘట్టనంబును
నాదిగా గొన్ని పద్యంబులెల్ల

తే.గీ క్షితిని జిత్రకవిత్వ ప్రసిద్ధ నామ
ధేయములచేత బెంపొంది తెలివిమీరు
వాని దెలియగ వచియింతు వాసుదేవ
నంద గోపాంగనా పుత్ర ! నరక జైత్ర !

1. అనులోమము ;- ఒక కందపద్యము ముందు నుంచి వెనుకకు చదివితే ఒక అర్థం వస్తుంది.

2. విలోమము :- పైన చెప్పిన కందపద్యాన్నే వెనకనుంచి ముందుకు చదివితే గణ యతిప్రాసలు తప్పని మరో కందపద్యం మరో అర్థంతో వస్తుంది. ఇట్లా వ్రాయడం ఒక సర్కసు లాంటిది.

విలోమము ఇమడకపోతే అది అనులోమం కాదు. అంటే అది మామూలు పద్యమే అవుతుంది. అనులోమంలేని విలోమం గాని, విలోమంలేని అనులోమం గాని పద్యరూపంలో ఉండదని సారాంశం. దీని ఉదాహరణ చూడండి.

అనులోమం.-

కం. దామోదరసామ తన ధ
రామా సరసాకర దశరథ హరి రాధా
కామా సదయాతి పరమ
ధామా వర యాదవ కుల దారక రాసా !

విలోమం:-

కం. సారాకర దాలకువద
యారవ మాధామరపతి యాదస మాకా

ధారారిహధర శరకర
సారసమారాధన తమ సారద మోదా।

అనులోమ విలోమాలు సర్కసువంటివే అయినా రహస్య గోపన చేసే ప్రహేళికాలక్షణం ఇమిడి ఉంది.

3. నిరోష్ఠ్యము :- ఓష్ఠ్యములు "ప, ఫ, బ, భ, మ, వ". ఇవి లేకుండా పద్యములు చెబితే అవి నిరోష్ఠ్యా లవుతాయి.

4. తలకట్లు :- హల్లులకు తలకట్లు మాత్రమే ఉంచి పద్యమల్లటం. కందంలో రెండు, నాల్గు పాదాల చివర గురువు ఉండి తీరాలన్న నియమ ముంది. దానికి కేవల దీర్ఘాన్ని మాత్రమే వాడుకోవచ్చు గాని గుడిదీర్ఘము కొమ్ముదీర్ఘాలు మొదలైన దీర్ఘాలు వాడకూడదని గ్రహించాలి. సర్వలఘుకం దానికి దీనికి తేడా ఏమిటంటే "దానిలో తలకట్లతో పాటు మిగిలిన హ్రస్వాలను వాడవచ్చు. కాని దీనితో కేవలం తలకట్లే వాడుకోవాలి."

5. *గుడులు* :- అన్నీ గుడులే దీనిలో వాడతారు.

6. *కొమ్ములు* :- అన్నీ కొమ్మలే (ఉత్వాలే) ఉంటాయి.

7. అక్షర విలోపం :- ఇందులో అక్షరం లోపంచేసి చదవాలి. ఇది చ్యుతాక్షర, దత్తాక్షర ప్రహేళికలకు మారురూపు అని గ్రహించాలి.

8. పాదభ్రమకం :- పద్యపాదమును వెనుకనుంచి చదివి నప్పటికీ అదే వచ్చేటట్లు వ్రాస్తే అది పాదభ్రమకం అవుతుంది. ఏపాదానికి ఆపాదమే భ్రమ కంగా ఉంటుంది. ఉదాహరణ చూడండి:

కం. ధీర శయనీయ శరధీ
మార విభానుమత మమతమను భావి రమా
సారస వనవన సరసా
దారద సమ రావ రాసమ దరదా।

భ్రమకంగా ఒక్కపదాన్ని చెప్పడమే కష్టం. అట్లాంటప్పుడు ప్రతి పాదం భ్రమకంగా చెప్పడం ఎంతో కష్టమని అందరికీ తెలుసు భ్రమకం పొడుపు కథలలో ఒక శైలీవిభాగం.

9 *పద్యభ్రమకం* :- ఇది మరీ కష్టమైనది. మొత్తం పద్యం తిప్పి చదివినా ఒక్కలాగే ఉండేదే పద్యభ్రమకం

కం. రాధా నాధా తరళిత
సాపక రధ తావరసుత సరస నిధానా।
నాధానిసరసతసురవ
తాధరకధసాతళిరత ధానాధారా।

"సభవారి నవ్వించు జాణ ఎవడు, కాయలే చెట్లవి కరుల్మ్రింగు... అన్నిటికి జూడ నైదేసి యక్షరములు ఈవలావల జూడంగనేకవిధము..." అనే పద్రభమ కాల పొడుపు కథలు ఆ భ్రమకమే పాదంలోనూ, పద్యంలోనూ చోటు చేసుకొని పాదభ్రమకాలు, పద్యభ్రమకాలుగా అవతరించాయని అనుకోవచ్చు.

10. నల్లెంట్లు :- అప్పకవి చెప్పిన లక్ష్య లక్షణాలను పరిశీలించండి.

కం. నారదముని శార్దూలము
కూరిమి నజినంబు గప్పుకొని వేడుకతో
నారాయణవాసమున క
నారతమేతెంచు ననగ నల్లెంటు లగున్.*

11. ఏకపాది :- ఒకేపాదం అన్ని పాదాలలోనూ ఉంటుంది. అర్థం మారుతుంది.

తే.గీ. మతి వినాయక భరిత సమ్మదు దనంగ
మతి వినాయక భరిత సమ్మదు దనంగ
మతి వినాయక భరిత సమ్మదు దనంగ
మతి వినాయక భరిత సమ్మదు దనంగ.

సీసపద్యంలో నాలుగు పాదాలు ఏకరీతిగాను కింద గీత పద్యంలో నాలుగు పాదాలు ఏకరీతిగాను వ్రాయడం కూడా ఏకపాది కోవకే చెందుతుంది. ఇవి అర్థ

---

* ఇందులో "నారదముని" పదం చేర్చి వెనుక దానికి సమన్వయం చేకూర్చడం దీని ప్రత్యేకత. సమస్యకు దీనికి భేదం ఉంది. అందులో చివరి పాదం మాత్రమే ఇస్తారు. దానిని కొన్ని అక్షరాలు ముందు చేర్చి కాని అర్థ కల్పన చేసికాని దానికి సమన్వయం చూపుతారు. కాని ఇందులో ఇంచుమించు అన్ని పాదాలు ఇచ్చి కేవలం కొన్ని అక్షరాలు చేర్చి దాని "నల్లెంట్ల" లోని విశేషము. సంస్కృత ప్రహేళికల విభాగంలో "హతో హనుమతా రామః" ఈ కోవకే చెందుతుంది.

కాఠిన్యాలని కూడా పిలువబడతాయి. రహస్య గోపన ప్రహేళికల కోవకు ఇవి చెందకపోయినా వినోద ప్రహేళికల కోవకు చెందిన ప్రముషితా ప్రహేళికల దుర్బోధార్థ పదావళీ లక్షణం వీటికి సరిపోతుంది. ముందు ముందు వాటిని చూద్దాం.

సీ. రాజనందనరాజ రాజాత్మజులు సాటి
తలప నన్నయవేమ ధరణీ పతికి
రాజనందన రాజరాజాత్మజులు సాటి
తలప నన్నయవేమ ధరణిపతికి
రాజనందనరాజ రాజాత్మజులు సాటి
తలప నన్నయవేమ ధరణిపతికి
రాజనందనరాజ రాజాత్మజులు సాటి
తలప నన్నయవేమ ధరణిపతికి

తే.గీ. భావ భవభోగ సత్కళా భావములను
భావ భవభోగ సత్కళా భావములను
భావ భవభోగ సత్కళా భావములను
భావ భవభోగ సత్కళా భావములను.

12. ద్విపద :_ ఇందులో మొదటి రెండు పాదాలు, 8, 4 పాదాలుగా ఆవృత మవుతాయి. ఇవి కూడా పైకోవకే చెందుతాయి.

13. త్రిపద :_ దీనిని ఒకభేదంగా అప్పకవి చెప్పినప్పటికీ అది సమంజస మనిపించటం లేదు. ఎందుకంటే మూడు పాదాలు వేరువేరుగా వ్రాసి ఇది దీని లక్షణ మని నాలుగోపాదం చెప్పాడు. అంటే నాలుగు పాదాలు నాలుగు రకాలుగా ఉన్నట్లే, అంటే ఏ పద్యానికయినా ఈ లక్షణం సరిపోతుంది. అందుకే ఇది అనవసరం.

14. ఏకాక్షరి :_ పద్యమంతటా ఒకే హల్లు వాడు కోవటం దీనిలోని ప్రత్యేకత. అర్థయుక్తమైన ఒక్క వాక్యాన్ని ఈ మూసలో వ్రాయండి. కష్టమర్థ మవుతుంది. ఉదా : వాక్యం :_ కాకీక కాకికి కాక కుక్కకా ?

కం. నానా నన నానున్న న, నూనను నిన్ననెను నేను నున్ను నినినన్నై
నా నీ నను నానా నును, నానూన" అనంగ నొంటియక్షరమయ్యెన్.

16. ద్వ్యక్షరి :- కేవలం రెండు హల్లులను మాత్రమే పద్యంలో వాడటం దీని ప్రత్యేకత.

16. త్ర్యక్షరి:- కేవలం మూడు హల్లులను మాత్రమే పద్యంలో వాడటం జరుగుతుంది.

17. ఇచ్చావాక్య సంఘట్టనము:- దీనికి అవధానాలలోని దత్తపదికి భేదములేదు. ఇచ్చిన పదాలను అర్థవంతంగా కూర్చిచెప్పడం దీని ప్రత్యేకత.

సంస్కృతంలో ప్రహేళికలు, పొడుపుకథలు అని రెండింటిగా విభజించి చూపడానికి వీలైనవిగా మనకు కొన్ని కనిపిస్తున్నాయి. ముందు ముందు వాటిని చూపిస్తాను. అట్లాగే తెలుగులోను ప్రహేళికలు, పొడుపు కథలు విడివిడిగా చూపవచ్చు. వ్యాసారంభంలో గేయ, పద్య, వచన రూపంలోని పొడుపు కథలు కొన్ని చూపిఉన్నాను. ఇప్పుడు చిత్రకవిత్వంలో పొడుపు కథలు అని చెప్పినవి తెలుగు ప్రహేళికలు అనుకోవడం సబబు. అర్థకాఠిన్యాలు ఈ కోవకు చెందినవే. కొన్ని పరిశీలించండి.

క. నరసింహ కృష్ణరాయని
కరమరుదగు కీర్తివెలసె కరిభిద్గిరిభిత్
కరికరిభిద్గిరి గిరిభి
త్కరిభిద్గిరిభిత్తురంగ కమనీయంబై ॥

ఉ. అబ్జముఖీ మనోజ ! నరసాధిప నందన కృష్ణ ! నీ యశం
బబ్జక రాబ్జ జాబ్జ నయనాబ్జవిలాసము, నీ పరాక్రమం
బబ్జక రాబ్జ జాబ్జ నయనాబ్జవిలాసము, నీ గుణాదికం
బబ్జక రాబ్జ జాబ్జ నయనాబ్జవిలాసము చిత్రమారయన్॥

ఉ. వీర రసాతిరేక రణవిశ్రుత వేమనరేంద్ర ! నీ యశం
బారభమాన తారకర హారవిలాసము, నీ భుజామహం
బారభమాన తారకర హారవిలాసము, నీ బలాదికం
బారభమాన తారకర హారవిలాసము చిత్రమిద్ధరన్॥

ఉ. శ్రీ కమనీయ పుణ్యశబరీ కబరీ నిబిరీసమాలికా
శీకలశీకృతాంఘ్రి యుగళీ యుగళీ యుగలీధలోకపా

శీకబలానిలాస్థ కదళీ కదళీ కదళీక వైరిసే
నాకులరుద్ధ నాక రఘునాయక భక్తవరప్రదాయకా॥

చ. శరనిధివాస వాసవ వశాప నిశాపతి శారదాభకీ
త్రిరుచివికాస కాసర సరీసృపరీతపరీతదైత్య జై
త్రరణ విలాస లాసకవిధార తిథాళి బుధాళి హార్యనూ
న రథ శరాశరాశ ! రఘు నాయక ! భక్తవర ప్రదాయకా॥


పదాలవల్లనే దుర్బోధ కలుగుతుందనుకోను. సమన్వయ జ్ఞానం, ఇతర శాస్త్రపరిచయం, స్ఫూర్తి లేకపోవటంవల్ల కూడా ఈ దుర్బోధ కలగవచ్చు. అవి కూడా ప్రముషితా ప్రహేళికలలో చేరతాయి అని నా ఊహ. ఈ క్రింది పద్యాలు గమనించండి.

క నక్షత్రముగల చిన్నది
నక్షత్రము చేతబట్టి నక్షత్ర ప్రభున్
నక్షత్రమునకు రమ్మని
నక్షత్రముపైనవేసి నాథుని బిలిచెన్॥

ఇది అభిమన్యుడు యుద్ధానికి బయలుదేరే ముందు వీరతిలకం దిద్దే ఘట్టం లోనిది. ఇప్పుడు అర్థం సుగమం అవుతుంది. ఇరవై ఏడు నక్షత్రాలలో ఉత్తర, భరణి, మూల, హస్త నక్షత్రాలతో చేసిన చిత్రం ఇది. నక్షత్రముగల చిన్నది ఉత్తర. వీరతిలకం దిద్దడానికి భరణి (నక్షత్రం) చేతబట్టి నక్షత్రప్రభుడైన నాథుని మూల (నక్షత్రమున)కు రమ్మని (చేయి) హస్త (నక్షత్రం) పైనవేసి పిలిచింది.

ఉ. కన్యకు నైదుజంఘలును కన్యకు నాలుకుచంబులెన్నగా
కన్యకు నాల్గు కన్బొమలు కన్యకు నేడు విశాలనేత్రముల్
కన్యకు ద్వాదశంబులగు కౌనును గల్గిన పంచలక్షణౌ
కన్యకు నీకు నింక పదిగావలె కస్తురి రంగనాయకా॥

: ఇక్కడ జ్యోతిశ్శాస్త్ర పరిచయ[illegible] ఇట్లా చేయాలి. మేషాది ద్వాదశ రాశులలో కన్య [illegible]. ఈ కన్యారాశికి [illegible], నాల్గు ఏడు, పన్నెండు, పది రాశులు [illegible]. (1) కన్య (2) తుల (3) వృశ్చికము



(4) ధనుస్సు (5) మకరము (6) కుంభము (7) మీనము (8) మేషము (9) వృషభము (10) మిథునము (11) కర్కాటము (12) సింహము.

"కన్యకు ఐదు మకరము. మకర సమానములయిన జంఘలు; కుంభ సదృశములయిన కుచములు; ధనుస్సు వంటి కనుబొమలు; విశాలమీన నేత్రాలు; సింహంవంటి నడుము గలిగిన కన్యకు నీకు మిథునము కావలె" అని కస్తురి రంగనాయకుని దీవిస్తున్నాడు కవి.

తే.గీ. అతివ కచ నాభి జఘనదేహాననము త
మీన దరసాల తారాజపా నిరాక
రణ మనంత మనాదినేత్రగళ భుజన
ఖోష్ఠ కుచవచో దంతంబులుభయగతుల.

ఈ పద్యంలో స్త్రీ అవయవ వర్ణనము ఉంది. సమన్వయం కష్టమే. స్త్రీ అవయవాలను మూడుసార్లు పేర్కొన్నాడు.

1. కచ, నాభి, జఘన, దేహ, ఆననము
2. నేత్ర, గళ, భుజ. నఖ. ఓష్ఠ
3. కుచ, వచో, దంతంబులు

ఈ అవయవాలు నిరాకరిస్తున్న వాటి పట్టిక ఒక్కటే ఇచ్చారు.

"తమీనదరసాల తారా జపా" ఇది మూడుచోట్లకు సరిపోవాలి. చిత్ర కవిత్వ మర్యాద తెలిస్తేనే సమన్వయం చేయగలుగుతాం. పద్యంలో "అనంత, అనాది, ఉభయ గతుల" అని సూచించేడు. (1) అనంతగతి అంటే చివరి అక్షరం లేని గతి. అప్పుడు అవయవాలు "వీటిని" నిరాకరిస్తున్నాయి అన్న సమాసంలో చివరిఅక్షరం తీసిచేస్తే ఇట్లా ఉంటుంది. తమీ, నద, రసా, లతా, రాజ ఇది అన్వయం చేసుకొనే పద్ధతి. (2) అనాది గతి అంటే ఆది అక్షరం లేనిగతి. అప్పుడు అది ఇలా ఉంటుంది. మీన, దర, సాల, తారా, జపా. ఇప్పుడు (3) ఉభయగతి అంటే రెండూ ఉన్నగతి. తమీనద, రసాల, తారా అని సమన్వయం తెలుసుకోవాలి.

ఈ పద్ధతికి చెందినవి రెండు పద్యాలు, రెండు శ్లోకాలుచెప్పి విడిచి పెడతాను. అర్థవివరణ కావలసిన వారు 1974 జూన్ భారతిలో నేను ప్రకటించిన "నేయార్థము- ఒక పరిశీలన" అనే వ్యాసం చూడగోరుతాను.

చ. అలమన చంద్రబింబసమమై తనరారెడు వక్త్రిమందులో
గలిగిన నామభేదముల కైవడి నొప్పెడి కప్పు కొప్పు, చె
క్కులు రదనాంశుకంబు లవి గుబ్బలకున్ సరిగాకపోయె, చే
తులు సరులాయె దానిగతి దోచును పొంకపుటారు బోటికిన్॥

తే.గీ. అధర ముఖవర్ణ శూన్యంబు లతివకుచము
లాన నాకార రహితమబ్జాక్షి మేను
అజ జఘ నమండలము లంచయానకురులు
చరను బాధితకరములు దామ తొడలు.

ఇవి నామాంతరితా ప్రహేళికలు అనవచ్చు. ముందు చెప్పబోయే సంస్కృత ప్రహేళికలలో వీటివివరాలను చూడవచ్చు. ఇలాంటివే ఈక్రింది రెండు శ్లోకాలు.

శ్లో॥ అధు నా మధుకరపతినాగిరితో ఉప్యపకారదంపతీ
యేన త్రాతస్సపాం యేన్మామ్ విగత వికారో వినాయకోలష్యాః.

శ్లో॥ రామచంద్రే రణంప్రాప్తే, మధ్యమం నాక యోషితః
ఆదిమం లేభిరే వీరాః, భీరవశ్చాదిమం రణమ్.

తెలుగు పరిహారికా ప్రహేళికలు:-

తే.గీ. పర్వతశ్రేష్ఠ పుత్రికా పతివిరోధి
అన్న పెండ్లాము అత్తను గన్న తండ్రి
ప్రేమ వారింట పెరిగిన పెద్ద బిడ్డ
సున్న మిప్పుడు తేగదే ! సుందరాంగి.

కట్నకానుకలకు లోటు లేకుండా ఉంటుందన్న నిబ్బరమున్న తరవాత ఈనాటి యువతరం పెళ్ళిచూపులకు వెళ్ళి కొత్త పెళ్ళికూతురు తళుకు బెళుకులూ, అందచందాలు చూసి నోట మాట గాక ముచ్చెమటలుపోసి ఏం ప్రశ్నించాలో తెలీక తనకంటె తక్కువ చదువుకున్నదని చెప్పించడానికి మీరేం చదువుకున్నారు? అని తమ తెలివితేట లన్నీ ప్రదర్శించే ప్రశ్న వేస్తారు. నిజానికి తెలివితేటలను గ్రహించడానికీ. కుశాగ్రబుద్ధి అవునో? కాదో? తెలుసుకోవడానికి ఒక బావ-మరదలిని సున్నం తెమ్మని చెబుతున్న తీరు గమనించండి. అది పై పద్యంలో ఉంది.

పర్వతశ్రేష్ఠపుత్రికవుపార్వతి;-పతి=శివుడు-విరోధి=మన్మథుడు-అన్న=బ్రహ్మ-పెండ్లాము=సరస్వతి-అత్తను=లక్ష్మిని-కన్నతండ్రి=సముద్రుడు-వారింట పెరిగిన పెద్దబిడ్డ=జ్యేష్ఠాదేవి. ఓ ! జ్యేష్ఠా ! సున్నం తే అని సారాంశం.

కుశాగ్ర బుద్ధి కనక ఈ చురుకు గ్రహించిన ఆ మరదలు కింది సమాధానంతో బావకు చురకవేస్తుంది.

క. శత పత్రంబుల మిత్రుని
సుతు జంపిన వాని బావ సూనుని మామన్
సతతము తలధరియించిన
సుత వాహన వైరివైరి ! సున్నం బిదిగో !

శత పత్రంబుల మిత్రుడు=సూర్యుడు - వానిసుతుడు=కర్ణుడు - వానిని జంపినవాడు=అర్జునుడు-వాని బావ=కృష్ణుడు-వాని సూనుడు=మన్మథుడు-వాని మామన్=చంద్రుని-సతతము తల ధరియించినవాడు=శివుడు-వాని సుతుడు=వినాయకుడు - వాని వాహనము=ఎలుక - దానికి వైరి=పిల్లి-దానివైరి=కుక్క. ఓ ! కుక్కా ఇదిగో సున్నం" అని జవాబు. ఇందులో పరిహారికా ప్రహేళిక లక్షణం ఉంది. అంతకు మించి పరిహాసలక్షణం కూడా ఉంది

ఉ. శ్రీ రుచిరత్వభూతిమతి జిత్వరతాకృతి శక్తికాంతులన్
ధీరతసారభోగముల ధీనిధి ఈశ్వర నారసింహుండా
వారిజనాభశంకరుల, వారి కుమారుల వారి తమ్ములన్
వారియనుంగు మామలను వారి విరోధుల బోలు నిమ్మహిన్,

పరిహారిక అంకురం ఉన్న ఈ పద్యం మనుచరిత్ర లోనిది,



సమస్యాపూరణములు - పొడుపు కథలు

చిత్రకవిత్వంలో అవధానాది విధానాలుచేరతాయి. అవధానాలలో సమస్యా పూరణం ఒక ప్రక్రియ. అసందర్భమైన అర్థరహితమయిన పద్యపాదం ఇస్తే దానిని సందర్భస్ఫూర్తితో పూర్తిచేయడమే సమస్యాపూరణము. పొడుపుకథకు ముఖ్యలక్షణం అపార్థకల్పనచేసి అపమార్గాన్ని పట్టించడం అని ముందే చెప్పి ఉన్నాను. అది సమస్యలో కూడా ఉంటుంది. అట్లాంటి సమస్యలే పొడుపు కథలలో జమ అవుతాయి.

కొన్ని సమస్యలకు ఇచ్చిన పద్యపాదాలు కొన్ని ప్రశ్నలకు క్రమంగా సమాధానాలు అయిఉంటాయి. ఆ ప్రశ్న-సమాధానాల రూపంలోని సమస్యా పూరణలను పొడుపు కథలనడం సబబే అవుతుంది. మచ్చుకు కొన్ని గమనించండి.

రాధేయుడు నందినెక్కి రావణుగెలిచెన్

కర్ణుడు నందీశ్వరుని ఎక్కి రావణుని గెలిచాడు అని అర్థం. ఇది ఎట్లా సాధ్యం కర్ణుడు రావణుడు యుద్ధం చేయలేదే? కర్ణుడికి నంది వాహనం కాదే? ఈ సమస్యలను విప్పాలి దీనికి కవి పై మూడు పాదాలలో ప్రశ్నలువేసి చివరి పాదంగా ఇచ్చిన సమస్యను ఉంచి సమాధానమంటాడు.

క. యోధుదెవడు కురు బలమున?
మాధవసఖుదేమి యెక్కి మటి తిరుగాడున్?
సాధించె రాము దెవ్వని?
రాధేయుడు నందినెక్కి రావణుగెలిచెన్.

పైపద్యంలో "యోధు దెవడు కురు బలమున?" అన్న ప్రశ్నకు చివరి పాదంలోని రాధేయుడు సమాధానం. "మాధవసఖు దేమియెక్కి మటి తిరుగాడున్?" అన్న మరో ప్రశ్నకు "నందినెక్కి" అని సమాధానం. సాధించె రాము దెవ్వని? అన్న దానికి "రావణు గెలిచెన్" అన్నది సమాధానము అవుతుంది.

చెలువుగ రామలక్ష్మణులు సీతకు దమ్ములు శంభుదన్నయున్.

సమస్యకు అర్ధంచూస్తే సీతకు రామలక్ష్మణులు తమ్ములు, శంభుడు అన్న అవుతారని ఉంది. దీనిని పరిష్కరించడమంటే మాటలా ? ఇట్లాంటి సమస్యలను ప్రశ్న-సమాధానాల రూపంలోనే సాధారణంగా పూరిస్తూ ఉంటారు. దీని పూరణ చూడండి.

చ. అలరు గణింప పంక్తిరథు నాత్మజు లెవ్వరు ? మైథిలుండునే
లలనకు దండ్రి ? మన్మథుని లావుశరంబులు నెవ్వి ? కాశికా
చెలువుని నామమెద్ది ? మఱి సీరియు శౌరికి నేమి కావలెన్?
చెలువుగ రామలక్ష్మణులు సీతకు దమ్ములు శంభు దన్నయున్.

దశరథుని పుత్రు లెవ్వరు?- రామ లక్ష్మణులు; జనకుడు (మిథిలా నగరాధిపతి) ఎవతెకు తండ్రి?- సీతకు; మన్మథుని లావు బాణము లెవ్వి?- తమ్ములు (తామర పువ్వులు); కాశికా చెలువుని నామమెద్ది?- శంభుడు; బలరాముడు శ్రీకృష్ణుని కేమి కావాలి?- అన్నయున్. ఇది ఇట్లా ప్రశ్నోత్తర రూపంలో పరిష్కృతమయింది.

ఈ రకమైన సమస్యలే కాక కొన్ని అక్షరాలను ముందు చేర్చి అర్థంలో మార్పు సిద్ధంచేసి పరిష్కరించే సమస్యలు ఉన్నాయి. పదచ్ఛేదంతో పరిష్కరించే సమస్యలూ ఉన్నాయి. ఇట్లాంటివి సమాహితా ప్రహేళికలు.

శా. సంధ్యావందన మాచరింపవలదా? చౌశీతి బంధమ్ములన్

వాత్స్యాయనాదులు కామకేళికి 84 బంధాలు ఉన్నాయన్నారు. వాటితోనే సంధ్యావందనం ఆచరింపకూడదా? అని ఎవరో అపర వరూధిని ఒక ప్రవరుణ్ణి హెచ్చరిస్తూ ఉంది. సంధ్యావందనం నైష్ఠిక లక్షణం. ఆచారవంతుని లక్షణం. చౌశీతి బంధమ్ములు కామకేళీపరాయణునికి ప్రియమయినవి. వీటిలో నైష్ఠికుడు సంధ్యావందనం ఆచరించలేడు. మరి ఈ సమస్య నెట్లా పరిష్కరించాలి.

గొడ్రాలు పిల్లలు లేరనే తహతహతో భర్తను, అతని త్రికాల సంధ్యా వందనాన్ని ఏవగించుకొంటూ ఇట్లా అంటున్నాది. ఇప్పుడు "సంధ్యావందనమా? చరింపవలదా ? చౌశీతి బంధమ్ములన్" అని విరుపుతో కవి సమస్యను పరిష్కరించేడు.

"ఈతాకుల గుడిసెలోన ఇనుడుదయించెన్."

సూర్యుడు ఉదయాద్రిని తూర్పున ఉదయిస్తాడు. కాని ఈతాకుల గుడిసె లోన ఇనుడు ఎలా ఉదయించాడు? దీనిని కవి ఎట్లా సమర్థిస్తున్నాడో చూడండి. ఇది కూడా పదచ్ఛేదంతో సమన్వయించిందే.

క॥ సీతాపతి పూదోటకు
ఏతామె త్తంగ పలయు వేకువజామున్
తాతా తొంగున్నావా
ఈతాకుల గుడిసెలోన? ఇనుడుదయించెన్ ॥

మనుమడు తాతను వచ్చి నిద్రలేపుతూ అంటున్న మాట లివి. సీతాపతి పూదోటకు ఏతాము వేకువజామున ఎత్తాలి. ఇనుడుదయించాడు. ఈతాకుల గుడిసెలోన తాతా తొంగున్నావా? నిద్రపోతున్నావా? అని త్వరచేస్తున్న రైతు బిడ్డ ఆరాటం కనిపిస్తూఉంది.

చెప్పాలంటే ఎన్నైనా సమస్యలు చెప్పవచ్చు. వినోదాన్ని కలిగించే ఈ ప్రక్రియలోఉండే ప్రహేళికల లక్షణాలు. పొడుపు కథల ఒడుపులు ఎవరయినా సులభంగా గ్రహించగలుగుతారు.

ఇంక చిత్రకవిత్వంలోని మరిరెండు విషయాలు చర్చించి ముందుకు సాగుదాము. సంస్కృత ఆంధ్ర భాషలలో సరిపోయే ఒక్క జవాబు చెప్పమన్న పొడుపు కథ సంస్కృతి పొడుపుకథలు చర్చించేటప్పుడు మనవి చేస్తాను. రెండు ప్రశ్నలకు ఒక్క సమాధానం చెప్పే పొడుపుకథలు ముందు చాలా చూపించాను. రెండు ప్రశ్నలకు ఒకసమాధానం కంటెకష్టమైనది రెండు భాషలకు ఒక సమాధానం చెప్పడం. దీని ఛాయలు ప్రతిబింబించే గర్భకవిత్వ మనండీ, చిత్రకవిత్వం అనండీ సంస్కృతాంధ్ర భాషాశ్లేష ఒకటి చూడండి.

కం. మాయమ్మా నను నీవే
రాయంవై కావ దేవరా జే జే జే
మాయాతుమ లానినయది
పాయక సంతోసమున్న పలమిల సామీ!

ఒక్క పద్యం తెలుగు సంస్కృతభాషలకు రెండింటికీ సరిపోయేట్లా తుదివరకు నిర్వహించడం మాటలా? పిరిది వశ్య వాక్కు. రెండర్థాలు వచ్చే ద్వ్యర్థి కావ్యాలు వ్రాశారు కాని రెండుభాషలకు ఒకే పద్యం చెప్పడం తెలుగువారి పాండితీ ప్రకర్షకు మంచి నిదర్శనం. తెలుగువారి ప్రజ్ఞకు ఇవి గీటురాయి. పై

పద్యానికి ముందు ఆంధ్ర పద విభాగం తరవాత సంస్కృత పద విభాగం చూపుతాను వాటి వివరణ చేయడానికిది తావుకాదు. అందువల్ల వదులుతున్నాను.

ఆంధ్ర పదవిభాగం :-

మాయమ్మ, అన. సు. నీవే రాయలవు, ఐ, కావన్, దేవరా ; జేజేజే, మాయాతుమలు (మాయాత్మలు); అనిన యది, పాయక, సంతోసము, ఉన్న పలము, ఇల సామీ ;

సంస్కృత పదవిభాగం:-

మా, అయం, మాన, సునీవే, రాయలవా, ఏకా, అవత్, ఏవ, రాజే, అజేజే మాయాతు, మలాని. న, ;యది, పాయక, సంతః, అసముత్, న, పల, మిల, సా, అమీ.

ఇంతకన్న చిత్రమైనదేమంటే అనులోమం తెలుగు, విలోమం సంస్కృతం వచ్చేటట్లా చెప్పిన పద్యం ఒకటి ఉంది. అది పరిశీలించండి.

కం. తావిను వారికి సరవిగ
భావనతో నానుగతి విభావిసుతేజా
దేవర గౌరవ మహిమన
మావలసిన కవిత మరిగి మాకునధీశా ;

ఆంధ్ర పదవిభాగము:-

గతి విభావి సుతేజా ; అధీశా ; దేవర గౌరవ మహిమన, మావలసిన కవిత, తాన్, వినువారికి, సరవిగన్, భావనతోన్, మాకు, మరిగి, అనున్॥

సంస్కృతం వెనుకనుంచి చదివితే వస్తుంది. దానికి పదవిభాగము:- శాధి, ఇన, కుం, ఆగిరి, మత, వికనసి, లవమాన, మహిమ వర గౌరవదే, జాతే, సువిభౌ, ఇతి, నను, నా, అతః, నవ భాగవి; రసకిరి, వా, అనువితా ;

అర్థ తాత్పర్యములు కావలసిన వారు కళాపూర్ణోదయము (మల్లాది సూర్య నారాయణశాస్త్రిగారిచే పరిష్కృతము) 464, 472 పుటలు చూడగోరుతాను.

అయితే ఈ అనులోమ విలోమ ప్రక్రియ చిత్రకవిత్వంలోనుంచి చిత్రాలలోనికి కూడా వచ్చింది. అనులోమంగా చూస్తే ఒక సర్దారు బొమ్మ. అదే విలోమంగా చూస్తే పసిపిల్లవాని బొమ్మ. ఏమి చమత్కృతి. ఇది చూడవలసిందే తప్ప చెబితే తెలిసేది కాదు.

పొడుపు కథలు - అలంకారాలు

ఉత్తరాలంకారంలో ప్రశ్న, ఉత్తరమూ రెండూ ఒకేచోట ఉంటాయి. దీనికి చిత్రోత్తరాలంకారం అని మరో పేరుంది.

శ్లో॥ ప్రశ్నోత్తరాంతరాభిన్న
ముత్తరం చిత్ర ముత్తరం
కే దారపోషణ రతాః ?
కే ఖేహః ? కిం చలం ? వయః ॥

ఈ శ్లోకంలో పూర్వార్థంలో లక్షణము చెప్పారు. ప్రశ్నకు ఉత్తరానికి అంతరం అభిన్నంగా ఉండే అది చిత్రోత్తరాలంకార లక్షణం. సంస్కృతంలో "కే దార పోషణ రతాః ?" అంటే భార్యపోషణ యందాసక్తి గలవారు ఎవరు ? అని అర్థం. దానికి సమాధానం. "కేదార పోషణరతాః". ఇక్కడ అర్థం కేదారాలను (మాగాణులను) పోషించుట యందు అసక్తి గలవారు. వారే దార పోషణరతులని సమాధానమన్నమాట. ఇంక రెండో ప్రశ్నలో రెండు ప్రశ్న లున్నాయి. ఒక్కటే సమాధానముంది. ఇది చతురతకు తార్కాణము. కేఖేటాః ? అంటే ఆకాశంలో సంచరించేవి ఏవి ? అని అర్థము. ఇది బహువచ నంలో ఉన్న ప్రశ్న. కించలం ? అంటే ఏది అస్థిరమయినది ? అని ప్రశ్న ఏక వచనంలో ఉంది. వీటి రెండింటికీ "వయః" అన్నది సమాధానము. వయః అంటే పక్షులు "విః" ఇకారాంతశబ్దం. దీని బహువచన రూపం వయః (పక్షులు) ఇవి ఆకాశంలో సంచరిస్తాయికదా ! ఇంక అస్థిరమైన దేది ? అన్న దానికి వయః అంటే వయస్సు అని సమాధానము. ఇది సకారాంత "వయస్" శబ్దం ప్రథమా విభక్తి ఏకవచనరూపం.

తెలుగు సంస్కృత భాషల్లో ఒకేసమాధానం ఉండే పొడుపుకథ ముందు చూస్తాం. తెలుగులో రెండు ప్రశ్నలకు ఒకే సమాధానము ఇచ్చే పొడుపు కథలు చూపిఉన్నాను. ఆ కోవకే ఇది చెందుతుంది.

ఈ ఉత్తరాలంకారము ఇంగ్లీషు భాషలో కూడా ఉంది. పెద్ద పెద్ద స్కూళ్లల్లో ఒక్కొక్క క్లాసే అనేకమైన సెక్షన్లుగా ఉంటుంది. విద్యార్థుల "నువ్వు ఏ సెక్షన్‌లో ఉన్నా" వని ప్రశ్నిస్తే ఏ సెక్షన్‌లో అని అంటాడు. ఆ ప్రశ్నే సమాధానమైంది. ఇదీ ఉత్తరాలంకారమే. What అన్న పదానికి అర్థం తెలుసుకోగోరి "వాట్" అంటే ఏమిటి? అంటాడు. సమాధానం చెప్పేవాడు "ఏమిటి" అని చెబుతాడు.

ఎద్దీశున కశ్వంబగు? ఏది (ఎద్ది) ఈశ్వరునకు అశ్వము అంటే "ఎద్దు ఈశునకశ్వంబగు" అని సమాధానము.

వక్రోక్తి:-

శ్లో॥ వక్రోక్తిశ్లేష కాకుభ్యామ్
అపరార్థ ప్రకల్పనమ్
ముంచమానం దినం ప్రాప్తమ్
నేహ నందీ హరాంతికే॥

శ్లేష కాకువులచేత అన్యార్థ ప్రకల్పనం చేయటం వక్రోక్తి. సురత పరాఙ్ముఖియైన ఒక నాయికనుద్దేశించి ఒక నాయకుడు "ప్రణయ కోపాన్ని విడిచిపెట్టు. ప్రభాత సమయ మవుచున్నది" అని అంటే ఆపదాలలో విరుపులతో అన్యార్థప్రకల్పన చేసింది "ముంచ మానం దినం ప్రాప్తం" అంటే "నేహ నందీ హరాంతికే" అని నాయిక సమాధానం చెబుతుంది. మానం (ప్రణయ కోపం), ముంచ (విడిచిపెట్టు). దినం ప్రాప్తమ్ ప్రభాత మవుతున్నది. అన్న నాయకుని ప్రార్థనలోని మాటలను నాయిక ఇట్లా విరుమకొని సమాధానం చెబుతుంది. "ముంచమా నందినం ప్రాప్తమ్" అని గ్రహిస్తే అర్థం ఇట్లా వస్తుంది. ప్రాప్తించిన (దొరికిన) నందిని విడిచిపెట్టవద్దు. దీనికి సమాధానంగా "న-ఇహ-నందీ హరాంతికే" అంటే "నంది ఇక్కడ లేదు హరుని సన్నిధిలోనే ఉంది" అని చెప్పింది. ఇక్కడ అన్యాసంగమున ఉన్మత్తుడవై ఉన్న నీకు నంది ఎక్కడ ఉన్నదీ తెలియడం లేదు. లేకపోతే "దొరికిన నందిని విడిచిపెట్టవద్దు" అని నాతో చెప్పడం ఎందుకు? అన్న వక్రభాషణం ఇమిడి ఉంది.

శ్లేష, అతిశయోక్తి, సమాసోక్తి ఎట్లా పొడుపు కథలుగా ప్రహేళికలుగా భాసిస్తున్నదీ ప్రహేళికల లక్ష్య, లక్షణాలను వివరించేటప్పుడు సందర్భోచితంగా చెప్పడం జరిగింది.

ముద్రాలంకారం :

శ్లో॥ సూచ్యార్థ సూచనం ముద్రా
ప్రకృతార్థ పరైః పదైః
నితంబగుర్వీ తరుణీ
దృగ్ యుగ్మ విపులాచ సా.

సూచనీయ వస్తువు యొక్క ప్రకృతార్థ ప్రతిపాదన ప్రయుక్త పదాల చేతనే సూచనం చేయటం ముద్రాలంకార లక్షణం. ఇందులో ఆ నాయిక స్థూల నితంబము కలదని, విశాలాక్షియుగళం కలదని వర్ణించాడు. ఈ వర్ణన చేయటంలో యుగ్మవిపులా అనే పదంచేత ఈ వృత్త నామాన్ని సూచించటం జరిగింది. పొడుపు కథలలో సమాధానాన్ని కూడా సూచించే ముద్ర ముద్రాలంకార ఛాయలున్నదే అవుతుంది. చక్రబంధం మున్నగువానిలో కృతిపతి, కృతికర్తల నామములను ఉండాలన్నది లక్షణంగా నిర్దేశించడంతో ఛందశ్శాస్త్ర సంప్రదాయంలో బంధకవిత్వంలోను పొడుపు కథల ముద్రలున్నాయని చెప్పవచ్చు.

విరోధాభాస :

శ్లో॥ ఆభాసత్వే విరోధస్య
విరోధాభాస ఉచ్యతే
వినాపిఽ తన్వి! హారేణ
వక్షోజౌ తవ హారిణౌ.

విరోధం ఆభాసించటంవల్ల విరోధాభాలంకారం అవుతుంది. ఇందులో "ఓ తన్వీ! నీ వక్షోజాలు హారము లేక పోయినసూ హారులే అవుతున్నాయి" అన్న అర్థం కనిపించి విరోధాభాసగా ఉంది. నిజానికి "హారులు అవుతున్నాయి" అన్నదానికి "మనోహరములైనవి అవుతున్నాయి" అన్నదే అర్థం. అందుచేత ఇక్కడ విరోధం ఆభాస అయింది. పురాణకథల్లోని విరోధాభాసలున్న

ప్రహేళికలను ఈ కోవలోకి చేర్చుకోవచ్చు. సమస్యలరూపంలో ఉన్న పొడుపు కథలన్నిటిలోను విరోధాభాస ఉంటుంది అనుకోవచ్చు.

శ్లో॥ సదూషణాపి నిర్దోషా, సఖరాపి సుకోమలా
నమస్తస్మై కృతాయేన, రమ్యా రామాయణీ కథా.

దూషణతో కూడుకొన్నదయినప్పటికీ, దోషములు లేనిది, ఖరమయిన దయినప్పటికీ కోమలమయినది, రమ్యమైన రామాయణకథ. దానిని రచించిన వాల్మీకికి నమస్కారము అంటున్నాడు. విరోధాభాస కనిపిస్తున్నది. ఇది ఆభాస మాత్రమే ఖరుడు, దూషణుడు రాక్షసులు. దూషణుడున్నప్పటికీ నిర్దోషమయినది రామాయణకథ. ఖరుడున్నప్పటికీ కోమల మయినది రమ్య రామాయణకథ అని సమన్వయం.

—:(o):—

సంస్కృత ప్రహేళికలు

"ప్రహేళయతి సూచయతి భావం నతు స్వరూపార్థమ్ ఇతి ప్రహేళికా", స్వరూపార్థాన్ని అంటే అర్థస్వరూపాన్ని తెలుపకుండా భావాన్ని మాత్రమే సూచించేది ప్రహేళిక. ఇది పొడుపుకథ వంటిది. "రసస్య పరిపంథిత్వాన్నా లంకారః ప్రహేళికా". రసానికి శత్రువు కావటంవల్ల ఇది అలంకారం కాదని కొందరి వాదం "నానాధాత్వర్థ గంభీరా యమకవ్యపదేశినీ, ప్రహేలికా సాహ్యా దితా రామశర్మా చ్యుతోత్తరే. కావ్యాన్యపి యదీమాని వ్యాఖ్యాగమ్యాన్ని శాస్త్రవత్ ఉత్సవః సుధియామేవ హంత దుర్మేధ సోహతాః. అని పైన భామ హుకు పేర్కొన్న రామశర్మగారి అచ్యుతోత్తరీ అనే ప్రహేళికాగ్రంథం మన కిప్పుడు లభించలేదు ప్రాచీనులు, అర్వాచీనులు ఈ ప్రహేళికల మీద ఉపేక్ష భావం కలిగి యున్నారు. "ఉక్తి వైచిత్ర్యమాత్రం సా చ్యుతదత్తాక్షరాదికా" అని అంగీకరించారు.

ఇంక వీటి ప్రయోజనాలు గురించి ఏకగ్రీవంగా అందరూ అంగీక రించారు. అవి

క్రీడాగోష్ఠీ వినోదేషు తజ్జైరాకీర్ణ మంత్రణే
పరవ్యామోహనే చాపి సోపయోగాః ప్రహేళికాః.

క్రీడా గోష్ఠీ వినోదములందును రహస్య సంభాషణములందును, పర వ్యామోహనమునకున్నూ ఇవి ఉపయోగపడతాయి.

దండికాలంనుంచి కూడా ప్రహేళికల ఉపయోగం విషయంలో వివాదాలుంటూనే ఉన్నాయి. వీటిపట్ల భామహుని ప్రీతి. విరోధ దృక్పథాలు స్పష్టము. రుద్రటునిలో వీటిపట్ల ఉదాసీనత, ఉపేక్ష కనిపిస్తాయి. భోజుడు సరస్వతీ కంఠాభరణంలో ఆరు భేదాలను వివరించాడు. దండి వీటి భేదాలను 80 వరకు గుర్తించాడు. కాని 16 భేదాలకు లక్ష్య లక్షణాలను వివరించాడు సాహిత్య దర్పణంలో 1 చ్యుతాక్షరా 2. దత్తాక్షరా 3. చ్యుతదత్తాక్షరా 4. అక్షరముష్టి 5. బిందుమతి 6. అర్థమతి అని ఆరు భేదాలు వివరించాడు. వాటిలో అక్షర ముష్టికి, అర్థమతికి తప్ప మిగిలినవాటికి ఉదాహరణలున్నాయి

చ్యుతాక్షర:— "కూజంతి కోకిలాస్సాలే." సాలమునందు కోకిలలు కూయుచున్నవి. అని అర్థము. రసాలమునందు మాత్రమే కోకిలల కూజితములు ప్రసిద్ధము. అందే ఇక్కడ రసాలశబ్దంలో "ర" చ్యుతముయింది. అది గ్రహిస్తేనే అర్థం సుగమ మవుతుంది.

దత్తాక్షర:— "యౌ వనే ఫుల్లమంబుజమ్" యౌవనమున వికసించిన అంబుజము అని అర్థము. "యౌ" అనేది అధికంగా ఇవ్వబడింది. వనే ఫుల్ల మంబుజమ్ అని గ్రహిస్తే నీటిలో వికసించిన అంబుజము అని అర్థం తెలుస్తుంది.

చ్యుతదత్తాక్షర :— "కిం కరోతు కురంగాక్షి వదనేన నిపీడితా" వదనముచే మిక్కిలి పీడితురాలైన యువతి ఏమి చేయును? అని అర్థం. ఇక్కడ "మ" వర్ణమును చ్యుతంచేసి "వ" వర్ణ మిచ్చినట్లు గ్రహించాలి "మదనేన" అని సమన్వయించుకొంటే మదనునిచే పీడితురాలైన యువతి ఏమి చేయును? అని అర్థం వస్తుంది.

కాదంబరీ వ్యాఖ్యాత చూపిన బిందుమతి ప్రహేళిక:-

ర్థి య ం ం యా రా ం రిం
రి రిం రిం రోః య య ర్థి రీ ం. యః

ం ం య ం ం రి య ం్ర రా.య ం
ం ం రీ ం ం రో ం ం ఠ ం ః ః॥

త్రిభువన చూడా రత్నం
మిత్రం సింధోః కుముద్వతీ బంధుః
అయముదయతి ఘుసృణారుణ
రమణీ వదనోపమశ్చంద్రః॥

పైన చూపిన బిందుమతిలో ఒక్కొక్క పంక్తికి కింద శ్లోకంలో ఒక్కొక్క పంక్తి వ్రాయటం జరిగింది. అక్షరాలుకూడా క్రమంలో ఉన్నాయి. దీనిలో గుణింతము చూడవచ్చు. బిందువు ("ం") హల్లుకుగానీ కేవలం అచ్చులకు గానీ సంకేతంగా గ్రహించినట్లు కనిపిస్తుంది. వివరణ నిమిత్తం బిందుమతి ఒక పంక్తి వ్రాసి దాని కిందనే శ్లోకపాదంలోని అక్షరాలు బిందుమతిలోని బిందువుల కింద ఉంచి చూసుకొంటే ఈ కింది నిర్ణయాలు వస్తాయి.

తలకట్టు తప్ప మిగిలిన అచ్చులను హల్లులమీద చేర్చేటప్పుడు బిందువుల మీద వాటి గుర్తులు చేరుస్తారు. సంయుక్తాక్షరాలకు, ద్విత్వాక్షరాలకు బిందువు కింద బిందువు చేర్చి వ్రాస్తారు. సున్న (అనుస్వారం) చేర్చేటప్పుడు బిందువు పక్క చిన్న బిందువు వ్రాస్తారు. విసర్గ కూడా బిందువు కింద బిందువే. సంయుక్తాక్షరానికి విసర్గకు భేదం మరి చెప్పాలికదూః ఎందుకంటే రెండూ బిందువు కింద బిందువులే. విసర్గలో బిందుపరిమాణం చిన్నది. సంయుక్తాక్షరంలోనూ, ద్విత్వాక్షరంలోనూ బిందు పరిమాణం పెద్దది. ఇది బిందుమతి వ్రాసే పద్ధతి అనుకోవచ్చు.

ఎవరైనా వ్రాయవలసిన దానిని వ్రాసి ఉంచుకొని పై పద్ధతుల ననుసరించి బిందుమతిలోకి మార్చుకోవచ్చు. బిందుమతిని తిరిగి భాషలోకి మార్చుకోవచ్చు. బిందుమతిని తిరిగి భాషలోకి మార్చుకోవడానికి చాలా పాండిత్యం కావాలి. అది ఆనాటి సంగతి.

ఈనాడు మోర్స్‌కోడ్ పద్ధతి అంటే కట్టకడంతో ఇంగ్లీషు భాషలోని 26 అక్షరాలకు సంకేతాలేర్పరచుకొని టెలిగ్రాములు పంపుతున్నారు. ఇక్కడ ధ్వని సంకేతము ఉంది. బిందుమతిలో లిపి సంకేతము ఉంది. దానిని మెరుగు పరిచిన పద్ధతి షార్ట్‌హేండ్ వ్రాత. దీనివల్ల వ్రాత వేగంగా వ్రాయవచ్చు దీనికి

కూడా లిపి సంకేతమే ప్రధానం. దీనిని తర్జుమా చేయుటంలో బిందుమతి లిపిలో ఉన్నంత శ్రమ లేదు. అంత పాండిత్యమూ అవసరం లేదు. అయితే మిలిటరీ సంకేతాలు, రహస్యాలు పదిమందికీ అర్థం కాకూడదు. అప్పుడు బిందుమతి వంటివే ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయి.

బిందుమతికి ముందు చ్యుతాక్షరా, దత్తాక్షరా, చ్యుతదత్తాక్షరా చెప్పాను. వాటిగురించి కొంత వివరించవలసి ఉంది.

చ్యుతాక్షరలో "కూజంతి కోకిలాస్సారే" అని అన్నప్పుడు "ర" చ్యుతం చేసి చెప్పటంవల్ల అర్థం బోధపడదు. "రసాలే" అని సమన్వయం చేసుకోవాలి. ఈ ప్రక్రియ ప్రతి తెలుగు వారింటికీ సుపరిచితం అయిందే. తల్లి ఇంట్లోకి కావలసిన ఏ "జీడిపప్పో" తెప్పించాల్సి ఉంటే ఏ పెద్ద పిల్లణ్ణో, పిల్లనో పంపుతుంది. వెళ్ళిన వాళ్ళు ఇంట్లో తెచ్చి పెడతారు. చెల్లెళ్ళను, తమ్ముళ్ళను సముదాయిస్తున్న తల్లికి ఈ విషయం చెప్పాలి. "అమ్మా నువ్వు చెప్పింది తెచ్చి వంటింట్లో పెట్టాను " అనే వారు ఉంటారు. "జీ" తెచ్చి వంటింట్లో పెట్టాను అనేవారు ఉంటారు. ఇట్లా చెప్పడంలో ఉద్దేశం మరేం లేదు. తమ్ముళ్ళు, చెల్లెళ్ళు మొత్తం తినేస్తారు. మళ్ళీ ఖర్చు. అందుచేత "జీ" అని సంకేతించి "డిపప్పు" అన్న అక్షరాలు చ్యుతం చేస్తారు. ఇది "చ్యుతాక్షరా" అనవచ్చు. ఎటొచ్చీ చ్యుతాక్షరలో ముందు "ర" చ్యుతంచేసి "సాలే" అని వారు చెబితే, వీళ్ళు మొదటిది చెప్పి తరవాతి అక్షరాలను చ్యుతం చేస్తారు. అయితే "చ్యుతాక్షరా" కొంతపాండిత్యముంటే ఎవ్వరికైనా అర్థమవుతుంది. ఈ రెండో తెలుగు చ్యుతకం ప్రకరణం తెలిసిన వారికిన్నీ, ఆ తల్లీ పిల్లలకు మాత్రమే అర్థమవుతుంది.

దత్తాక్షర :- "యా వనే ఫుల్లమంబుజమ్" ఇందులో "యా" అధికంగా ఇవ్వబడింది. దానిని తొలగిస్తే వనే ఫుల్లమంబుజమ్ అని అర్థం స్పష్టమవుతుంది. ఇక్కడ శ్రీ కొల్లూరు లక్ష్మణమూర్తిశాస్త్రిగారి దగ్గర సంగ్రహించిన "అక్షర చ్యుతకం" ఉదాహరించదమవసరం. వారు ఈ దత్తాక్షరా ప్రహేళికనే అక్షర చ్యుతకంగా చెప్పేరు. "అక్షరస్య వర్ణస్య చ్యుతిర్యత్ర తదక్షర చ్యుతకమ్" అని వారు చెప్పేరు.

శ్లో॥ కుర్వన్ దివాకరాశ్లేషం
దధచ్చరణ డంబరమ్

దేవ యౌష్మాక సేనాయాః
కరేణుః ప్రసరత్యసౌ॥

అత్రకరేణు రితి అత్ర కకారస్య చ్యుతినా సమన్వయం భవతి. అంటే "కరేణు" శబ్దంలో "క" చ్యుతిచేస్తే "రేణుః" ప్రసరత్యసౌ అని వస్తుంది. సూర్యుని కప్పివేస్తూ చరణడంబరమైన సేన రేణువును ప్రసరిస్తున్నదని అర్థం.

దీనినిబట్టి చూస్తే మన పిల్లలు మాట్లాడే "క" భాష కూడా ఇట్లాంటిదే అనిపిస్తుంది. కక కబు కరు కచె కప్పా కలి అంటే కబురు చెప్పాలి అనిఅర్థం. ఇందులో వక్త తాను చెప్పదలచిన వాక్యంలోని ప్రతి అక్షరానికి ముందు "క" చేర్చి మాట్లాడుతాడు. శ్రోత "క" చ్యుతంచేసి గ్రహిస్తాడు. ఇదీ మనకు అందుబాటులోనిదే. "క" కు బదులు వేరో అక్షరాన్ని గ్రహించి కూడా దీనిని సృష్టించవచ్చు

చ్యుత దత్తాక్షర ప్రహేళిక :- "కిం కరోతు కురంగాక్షి వదనేన నిపీడితా". "వ" కు బదులు "మ" గ్రహిస్తే "మదనేన నిపీడితా కురంగాక్షి కిం కరోతు" అని అర్థం బోధపడుతుంది.

ఈ సందర్భంలోనే శ్రీ కొల్లూరు లక్ష్మణమూర్తిశాస్త్రిగారు చెప్పిన మాత్రా చ్యుతకం మనవి చేస్తాను. మాత్రాయాః చ్యుతిః యత్ర తన్మాత్రా చ్యుతకమ్".

శ్లో॥ మూలస్థితి మథః కుర్వన్
పాత్రైర్దుష్టో గతాక్షరైః
విట స్సేవ్యోఽకులీనస్య
తిష్ఠతః పథికస్య సః॥

అత్రపాత్రైరితి అత్ర పత్రైరితి; విట ఇత్యత్ర వటఇతిచ సమన్వయః.

అన్వయము :- గతాక్షరైః పాత్రైః మూలస్థితి మథః కుర్వన్ తిష్ఠతః అకులీనస్య పథికస్య సః దుష్టః విటః సేవ్యః అని అర్థం.

"పాత్రైః" పత్రైః అని మార్చుకోవాలి. "విటః" వటః అని మార్చుకోవాలి. అప్పుడు అర్థం సుగమం అవుతుంది.

ఇక్కడ ఒక ఆచారం తెలియాలి. వటుడు (బ్రహ్మచారి) భిక్షాటనకు పోయేటప్పుడు తన చదువుకు సార్థకంగా కొన్ని శ్లోకాలు చదువుతూ భిక్షాటన

చేస్తాడు. ఎక్కడనుంచో సంగ్రహించిన తాళపత్రగ్రంథం నుంచి కొన్ని అక్షరాలు తొలగించి (గతాక్షరైః), కాని పత్రాలను తొలగించి మూలాన్ని అర్థం కరిస్తున్న ఆ వటుడే సేవ్యుడు.

దండి కావ్యాదర్శంలో ఇచ్చిన 16 ప్రహేళికలకు లక్ష్య లక్షణాలను వివరిస్తాను

ఆహుః సమాహితాం నామ గూఢార్థాం పదసంధినా
వంచితాన్యత్ర రూఢేన యత్రశబ్దేన వంచనా.

పదసంధిచేత గూఢమైన అర్థము నిచ్చేదే 1. సమాహితా అనే ప్రహేళిక అని ఆలంకారికులు లక్షణం చెప్పారు 2. వంచితా అనే ప్రహేళిక రూఢ శబ్ద ప్రయోగం చేత అన్యార్థాన్ని గ్రహించేటట్లు వంచన చేస్తుంది.

1. సమాహితా :

శ్లో॥ నమయా గోరసాభిజ్ఞం చేతః కస్మాత్ ప్రకుప్యసి
అస్థానరుషితైః ఏభిః అలమాలోహితేక్షణే.

నా చిత్తము గోరస (పాలు, పెరుగు మొదలైనవి.) ఆస్వాదన ప్రతి లోలుపమయింది కాదు. అందే నేను నీ గోరసాన్ని దొంగిలించలేదు. ఎందుకు నీవు వ్యర్థంగా కోపిస్తున్నావు ? ఓ లోహితేక్షణా ! నీవు అకారణంగా కోపించకు. ఇది బయటకు కన్పించే అర్థము కాని పదసంధిచేత ఈ అర్థం వచ్చింది. సంధి విచ్ఛేదం ఇట్లా చేసుకోవాలి. మే+అగోరసాభిజ్ఞం. అప్పుడు అర్థం మారుతుంది. నాచిత్తం పరస్త్రీ సౌందర్య వీక్షా రూపమైన అపరాధానికి అభ్యస్తమయింది కాదు. (నేను నీకే అపరాధం చేయలేదు). నీవు వ్యర్థంగా ఎందుకు కోపిస్తున్నావు ?

ఇక్కడ పదసంధి చేత ప్రకృతార్థానికి నిగూఢత్వం వచ్చింది. అందుచే ఇది సమాహితా ప్రహేళిక. భోజుడు, హేమచంద్రుడు దీనిని సంబంధగూఢా ప్రహేళికకు ఉదాహరణగా చూపినారు.

ఈ కోవకే చెందినవి శ్రీ కొల్లూరు లక్ష్మణమూర్తిగారి వద్ద సేకరించినవి పరిశీలించండి.

శాబ్దీ ప్రహేళిక:-

శ్లో॥ పయస్వినీనాం ధేనూనాం
వింశతిం ప్రాప్య బ్రాహ్మణః
తాభ్యోఽష్టాదశ విక్రీయ
గృహీత్వైకాం గృహం గతః

దీనిలో పదసంధి చేత గూఢమైన అర్థం వస్తుంది. ఇదీ సమాహితే, దీని అర్థం బయటికిలా కనిపిస్తుంది. పాలిచ్చే ఇరవై ఆవులు పొంది బ్రాహ్మణుడు 18 అమ్మి, ఒక్క దానిని తీసుకొని ఇంటికి వెళ్ళాడు ఇది అసాధ్యం. లెక్కలో ఎక్కడో తప్పు ఉంది అనిపిస్తుంది. కాని సంధి విచ్ఛేదం ఇలా చేసుకోవాలి. ధేన్వా + ఊనా=ధేనూనా, తాం-ధేనూనాం అని గ్రహిస్తే ఒక్క ధేనువు తక్కువ ఇరవై ఆవులు బ్రాహ్మణుడు పొందాడు అని బోధపడుతుంది. అంటే 19 ఆవులు పొంది, 18 అమ్మి. ఒక్కదానిని తీసుకొని ఇంటికి వెళ్ళాడు అని తెలుస్తుంది. లెక్క తప్పులేదు.

శ్లో॥ ఏకో నా వింశతి స్త్రీణాం
స్నానార్థం సరయూంగతా
వింశతిః పునరాయాతా
ఏకో వ్యాఘ్రేణ భక్షితః

ఇది కూడా పైదాని వంటిదే. పైకి తోచే అర్థం ఇలా ఉంది. స్త్రీలలో 19 మంది స్నానానికి సరయూనదికి వెళ్ళారు. పులి ఒకరిని భక్షించగా ఇరవై మంది తిరిగి వచ్చారు. లెక్క తప్పినట్లు ఉంది. కాని పదం విరుచు కోవడం వల్ల అర్థంలో మార్పు వస్తుంది. నా=మనుష్యః; ఏకః నా=ఏకసంఖ్యాక నరః అని గ్రహించాలి. అప్పుడు స్నానానికి సరయూనదికి ఒక నరుడు, ఇరవై మంది స్త్రీలు వెళ్ళారని అందులో ఒక నరుడు వ్యాఘ్రంచే భక్షితుడు కాగా ఇరవైమంది స్త్రీలు తిరిగి వచ్చారని బోధపడుతుంది. దీనిలో తప్పులేదుకదా

కర్తృ లుప్తం:

శ్లో॥ బ్రాహ్మణేభ్యో నదీ తీరే
దదాతి ప్రతి వాసరం
అత్ర కర్తృ పదం వక్తుం
షణ్మా సావధి రుచ్యతే.

ఇక్కడ కర్తృపదం చెప్పడానికి ఆరు నెలలు గడువు అని సవాలు చేస్తున్నారు. వాక్యార్థం బయటికిలా బోధపడుతుంది. "నదీ తీరమున ప్రతి వాసరం బ్రాహ్మణులకు ఇచ్చుచున్నారు" ఎవరు? అంటే కర్తృపదం కనపడదు. ఉన్న చమత్కారమంతా "బ్రాహ్మణేభ్యః" అన్నదానిలోనే ఉంది. "బ్రాహ్మణః" అన్న పదానికి చతుర్థీ విభక్తిలో ఏక, ద్వి, బహువచన రూపాలు ఇవి. బ్రాహ్మణాయ-బ్రాహ్మణాభ్యామ్- బ్రాహ్మణేభ్యః. బ్రాహ్మణేభ్యః బ్రాహ్మణుల కొఱకు అని మాత్రమే స్ఫురిస్తుంది. "ఇభ్యాఢ్యో ధనీ స్వామీత్యమరః" ఇది తెలిస్తే ఇభ్యః అంటే ధనీ అని సమన్వయమవుతుంది. అప్పుడు పదచ్ఛేదం "బ్రాహ్మణః + ఇభ్యః" అన్నమాట. ఓ బ్రాహ్మణుడా! ప్రతివాసరం నదీతీరమున ధనవంతు లిచ్చుచున్నారని అర్థం వస్తుంది. "ఇభ్యః" కర్తృపదం; బ్రాహ్మణః సంబోధన."

శ్లో॥ వటవృక్షో మహానత్ర
మార్గ మా వృత్య తిష్ఠతి
అత్ర సంబోధనాం వక్తుం
షణ్మాసావధి రుచ్యతే॥

"ఇక్కడ మార్గము ఆవరించి మహా వటవృక్షమున్నది" అని మాత్రమే అర్థం బోధపడుతుంది. ఈ వాక్యంలో సంబోధన శబ్దం చెప్పడానికి ఆరు నెలలు వ్యవధి ఇస్తున్నాను అంటున్నాడు.

వటవృక్షం మహావృక్షం అని అందరికీ తెలుసు. మహావటవృక్షం మార్గ మావరించి ఉంటుందన్నదీ సత్యమే. తిష్ఠతి క్రియాపదం ఎక్కడా సంబోధనా పదం కానరాదు. ఇందులో "వట" శబ్దం ప్రక్కనే వృక్ష శబ్దం చేర్చడంతో వటవృక్షమే స్ఫురిస్తుంది కాని సంబోధన వేరుగా కానరాదు. హే! వట! ఓ! వటుడా! అని సంబోధన మన్నమాట.

క్రియాలుప్తం:-

శ్లో॥ విరాట నగరే రమ్యే
కీచకాదుప కీచకమ్
అత్ర క్రియాపదం వక్త్రే
హైమం దాస్యామి కంకణం॥

ఇక్కడ క్రియాపదం చెప్పినవానికి బంగారు కడియం ఇస్తానని ప్రకటిస్తున్నాడు "విరాటనగరే రమ్యే కీచకాదుప కీచకమ్." ఇందులో క్రియాపదం

చూపాలి. అందరికీ తెలిసిన "విరాటనగర" పదాన్ని తీసుకొని చమత్కారం చేశాడు. విః=పక్షి; అవి=చలిస్మి అని సమన్వయం. నగరంలో వెదురునుంచి వెదురుకు పక్షి తిరిగింది. అని అర్థం. పదచ్ఛేదం విః + అట=విరాట అని గ్రహించాలి.

శ్లో॥ అమ్లాన పంకజా మాలా
కంఠే రామస్య సీతయా
పండితో౽పి భ్రమత్యత్ర
ప్రత్యక్షేపి క్రియాపదే॥

ఇక్కడ క్రియాపదం ప్రత్యక్షంగా ఉన్నప్పటికీ (ప్రత్యక్షేపి) పండితుడు కూడా భ్రమిస్తున్నాడు అని ఉంది. రామస్య కంఠే=రాముని కంఠమున, సీతయా=సీతచేత; అమ్లాన పంకజామాలా=ఆనందదాయకమైన పద్మమాల అని ఉంది. క్రియా పదం లేదు కాని ప్రత్యక్షేపి క్రియాపదే అని అనడంవల్ల క్రియా పదం ప్రత్యక్షంగా ఉందంటాడు. ఎక్కడా కనిపించదేం? అని వెతుకుతాము క్రియాపదం "ప్రత్యక్షేపి" అన్నదే. అంటే చిక్షిపే అని గ్రహించాలి

ఇవన్నీ సమాహితా ప్రహేళికలకే ఉదాహరణలు అవుతాయి. అన్నిటిలోను పదసంధిచేతనే అర్థగూఢత్వం ఉంది.

ఇంగ్లీషు భాషలో సంధులు లేవు. కనక పదాలను దగ్గరగా పలికినప్పుడు ధ్వనిచే వేరొకపదం స్ఫురించి సమాహితా ప్రహేళిక ఉత్పన్నమవుతుంది.

ఉదా :- (i) సిక్స్టీ కప్స్ ఆర్ ఆన్ ది టేబుల్
ఫైవ్ కప్స్ ఫెల్ డౌన్.
హౌమెనీ కప్స్ ఆర్ ఆన్ ది టేబుల్?

Six tea cups అనీ Sixty cups అనీ ధ్వనించి అర్థంలో మార్పు తెస్తాయి. గూఢార్థం ఇస్తాయి.

(ii) టెన్ కౌస్ హేవ్ ట్వంటిఫోర్ లెగ్స్.

ఇక్కడ Twenty fore-legs అంటే ముందుకాళ్ళు అని గ్రహించాలి. Four legs అనుకోవటంవల్ల లెక్క తప్పు అనిపిస్తుంది వాక్యాలు వ్రాసి ఇవ్వకుండా, అడిగితే చమత్కారం భాసిస్తుంది.

2. వంచితా ప్రహేళిక :

శ్లో॥ కుబ్జా మాసేవ మానస్య
యథా తే వర్ధతే రతిః
నైవం నివిశతో నారీ
రమర స్త్రీ విశంబినీ.

కుబ్జ స్త్రీతో ఉన్నప్పుడు ఆనందానురాగాలు వృద్ధిపొందినట్లుగా దేవస్త్రీ సమానలయిన ఇతరస్త్రీలతో ఉన్నప్పటికీ నీకు ఆనందరాగాలు కలగవు అని అర్థం. కుబ్జాపదం రూఢంగా గుజ్జుమనిషి, పొట్టిమనిషి, అర్థాలకి చెల్లుతున్నది. కాని ఇక్కడ ఈ రూఢ శబ్దప్రయోగంద్వారా అన్యార్థాన్ని గ్రహించేటట్లు వంచిం చేడు. అందువల్ల ఇది వంచితా ప్రహేళిక. దీని అర్థం రెండు రకాలుగా గ్రహిస్తారు. 1. కుబ్జాపదంవల్ల కన్యాకుబ్జనగరం కాని 2. కుబ్జా అనే ఒక వాద్య విశేషం గాని గ్రహించాలి. అప్పుడు కన్యాకుబ్జనగరంలో నివసించడంవల్ల పొందే ఆనందం కంటె దేవస్త్రీ సమానల పొందువల్ల వచ్చే ఆనందం ఎక్కువకాదు. 2. కుబ్జా అనే వాద్య విశేషాన్ని వాదనచేయటంవల్ల (మ్రోగించటంవల్ల) వచ్చే ఆనందం కన్న దేవస్త్రీ సమానల పొందువల్ల వచ్చే ఆనందం ఎక్కువకాదు.

శ్లో॥ వ్యుత్క్రాంతాతి వ్యవహిత ప్రయోగాన్మోహకారిణీ
సాస్యాత్ ప్రముషితాయస్యాం దుర్బోధార్థా పదావళీ॥

అత్యధిక వ్యవధానంతోకూడిన పదప్రయోగం ద్వారా వ్యామోహం కలిగించేది వ్యుత్క్రాంతా ప్రహేళిక. ఒకవిధంగా చెప్పాలంటే దుర్బోధార్థ పదావళి ఉన్నదే ప్రముషితాప్రహేళిక.

3. వ్యుత్క్రాంతా:-

శ్లో॥ దండే చుంబతి పద్మిన్యా
హంసః కర్కశ కంటకే
ముఖం వల్గురవం కుర్వ
స్తుండేనాంగాని ఘట్టయన్॥

కర్కశకంటక కమలనాళంలో హంస తన అవయవాలను రాస్తూ మధుర ధ్వని చేస్తూ కమలినీ (కమలరూప) ముఖ చుంబనం తన చంచువుతో చేస్తున్నది.

ఇక్కడ దండే-అంగాని, పద్మిన్యాః ముఖం; తుండేన-చుంబతి పదాలను పరికించండి. శ్లోకంలో ఇవి ఎంత వ్యవధానంగా ప్రయోగించాడో చూడండి. దీని వల్ల వాక్యాన్వయానికి ఆసత్తి ఆపేక్షితము అవుతుంది. కావ్యగోష్ఠి మున్నగు వానిలో ఇతరులను వ్యామోహితులనుచేసే నిమిత్తం వ్యుత్క్రమమైతే వ్యుత్క్రాంతా ప్రహేళిక అవుతుంది. పరవ్యామోహన రూపవిశిష్టమైన ప్రయోజనమే లేకపోతే ఇది వాక్యదోషంగా పరిగణింపబడుతుంది. భోజుని సరస్వతీ కంఠాభరణమున వ్యాకీర్ణమనే వాక్యదోషానికి దీనిని ఉదాహరించాడు.

4. ప్రముషితా :

శ్లో॥ ఖాతయఃకని కాలే స్ఫాతయః స్ఫిత వల్గవః
చంద్రే సాక్షాద్భవంత్యత్ర వాయవో మమధారిణః॥

దీనిభావం ఓ బాలా ! నీ ఆహ్లాదదాయక పదముల యందున్న ప్రభూత సాంద్ర మధుర ధ్వనిగల శబ్దకారి కింకిణ్యాద్యలంకారాల ప్రభావం నాపై పడుతున్నది. ఈ స్థితిలో దీనివల్ల నా ప్రాణాలు పోవుటకు సిద్ధంగాఉన్నవి. ఇక్కడ దుర్బోధార్థ పదావళి ప్రముషితా ప్రహేళికా లక్షణం. దుర్బోధార్థాన్ని కలిగించే పదాలు ఖాతి, కాల, స్ఫాతి, వల్గు, చంద్ర, వాయు, అనేవి. కని శబ్దం కేవలం ఋగ్వేదంలో మాత్రమే ప్రయుక్తమై యున్నది. దీనికి ఇతర అర్థాలు క్రమంగా త్రవ్వటం; సమయం; బుద్ధి, సుందరం, చంద్రుడు, గాలి. ఖాతి–ఖం ఆకాశమ్ తస్యాయమితి ఖం శబ్దః, తస్య అతిః (అల్) ప్రాప్తిర్యేషు తే ఖాతయః శబ్దకారి కింకిణాద్యలంకారాః. కాల-కలిప్రేరణే ధాతోః కర్మణి ఘఞ్, స్ఫాతి–స్ఫాయనం స్ఫాః వృద్ధిః తస్య అతిర్గతి ర్యత్రతే స్ఫాతయః. ప్రభూతాః వల్గు–వల్గ్యతే ఉచ్చార్యతే ఇతి వల్గు ధ్వనిః. చంద్ర–చది ఆహ్లాదే ధాతో రౌణాదికే రక్ ప్రత్యయే చంద్రః ఆహ్లాదకః. వాయు–వాన్తీతి వాయువః ప్రాణాః. పైప్రకారంగా అర్థసిద్ధి కలుగుతున్నప్పటికీ ఊహ పొందిటీ ప్రకర్షకుమాత్రమే సాధ్యమయ్యే ఈ అర్థము దుర్బోధార్థకమే. అందుచే ఇది ప్రముషితాప్రహేళిక :

భోజుడు తన సరస్వతీ కంఠాభరణంలో దీనిని రూఢి చ్యుతదోషంగా పరిగణిస్తూ కూడా ప్రహేళికలలో దీని గుణస్వీకారం చేశాడు.

శ్లో॥ సమాన రూపా గౌణార్థా
రోపితైర్గ్రథితా పదైః

పరుషా లక్షణా స్తిత్వ
మాత్ర వ్యుత్పాదిత శ్రుతిః.

(సాధ్యవసాన) గౌణార్థం నుంచి లాక్షణిక అర్థ ఆరోపంతో యుక్త పద ప్రయోగాలద్వారా గ్రథితమైన ప్రహేళికనే "సమానరూప" అంటారు. లక్షణ అస్తిత్వమాత్ర సిద్ధ శబ్దప్రయోగమున్న ప్రహేళికను "పరుష" అంటారు. అంటే అర్థవిశేషసమర్థనంలో వ్యాకరణసూత్రాన్ని తీసుకొని దాని ఆధారంపై శబ్దాన్ని అప్రసిద్ధార్థంలో ప్రయోగించడం.

5. సమానరూపా :

శ్లో॥ అత్రోద్యానే మయాదృష్టా వల్లరీ పంచపల్లవా
పల్లవే పల్లవే తామ్రా యస్యాం కుసుమ మంజరీ.

ఇక్కడ ఉద్యానంలో నేను ఐదు పల్లవాలున్న లతను చూశాను. అక్కడ ప్రత్యేకంగా తామ్రవర్ణపుష్పమంజరి ఒకటి సుశోభితమై ఉంది.

ఇక్కడ ఉద్యానాది పదాలమీద గౌణార్థారోపం ఉంది. దాని ననుసరించి ఉద్యానం నాయికా శరీరం. లత దానిని మోసేది. పల్లవాలు దాని వ్రేళ్ళు. ఆ కుసుమమంజరి తామ్రవర్ణము-నఖప్రభ. ఈ ప్రకారంగా దీని నిగూఢార్థం అభి ప్రేతమయింది. నేను ఒక నాయికా సందారం చూశాను. ఆమె అయిదువేళ్ళలో ఎఱ్ఱని నఖకాంతి శోభాయమానంగా ఉందని చెప్పినప్పుడు గౌణార్థారోపంతో యుక్త పదప్రయోగం ద్వారా గ్రథితమైన ఈ ప్రహేళికను సమానరూపా అనవచ్చుగదా!

ఆలంకారిక మతానుసారం ఇక్కడ సంకల్పనాదృష్టితోచూస్తే సమాసోక్తి అలంకారం కనిపిస్తుంది. "సమాసోక్తిః పరిస్ఫూర్తిః ప్రస్తుతేఽప్రస్తుతస్య చేత్ అయమైంద్రీముఖం పశ్యరక్తశ్చుంబతి శ్చంద్రమాః" ఇది సమాసోక్తి లక్షణం లక్ష్యం (చంద్రాలోకం). మమ్మటుడు దీనిని అతిశయోక్తి భేదంగా గ్రహించాడు.

6. పరుషా :

శ్లో॥ సురాః సురాలయే స్వైరం
భ్రమంతి దశ నార్చి షా

మజ్జన్త ఇవమత్తా స్తే
సౌరే సరసి సంప్రతి.

మద్యపానం చేసేవారు ఇప్పుడు మద్యకుండంలో స్నానం చేస్తున్న వారివలె (అట్టహాసాలద్వారా) వారిదంత కాంతి చూపుతూ మద్యశాలలో స్వైరవిహారం చేస్తున్నారు.

ఈ శ్లోకంలో "సురాః, సురాలయే, సౌరే సరసి" అన్న శబ్దాలలో ఉన్న చమత్కారం వ్యాకరణ సూత్రాలతో సాధించాడు. అందుకే ఇది పరుషా ప్రహేళిక అయింది.

సురశబ్దం "మదిరాపాయి", మదిరాసంబంధ, అర్థాలను వ్యాకరణ సూత్రాలతోనే సాధిస్తుంది. కానీ ప్రసిద్ధార్థాలు క్రమంగా దేవతా, దేవతా సంబంధీ, అథవాసూర్య సంబంధీ (సౌర < సూర్య + అణ్, సూర్యతిష్యా గస్త్య మత్స్యా నాం య ఉపధాయాః; పాణినీయం 6.4; 149, సేయలోపం) అని ఉంది సౌరే సరసి అన్నదానికి మద్యకుండం అర్థం చెప్పాం. కాని "దేవహ్రదం" (మానస సరోవరం)లో అని గ్రహించాలి. సురాలయం అంటే మద్యశాలకు అర్థం చెప్పుకున్నాం. కాని స్వర్గానికి అని అర్థం గ్రహించాలి. ఇప్పుడు చూడండి : దేవతలు దేవహ్రదంలో స్నానంచేస్తూ వారి 'దశనార్చిషా' అంటే దంతకాంతి కాదు, హాస్యచ్ఛట చూపుతూ స్వర్గంలో స్వైర విహారం చేస్తున్నారు. ఇదీ అసలు అర్థం.

శ్లో॥ సంఖ్యాతా నామ సంఖ్యానం యత్ర వ్యామోహకారణమ్
అన్యథా భాసతే యత్ర వాక్యార్థః సా ప్రకల్పితా॥

వర్ణాల గణన లేదా సంఖ్యావాచకశబ్దం పరవ్యామోహకారి అయితే అది సంఖ్యాతాప్రహేళిక అవుతుంది. ఇంక ఏదైనా ఒకవాక్యం తాలూకు అర్థం తన వాస్తవికార్థం కంటె భిన్నప్రకారంగా ఆభాసిస్తే ప్రకల్పితా ప్రహేళిక అవుతుంది.

7. సంఖ్యాతా:-

శ్లో॥ నాసిక్య మధ్యా పరితశ్చతర్వర్ణ విభూషితా
అస్తికాచిత్ పురీయస్యామష్ట వర్ణాహ్వయా నృపాః॥

మధ్య ఒక అనునాసికం ఉండి ఇటు అటూ చెరి రెండేసి వర్ణాలున్న నగరమేది ? ఎనిమిది వర్ణాలతో నిబద్ధమైన రాజు దీనిని పాలించాడు. అతని

పేరేమి? ఇది సంఖ్యాతాప్రహేళిక కావటానికి కారణం ఇందులో నాలుగు, ఎనిమిది అని సంఖ్యావాచక శబ్దాలుండి పరవ్యామోహనకారులు కావటమే.

ఇప్పుడు దీనిభావం పరిశీలిద్దాం. ఙ ఞ, ణ, న, మ. ఇవి అనునాసికాలు. వీటిలో ఏదైనా ఒకటి మధ్యనుండి అటూ ఇటూ చెరి రెండేసివర్ణాలున్న నగరం చెప్పాలి. అది "కాఞ్చీ" (కాంచీ). సంస్కృతంలో వ్రాసేటప్పుడు "ఞ" మధ్య నున్న అనునాసిక మవుతుంది. ఇటూ అటూ ఉన్న చెరి రెండేసివర్ణాలు "క + ఆ"; చ + ఈ. దీనిని పాలించిన రాజు ఎనిమిది వర్ణాలున్న పేరు "పల్లవః". ఎనిమిది వర్ణాలు (ప్ + అ + ల్ + ల్ + అ + వ్ + అ + ః).

8. ప్రకల్పితా:-

శ్లో॥ గిరాస్ఖలంత్యా నమ్రేణ శిరసా దీనయా దృశా
తిష్ఠంతమపి సోత్కంపం వృద్ధేమాం నానుకంపసే॥

ఇక్కడ సామాన్యంగా ప్రతీయమాన వ్యామోహకార్థం ఇట్లా స్ఫురిస్తుంది. హే! వృద్ధురాలా! (రాగావేశంవల్ల) స్ఖలిత వాక్కుతోను, (ప్రణయాభ్యర్థనంలో) వంగిన శిరస్సుతోను, దీనదృష్టితోను నీ సమక్షంలో (కామావేశవశంచేత) జాలిచూపవలసిన స్థితిలో నిలిచిఉన్నప్పటికీ నామీద అనుగ్రహం చూపకున్నావు.

వాస్తవిక అభిప్రేతార్థము :- హే! లక్ష్మి! (దరిద్రతావశమున) గద్గద వాక్కుతో, భక్తినమ్రమైన శిరస్సుతో, దీనదృక్కులతో నీసమక్షంలో దయ నీయస్థితిలో ఉన్నప్పటికీ నామీద నీవు జాలిచూపలేకున్నావు.

పురాణపురుషుడు అంటే విష్ణువు; వృద్ధుడు, ఇతనిభార్య లక్ష్మి, వృద్ధః పుంలింగం దానిమీద స్త్రీలింగరూపం "వృద్ధా" అని గ్రహిస్తే దాని సంబోధన ఏకవచనరూపం "వృద్ధే" అవుతుంది. అది లక్ష్మివాచీ అవుతుంది. అప్పుడే అభిప్రేతార్థసిద్ధి అవుతుంది. అన్యథా ఇక్కడ దీనివల్ల భిన్నార్థప్రాప్తికలిగింది. అందుకే ఇది ప్రకల్పితా అనే ప్రహేళిక.

శ్లో॥ సా నామాంతరితా యస్యాం నామ్ని నానార్థ కల్పనా
నిభృతా నిభృతాన్యార్థా తుల్య ధర్మస్పృ శాగిరా॥

ఏదైనా నామవిశేష ప్రకటనకోసం అనేక వస్తువుల కల్పన చేయబడితే దానినే నామాంతరితా అనే ప్రహేళిక అంటారు. ప్రకృతాప్రకృత తుల్యధర్మ

ప్రతిపాదనచేసే వాణిద్వారా అన్య (ప్రకృత) అర్థగోపనమున్న దానిని నిభృతా ప్రహేళిక అంటారు.

9. నామాంతరితా:-

శ్లో॥ ఆదౌ రాజేత్యధీరాక్షి పార్థివః కోఽపిగీయతే
సనాతనశ్చ నైవాసౌ రాజా నాపి సనాతనః॥

ఓ! చంచలాక్షి! పార్థివలోకంలో సర్వప్రథమ రాజా ఎవరు? పైగా సనాతనుడు. కాని అతడు రాజా కాడు. నిత్యుడు కాడు. పృథ్వీ ఉత్పన్నమయింది కూడా పార్థివమే అంటే వృక్షము. సర్వప్రథమ రాజా శబ్దమున్న వృక్షవిశేషమని మనం గ్రహించాలి. అంతేకాక "సనాతన" అంటే "అతన" శబ్దరహితమైనది కాదు. అంటే "తన" శబ్దం చేరుతుంది. ఆ శబ్దం "రాజాతన" (ప్రియాలము) వృక్షము. అతడు రాజూకాడు. నిత్యుడుకాడు అనటంకూడా సిద్ధమేకదా! ఈ శబ్దం సాలచెట్టుకు కూడా పర్యాయపదంగా అమరకోశంలో ఉంది. దీనికి మరికొన్ని ఉదాహరణలు కూడా ఉన్నాయి.

ఇంగ్లీషు భాషలోకూడా ఈ రకపు పొడుపు కథలు ఉన్నాయి. మచ్చుకొకటి చూడండి.

HE is between to MATS and ICS is after the mat What is it?

విద్యార్థులలో చాలామంది ఇటువంటి వాటిని గుర్తుంచుకోవడం చాలా అవసరం. చాలామంది "మేథమెటిక్స్" అని వ్రాయమంటే తప్పు వ్రాస్తారు. స్పెల్లింగ్ తప్పు చెబుతారు. ఈ పొడుపు గుర్తుంచుకొంటే మేథమెటిక్స్ తప్పు వ్రాయరు. తప్పు చెప్పరు. సాధారణంగా "MATHAMATICS" ఇలా వ్రాసే వాళ్ళ సంఖ్య ఎక్కువ. ఎప్పుడూ తప్పు వ్రాయకుండా ఉండటానికి పై పొడుపుకథ పనికి వస్తుంది. MAT-MAT అని వ్రాసి వాటి మధ్య HE వ్రాయండి. తరవాత MAT పక్క ICS చేర్చండి. అప్పుడు MATHEMATICS వస్తుంది. ఇందులో మరో వ్యంగ్యం కూడా ఉంది. "ICS" MAT పక్కఉందనీ, అతడు MATS మధ్య ఉన్నాడని అనటం నిరుద్యోగ సమస్య దేశంలో ఎంత ప్రమాదకరంగా ఉందో చక్కగా వివరించడమే ఇప్పుడు చెప్పినవన్నీ నామాంతరితా ప్రహేళికలే.

10 నిభృతా :

శ్లో॥ హృత్ద్రవ్యం నరం త్యక్త్వా ధనవంతం వ్రజంతికాః
నానాభఙ్గి సమాకృష్ట లోకావేశ్యా న దుర్ధరా.

తన వివిధ భావ భంగిమలచే అందరినీ ఆకర్షించి ధనహీనుని విడిచి ధనవంతుని వద్దకు పోయేది ఏది? వేశ్యలుకారు. చెప్పండి చూద్దాం. కొంచెం కష్టమే. అవుతుంది. కాని ఆలోచిస్తే "నదులు" అని చెప్పవచ్చు. వేశ్యలు రాగలహరులచే అందరినీ ఆకర్షిస్తారు. నదులు తమ లహరులచే (కెరటాలచే) తమ పక్కకు లాగి ముంచేస్తాయి పర్వతానికి హృత్ద్రవ్యం ఏమిటి? వృక్ష శాఖలు, వాటి పత్రాలు. వాటి అన్నిటినీ తమ ప్రవాహంలోకి నదులు లాగుతాయి. పురుష సదృశమైన పర్వతాన్ని (ధనహీనుని) వదలి ధనవంతుడైన సముద్రుని (రత్నాకరుని) నదులు చేరుకొంటాయి అన్యార్థగోపనంచే ఇది నిభృతా ప్రహేళిక అయింది.

శ్లో॥ సమాన శబ్దోపన్యస్త శబ్దపర్యాయ సాధితా
సంమూఢా నామ సాక్షాన్నిర్దిష్టార్థాపి మూఢయే॥

అభీష్ట శబ్దాల స్థానంలో వాటి పర్యాయ వాచకశబ్దాలను ప్రయోగించి సాధిస్తే అది సమాన శబ్దాప్రహేళిక అవుతుంది. సాక్షాత్ వాచక శబ్దాలద్వారా అర్థం నిర్దిష్టమైనప్పటికీ శ్రోతలలో వ్యామోహోత్పన్నంచేసే దానినే సంమూఢా ప్రహేళిక అంటారు.

11. సమాన శబ్దాః-

శ్లో॥ జిత ప్రకృష్ట కేశాఖ్యో యస్తవాభూమి సాహ్వయః
అసౌ మాముత్కమధికం కరోతి కలభాషిణి

ఓ ! కలభాషిణీ ప్రవాళమును జయించిన నీ యీ అధరం నన్ను ఇప్పుడు అత్యధిక ఉత్సుకుని చేస్తున్నాది.

ఇక్కడ ప్రవాళానికి పర్యాయవాచక శబ్దం ప్రకృష్ట కేశమనీ, అధరానికి అభూమి అనీ మనం గ్రహించాలి. సమానార్థక శబ్ద ప్రయోగంతో కూడుకొన్నది కనుక దీనిని సమానశబ్దా ప్రహేళికా అంటారు.

12. సంమూఢా:-

శ్లో॥ శయనీ యే పరావృత్య శయితౌ కామినౌ రుషా
తథైవ శయితౌ రాగాత్‌స్వైరం ముఖ మచుంబతామ్॥

ప్రేయసీ ప్రియులు ప్రణయకోపంతో శయ్యమీద ఎదముఖం పెదముఖం పెట్టి (పరావృత్య) పడుకున్నారు. ప్రణయకోపం చల్లారిన తరవాత అనురాగంవల్ల వాళ్లు మళ్లీ అట్లే (తథైవ) ఉండి స్వచ్ఛందంగా పరస్పర ముఖ చుంబనం చేసుకొంటున్నారు.

ఇక్కడ మనకు అనిపించేదేమిటంటే వాళ్లు ఎదముఖం పెదముఖంతో ఉండి పరస్పర ముఖచుంబనం స్వచ్ఛందంగా ఎట్లా చేసుకున్నారు? ఇదే దీనిని సంమూఢా ప్రహేళిక చేసింది. సాక్షాత్ వాచకశబ్దంద్వారా అర్థం నిర్దిష్టమవుతున్నా శ్రోతలలో వ్యామోహోత్పన్న కారణమయింది కదా! లక్షణం చక్కగా పట్టింది. "తథైవ" అనటంవల్ల "పరాధృత్య" అని అర్థం. ఎదముఖం పెద ముఖంగా ఉన్నప్పుడు వెనుకకు తిరగటంవల్ల ఎదురెదురుగా ఉంటారు కదా! ఇప్పుడు స్వచ్ఛందంగా పరస్పర ముఖచుంబనం సాధ్యమే కదా! ఇదే చమత్కారము. ఇది వినోదం కోసం మాత్రమే.

శ్లో॥ యోగమాలాత్మికా నామయాస్యాత్ సా పరిహారికా
ఏకచ్ఛన్నాశ్రితం వ్యజ్య యస్యామాశ్రయగోపనమ్॥

యౌగిక శబ్దాల పరంపర (శృంఖల) ఉన్నదే పరిహారికాప్రహేళిక. ఎందుకంటే ఇందులో రూఢ లేదా యోగరూఢ శబ్దాల పరిహారం ఉంది. ఆశ్రిత పదార్థాలను శబ్దంద్వారా స్పష్టంగా చెప్పి వాటి ఆశ్రయగోపనంచేస్తే అది ఏక చ్ఛన్నా ప్రహేళిక అవుతుంది.

13. పరిహారికా:-

శ్లో॥ విజితాత్మ భవద్వేషి గురుపాదహతో జనః
హిమాపహాఽమిత్ర ధరైర్వ్యాప్తం వ్యోమాభినందతి॥

"విజిత-ఆత్మభవ-ద్వేషి-గురు" ఇదొక యోగమాల. అంటే యౌగిక శబ్దాల పరంపర (శృంఖల). రెండో శృంఖల-హిమాపహా-అమిత్ర-ధర. వీటి

అర్థాలు గమనించండి. ''వి'' అంటే పక్షి (గరుత్మంతుడు) దానిచే జితుడు అయినవాడు ఇంద్రుడు-వాని-ఆత్మభవుడు (పుత్రుడు) అయినవాడు అర్జునుడు-వానికి ద్వేషి (శత్రువు) అయినవాడు-కర్ణుడు-వాని గురుడు అంటే తండ్రి సూర్యుడు-అతనిపాదములు-కిరణములు. వాటిచే సంతప్తయిన జనుడు శీత నాశకుడైన (హిమాపహా) అగ్ని-దానికి అమిత్రము అంటే శత్రువు-జలము-ధర దానినిధరించిన మేఘం-వాటిలో ఆచ్ఛాదితమయిన ఆకాశాన్ని అభినందిస్తున్నాడు.

14. ఏకచ్ఛన్నా :

శ్లో॥ నస్పృశత్యాయుధం జాతు నస్త్రీణాంస్తన మండలమ్
అమనుష్యస్య కస్యాపి హస్తోఽయం న కిలాఫలః.

ఒకానొక ''అమనుష్యని'' ఈ హస్తం ఎప్పుడూ ఆయుధాన్ని కానీ స్త్రీ స్తనమండలాన్ని కానీ స్పృశించలేదు. కానీ ఇది నిష్ఫలంకాదు అమనుష్యః= కాపురుషః=పురుషత్వరహితః అని అర్థం. ఇందులో ఉన్న అభిప్రేతార్థము:- ఈ ఆముదపు మొక్క ఏ ఆయుధాన్ని స్పృశించలేదు. (హృద్యమయింది కాక పోవడంవల్ల) స్త్రీ స్తనమండలాన్ని స్పృశించే యోగ్యత దానికి లేదు. కాని ఇది నిష్ఫలంకాదు. సఫలమే అంటే ఫలయుక్తమే. అర్థసమన్వయం పరికించండి.

అమనుష్యః అంటే గంధర్వః, అమనుష్యశబ్ద రక్షస్, పిశాచాదులకు (దేవయోనులకు) కాకికా కారుని మతానుసారం రూఢము. (పాణినీయము 2.4-23) దేవ యోనులలో గంధర్వులు కూడా ఉన్నారు. అమనుష్యహస్తం అంటే గంధర్వహస్తం అని గ్రహించాలి. అమరంలో ''అథ వ్యాఘ్రపుచ్ఛ గంధర్వ హస్తకౌ, ఏరండ ఉరుబూకశ్చ రుచకశ్చిత్ర కశ్చసః'' అని ఉంది. దీనిని బట్టి అమనుష్యహస్తం - గంధర్వహస్తం-ఏరండం - ఆముదపు మొక్క అని అర్థం వస్తుంది.

ప్రస్తుత ఉదాహరణలో ఆశ్రిత (ఏరండ) ఫలవర్ణన చేయబడింది. కాని దాని ఆశ్రయమైన ఏరండ గోపనం జరిగింది. అందుకే ఇది ఏకచ్ఛన్నా ప్రహేళిక అయింది.

శ్లో॥ సాభవే దుభయచ్ఛన్నా యస్యాము భయ గోపనమ్
సంకీర్ణానామ సా యస్యాం నానాలక్షణ సంకరః.

ఆశ్రయానికి మాత్రమే గోపనముంటే దానిని ఏకచ్ఛన్నా అన్నాము. కానీ ఆశ్రిత-ఆశ్రయాలు రెండింటికీ గోపనం ఉంటే దానిని ఉభయచ్ఛన్నా ప్రహేళికా అంటారు. 16 వివిధ ప్రహేళికల సంమిశ్రణమున్న ప్రహేళికను సంకీర్ణా అంటారు.

15. ఉభయచ్ఛన్నా :

శ్లో॥ కేనకః సహ సంభూయ సర్వ కార్యేషు సన్నిధిమ్
లబ్ధ్వా భోజనకాలేతు యది దృష్టో నిరస్య తే.

(ఏది) ఎవరు? అన్ని పనులలో దేనితో కలిసి (మనుష్యునితో) పాటు ఉంటారు? కాని భోజనం చేసే సమయంలో (అన్నంలో) కనిపిస్తే వెంటనే బయట పారవేయబడుతుంది. దీని సమాధానం ఇందులోనే నిగూఢంగా ఉంది. "కేశ" (కః) శిరస్సుతో (కేనసహ) కలిసి అంటే శిరస్సుపై శోభిల్లుతూ అని అర్థం. "కః" శబ్దానికి శిరస్సు, కేశము అని రెండర్థాలున్నట్లు (మోనియర్ విలియమ్స్).

ఇక్కడ ఆశ్రయము (శిరస్సు); ఆశ్రితము (కేశము) రెండూ నిగూఢములు అందుకే ఇది ఉభయచ్ఛన్నా ప్రహేళిక.

16. సంకీర్ణా :

శ్లో॥ సహయా సగజా సేనా సభటేయం న చేజ్జితా
అమాతృకోఽయం మూఢః స్యా దక్షరజ్ఞస్తు నః సుతః.

ప్రతీయమానార్థము:- గుఱ్ఱాలతోను, ఏనుగులతోను, భటులతోను ఉన్న ఈ సేన జయింపబడకపోతే నా యీ అక్షరబ్రహ్మను తెలుసుకొనే పుత్రుడు మాతృరహితుడు అయితే మూర్ఖుడే అయిపోతాడు.

అభిప్రేతార్థము :- హ, య, గ, జ, ఇ, న, భ, ట. మొదలయిన వర్ణాలతో కూడుకున్న ఇది (వర్ణమాల) అభ్యాసం ద్వారా హృదయంగమం చేయబడకపోతే ఈ నా వేదవేత్త పుత్ర మాతృరహితుడు (వర్ణమాల లేనివాడు) అయితే మూర్ఖుడుగానే భావింపబడతాడు.



సంస్కృతంలో పొడుపుకథలు

పదాల గారడీలు, సంధులు, పదవ్యవధానము, అప్రసిద్ధ పదప్రయోగాలు, యౌగికరూఢ పదశృంఖలాలు, సంఖ్యావాచక శబ్దాల వాడుక, వ్యాకరణ సాధ్యాలయిన ప్రహేళికలు చూశాం. ఇప్పుడు అర్థంచేతనే వచ్చే చమత్కారాలు చూపించేవి, తెలుగు పొడుపుకథలలోని తెలుగు తనంలా భాసించేవి మరికొన్ని సంస్కృతపు పొడుపుకథలు పరిశీలించండి.

శ్లో॥ అపదో దూర గామీచ
సాక్షరో నచ పండితః
అముఖః స్ఫుట వక్తా చ
యో జానాతి సపండితః॥

పదములు లేనివాడు కాని దూరంగా పోయేవాడు; అక్షర సహితుడు కాని పండితుడు కాడు. ముఖంలేనివాడు కాని స్ఫుటవక్త. వాడిని తెలిపినవాడే పండితుడు. సమాధానము :- ఉత్తరం (పోస్టుకార్డు, కవరు).

శ్లో॥ వనే జాతా వనే త్యక్తా
వనే తిష్ఠతి నిత్యశః
పణ్యస్త్రీ నతు సా వేశ్యా
యో జానాతి సపండితః॥

వనంలో (నీటిలో) పుట్టింది. నీటిలో విడిచిపెట్టబడేది. నీటిలోనే ఎప్పుడూ ఉంటుంది. డబ్బుకు శరీరాన్ని అమ్ముకుంటుంది. కాని అది వేశ్యకాదు. అది తెలిసినవాడే పండితుడు. సమాధానం:- ఓడ.

శ్లో॥ అనేక సుషిరం వాద్యం
కాంతంచ ఋషి సంజ్ఞితం
చక్రిణాచ సదారాధ్యం
యో జానాతి స పండితః

అనేక రంధ్రాలు కలది. వాద్యము, కాంతము, ఋషి సంజ్ఞ కలది. చక్రిచే ఎప్పుడూ ఆరాధింపబడేది అది ఏది? అది తెలిసినవాడే పండితుడు.

సమాధానము చెప్పేముందు కొంత వివరించవలసి ఉంది. వాద్యము అంటే వాద్యవిశేషమని భ్రమ పడతాము. కాని "వ"కారము ఆదిని కలది అని అర్థము (వ + ఆద్యము=వాద్యము). కాంతము అంటే సుందరము అనుకుంటాం. కాని "క"కారము చివర కలది అని అర్థం గ్రహించాలి (క + అంతము)= కాంతము). చక్రి అంటే కృష్ణుడు అని ఆలోచిస్తాం. కాని చక్రము కలది చక్రి అంటే ఎప్పుడూ చక్రాకారంగా చుట్టుకొని ఉండేది సర్పము. దానిచే సదా ఆరాధింపబడేది ఏదో ఆలోచించండి ఋషి సంజ్ఞ కలది అనటంవల్ల వల్మీకము (పుట్ట) అని స్ఫురిస్తుంది. వాల్మీకి వల్మీకం నుంచి వచ్చినవాడు కదా! అనేక సుషిరం వాద్యం అనటంవల్ల ముందు వేణువు అవుతుందేమో అని భ్రమపడతాం. కాని "కాంతం", "ఋషి సంజ్ఞితం" అన్నవి సమన్వయం కావు. "వ"కారమాదిని, "క"కారం చివరఉండి, అనేక రంధ్రాలుండి సర్పంచే సదా ఆరాధింపబడేది వల్మీకమే.

శ్లో॥ ఏక చక్షుర్న కాకోఽసౌ
బిలమిచ్ఛన్న పన్నగః
క్షీయతే వర్ధతే చైవ
న సముద్రో న చంద్రమాః॥

ఒకదాని లక్షణం వర్ణిస్తాడు. మరోదాని లక్షణంగా లోకరూఢి ఉంటుంది. అదికాదు అని వెంటనే చెబుతాడు. అప్పుడు దాని మరోలక్షణం అభివర్ణిస్తాడు. అది మరోదాని లక్షణంగా లోకంలో ప్రసిద్ధిఉంటుంది. అదికాదు సుమండీ అని హెచ్చరిస్తాడు. మరోలక్షణం ఉట్టంకిస్తాడు. అదికూడా మరోదాని లక్షణంగా భ్రమిస్తామని అదికాదండీ అంటాడు. ఇప్పుడు ఇన్ని లక్షణాలూఉన్న ఇది ఏమిటో చెప్పండి? అని పొడుపుకథ పొడుస్తాడు. ఇలాంటి పొడుపుకథలు తార్కికబుద్ధిని పెంచుతాయి. మన వేదాంత తత్త్వంలో నేతి-నేతి భావం అంటే న + ఇతి, న + ఇతి "ఇదికాదు, ఇదికాదు" అని తోసివేస్తూ పోతే చివరకు తత్త్వం మిగులుతుంది" అన్నది ఒక పద్ధతి. ఇది eliminating process. నేడు అత్యాధునిక గణితశాస్త్రంలో ఈ ఆలోచనా ధోరణి ప్రముఖపాత్ర వహిస్తున్నది. ఇప్పుడు పైన చెప్పిన పొడుపుకథ వివరిస్తాను.

1. ఒక కన్ను కలది కాని కాకి కాదు
2. రంధ్రాన్ని కోరుతుంది కాని పాము కాదు.
3. క్షయ వృద్ధులున్నాయి కాని సముద్రుడూ కాదు, చంద్రుడూ కాదు.
   అది ఏది ?

పై మూడు లక్షణాలు ఉండి కాకి, పాము, సముద్రుడు, చంద్రుడూ కాని దేదో చెప్పండి. సమాధానము:- సూది. దీనికి ఒకటే కన్ను (దారమెక్కించే రంధ్రము) ఉంది. కుట్టేటప్పుడు ఇది రంధ్రాన్ని కోరుతుంది. కుట్టేటప్పుడు ఇటునుంచి అటు పోయేటప్పుడు సూదికి తాత్కాలిక వృద్ధి క్షయాలు ఉన్నాయి.

ఈ పొడుపుకథలో ప్రతి పంక్తిలో మొదటి సగంలో దీని లక్షణం చెప్పి, రెండో సగభాగంలో ఈ లక్షణమే లోకంలో మరో దానికి ప్రసిద్ధి ఉండటం వల్ల అదికాదు అని హెచ్చరిక ఉంది. ఇది ఒక మూస; దీనిలో పోతపోసిన కొన్ని పొడుపుకథలు వచ్చాయి.

శ్లో॥ కృష్ణముఖీ నమార్జాలీ
ద్విజిహ్వా నచ సర్పిణీ
పంచ భర్త్రీ న పాంచాలీ
యో జానాతి స పండితః॥

1. కృష్ణముఖం కలది కాని మార్జాలం కాదు.
2. రెండు నాలుకలున్నాయి కాని సర్పంకాదు,
3. పంచభర్తలు కలది కాని పాంచాలి కాదు.
   అది ఏది ?

సమాధానము:- కలము. అయిదుగురు భర్తలు (ఐదు వేళ్ళు) చే భరింపబడేది అనే అర్థంలో పంచభర్త్రీ అని వాడటం జరిగింది. ఈపైని చెప్పిన వన్నీ శ్రీ అప్పల్ల సోమేశ్వరశర్మగారి రేడియో ప్రసంగం నుంచి సంగ్రహించినవి.

శ్లో॥ వృక్షాగ్రవాసీ న చ పక్షిరాజః
త్రినేత్ర ధారీ నచ శూలపాణిః
త్వగ్వస్త్రధారీ నచ సిద్ధయోగీ
జలంచ బిభ్రన్నఘటో నమేఘః.

1. చెట్టు మీద ఉంది కాని పక్షి కాదు.
2. మూడు కళ్లు ఉన్నాయి కాని ఈశ్వరుడు కాదు.
3. చర్మ వస్త్రమే కలవాడు కాని సిద్ధయోగికాదు.
   అది ఏది ?

సమాధానము:- కొబ్బరికాయ.

శ్లో॥ పాండవానాం సభా మధ్యే
దుర్యోధన ఉపాగతః
తస్మై గాంచ హిరణ్యం చ
సర్వాణ్యా భరణా నిచ.

అర్థం:- పాండవ సభా మధ్యమందు దుర్యోధనుడు ఉపాగతుడు. వానికి గోవును, బంగారము, సర్వ ఆభరణములున్నూ" అని మాత్రమే ఉన్నట్లు కనిపిస్తుంది పదసంధి గ్రహిస్తే మరో అర్థం వస్తుంది.

పదచ్ఛేదం ఇట్లా గ్రహించండి. సమన్వయం సుగమమవుతుంది.
పాండవానాం సభా మధ్యే అదుః + యః + అధనః

=పాండవానాం సభా మధ్యేఽదుర్యోధనః అవుతుంది. పాండవానాం సభా మధ్యే యః అధనః ఉపాగతః తస్మై గాంచ హిరణ్యంచ సర్వాణ్యాభరణానిచ (తే) అదుః అని సమన్వయము. అంటే పాండవ సభామధ్యమున వచ్చిన అధనునకు (నిర్ధనునకు) గోవును, బంగారాన్ని, సర్వాభరణాలున్నూ (తే) వారు (అదుః) ఇచ్చిరి.

శ్లో॥ హతో హనుమతా రామః
సీతా సా హర్షనిర్భరా
రుదంతి రాక్షసాస్సర్వే
హాహా రామో హతో హతః.

పదసంధి తెలియనంతవరకు బయటకు కనిపించే అర్థం ఇది. రాముడు హనుమంతునిచే హతుడైనాడు సీత హర్ష నిర్భర అయింది. హాహా రాముడు హతుడయ్యాడు అని రాక్షసులందరూ ఏడుస్తున్నారు.

మనకు తెలిసినంతలో పురాణకథ దీనిని అంగీకరించదే. దీనిని సమన్వయం ఎట్లా చెయ్యాలి? అనే తహతహ మనను వేధిస్తుంది. పదచ్ఛేదం ఇలా ఉండాలి.

"హనుమతా+ఆరామః = హనుమతారామః" దీనివల్ల రాముడు కాదు ఆరామము (వనం) హతమయింది అని తేలుతుంది. సీత సంతోష నిర్భర అయింది కదా? (అశోకవనం హనుమంతుడు నాశనం చేసినప్పుడు). "హాహా+ ఆరామః+హతోహతః" అని పదచ్ఛేదం చేస్తే హాహాఽరామో హతోహతః అవుతుంది. అప్పుడు ఆరామం నాశనమయిందని రాక్షసులందరూ ఏడుస్తున్నారు అనటం సమంజసమే. ఇందులో వి ప్రతిపత్తి లేదు.

శ్లో॥ కేశవం పతితం దృష్ట్వా
భీమం చైవ గతాయుషం
రురుదుః కౌరవా స్సర్వే
పాండవాః హర్షనిర్భరాః.

శ్లేష దీనికి మూలం. మనకు పరిచయమైన పురాణకథలలోని కొన్ని పాత్రలను పరస్పర విరుద్ధ సన్నివేశాలతో సృష్టించి సమ్మోహత్వం కలిగించారు. చూడగానే పైకి తోచే అర్థం దీనిలో ఇట్లా ఉంది.

పడిన, గతాయువు అయిన కేశవుని, భీముని చూసి కౌరవులందరూ ఏడ్చారు. పాండవులందరూ హర్ష నిర్భరులైరి.

కేశవుడు పాండవ పక్షపాతి. కౌరవులకు కేశవుడంటే పడదు. గతాయువులయిన కేశవుని, భీముని చూసి పాండవులు హర్ష నిర్భరులుకాలేరు. కౌరవులు ఏడ్వరు. అయితే మరి సమన్వయం ఎలా? "కేశవం" అన్న శబ్దాన్ని ఏక పదంగా కాక వ్యస్తపదంగా గ్రహిస్తే "కే-శవం" అవుతుంది. కౌరవ శబ్దానికి నక్క అని అర్థం కూడా ఉంది. పాండవ శబ్దానికి "కొంగ" అని అర్థం కూడా ఉంది. ఇప్పుడు దాని సమన్వయం చూడండి. "కే" అంటే ఉదకే (నీటియందు) అని అర్థం. భీమం అంటే భీముడు కాదు. భయంకరము అని అర్థం. భయంకరం, గతాయుషం అయిన శవం నీటిలో పడటం చూసి కౌరవులు (నక్కలు) అన్నీ గోలపెట్టాయి. కొంగలు (పాండవులు) నీటిలో శవం పడటం వల్ల తమకే దక్కిందని హర్షనిర్భరములైనాయి.

శ్లో॥ ఏకాదశ్యా మహోరాత్రే కర్తవ్యం భోజనద్వయం
రాత్రౌ జాగరణం చైవ దివాచ హరి కీర్తనమ్.

నేటి ఆహార సమస్యను దృష్టిలో పెట్టుకొని నేటి మన నాయకులు కొందరు "Miss a meal" అని నినాదాలు చేశారు. చేస్తున్నారు. ఆరోగ్యం కోసమో, ఆరాధన కోసమో కొన్ని పవిత్ర తిథులను భారతీయులు ఏర్పరుచుకొని ఉపవాసం వారికి వారే విధించుకున్నారు. అందులో ఏకాదశి అట్లాంటి పవిత్రదినం. పై శ్లోకం దానికి విరుద్ధంగా అహోరాత్రములందు భోజనద్వయం కర్తవ్యంగా విధించడం భారతీయ చింతనకు రుచించదు. అందుకే ఇది పొడుపుగా తయారయింది.

"కర్తవ్యం భోజనద్వయం" అన్న దానిని మనం సక్రమంగా పదచ్ఛేదం చేసుకోవాలి. "భో! జన! ద్వయం" ఇప్పుడు సమన్వయం చూడండి. ఓ! నరుడా! ఏకాదశినాడు అహోరాత్రములందు ద్వయం (రెండు) కర్తవ్యం (చేయదగినవి). 1. రాత్రి జాగరణం 2 పగటిపూట హరికీర్తనం. ఈ రెండే చేయదగినవి అని చెప్పాడే కాని రెండుసార్లు భోజనం చెయ్యమని ఎక్కడా ఆదేశించలేదు.

శ్లో॥ అశ్వశాలాచ కాప్రోక్తా
రోగార్తశ్చ బ్రవీతి కిం?
ఆంధ్ర గీర్వాణ భాషాభ్యామ్
ఏకమేవోత్తరం వద.

"అశ్వశాల" అని ఏది పిలువబడుతుంది? "రోగార్తుడు" ఏమంటాడు? ఆంధ్రగీర్వాణ భాషలు రెండింటిలో సరిపోయే ఒకే సమాధానం చెప్పండి

సమాధానం :- మందురా!

శ్లేషలమీద పొడుపుకథలు సృష్టించడం చూపి ఉన్నాను. పొడుపుకథగా గుర్తించవలసిన దానిని తీసుకొని కవి తన కవితాశిల్పంతో ఈ క్రింది శ్లోకాన్ని ఎట్లా మలచినాడో పరిశీలించండి. ఇందులో పొడుపుకథల ఛాయలు మాత్రమే ఉన్నాయి

శ్లో॥ అంగుళ్యా కః కవాటం ప్రహరతి, కుటిలే మాధవః కింవసంతో?
నోచక్రీ, కింకులాలో? నహిధరణిధరః కింద్విజిహ్వః ఫణీంద్రః

నాహం ఘోరాహిమర్దీ కిమసిఖగపతిః ర్నో హరిః కింకపీంద్రః॥
ఇత్యేవం గోపకన్యా ప్రతివచన జితః పాతువశ్చక్రపాణిః.

మాధవుడే కానీ వసంతుడు కాదు.
చక్రి కానీ కులాలుడు (కుమ్మరి) కాదు.
ధరణిధరుడే కానీ ఫణీంద్రుడు కాదు.
ఘో రాహిమర్ది కానీ ఖగపతి కాదు.
హరి కానీ కపీంద్రుడు కాదు.

ఇది ఇట్లా ఉంటే పొడుపుకథ అవుతుంది. కానీ కవితాశిల్పంతో ప్రత్యేకమైన ఒక సన్నివేశానికి కవి దీనిని మలచుకొన్నాడు

గోపకన్యాప్రియుడైన కృష్ణుడు ఒక గోపిక ఇంటికి వెళతాడు. తలుపు వేసి ఉంటుంది. తలుపు తట్టడంతో సన్నివేశం ఆరంభం అవుతుంది లోపల ఉన్న గోపకన్యకు తలుపు తట్టినవాడు శ్రీకృష్ణుడే అని తెలుసు. కొంటెతనంతో అతడు తనను తానే చెప్పుకోలేని రీతిగా ప్రశ్నలు వేసి గోపిక జయించినట్లు కవి చిత్రించాడు. నాటికీ నేటికీ తెలుగునాట నూత్నవధూవరులచే పరస్పరం పేరులు చెప్పించటం ఒక మధుర భావనగా కనిపిస్తుంది. ఈ మధుర ఘట్టాన్ని మన కళ్ళ ముందుంచాడు కవి.

గోపకన్య :- ఎవరు తలుపు తట్టుచున్నది?
కృ :- నేను మాధవుడను
గో:- ఓహో! వసంతుడవా?
కృ:- అహ! కాదు. చక్రిని
గో:- ఓహో! కులాలుడవా? (కుమ్మరివా?)
కృ:- కాదు. ధరణీ ధరుడను.
గో:- ఓహో ! ఆదిశేషుడవా ?
కృ:- కాదు. నేను ఘోరఫణి మర్దనుడను
గో:- ఓహో ! గరుత్మంతుడవా ?
కృ:- కాదు. హరిని
గో:- ఓహో ! కోతివా ?

అని గోపకన్యచే ప్రతివచనవిరుదయిన చక్రపాణి మిమ్ములను రక్షించు గాక

ఈ సంస్కృత ప్రహేళికలు, పొడుపుకథలు ఆహ్లాద జనకములై చిత్ర విచిత్ర మనోధర్మాన్ని సృష్టిస్తాయి. కనక వీటిని ఆలంకారికులు కొన్ని అలంకారాలుగా చూపించారు. వీటికి మెరుగులు దిద్ది ఛందశ్శాస్త్రజ్ఞులు కవిత్వంలో చిత్ర కవిత్వంగా, గర్భకవిత్వంగా, బంధకవిత్వంగా చెప్పినారు.

—:(o):—

ఆధునిక సాహిత్యం - పొడుపుకథలు

భావప్రకటన సామర్థ్యాన్ని కలిగిఉండటమే భాషా లక్షణం. సాహిత్యంలో భాషకు ప్రధాన పాత్రఉంది. భాష, సాహిత్యం రెండూ ప్రజాభిరుచికి దగ్గరగా ఉండే ఎక్కువ ప్రచారాన్ని పొందుతాయి. నేడు ప్రచుర ప్రచారసాధనాలుగా భావింపబడుతున్న పత్రికలు, మగజైన్లు, రేడియోలు, సినీమాలు భాషకు, సాహిత్యానికి చాలా సేవచేస్తున్నాయి. సినీ సాహిత్యం సాహిత్యభేదాలలో ఒకటిగా గుర్తించవలసినంతగా తయారయింది. ప్రధానభేదంగా గుర్తించవలసినంతగా పెరిగింది.

చదువు ఉన్నా లేకపోయినా అందరినీ ఆకట్టుకొంటున్నాయి సినీమాలు. చదువు నేర్చినవారికి మాత్రమే ఆనందాన్ని కలిగించేవి పత్రికలు, మేగజైనులు. చదువు లేకపోయినా కేవలం వినటంమూలంగా వినోదకాలక్షేపం చేసేవి రేడియోలు. చూడటం, వినటంమూలంగా వినోద కాలక్షేపం చేసేవి సినీమాలు. వాటి బహుజనరంజకతకు అదే కారణము. ప్రజలకు అత్యంత సన్నిహితమైన భాషను వాడినవే వీటిలో ఎక్కువగా నిలుస్తాయి. జాతి నుడికారానికి, ఆలోచనా సరళికి ఒదిగి ఉండి, తనతో తీసుకొనిపోయే సాహిత్యం కలకాలం నిలుస్తుంది. అట్లాంటి సాహిత్యాన్ని అందించడానికి మన సినీరచయితలు కూడా నడుం కట్టారు. ఆచార్య ఆత్రేయ, శ్రీశ్రీ, శ్రీ దాశరథి, డాక్టరు సి. నారాయణరెడ్డి, శ్రీ ఆరుద్ర, శ్రీ కొసరాజు ప్రభృతులు కృషిచేస్తున్నారు.

ఈ మధ్య బడిపంతులు సినీమాలో ఒకపాట వచ్చింది. అది పొడుపుకథ అనడానికి సందేహంలేదు. అత్యాధునిక పరికరాన్ని తెలిపే పొడుపుకథను సృష్టించారు. ఇది ప్రతివారిపై ముద్రవేసింది. అనటం సాహసం కాదు. మనుమరాలిచే నాయనమ్మకు వినిపించిన పాట ఇది. అందే ఆధునిక నాగరకత ఎరిగినపిల్ల ఈ నాగరకతకు ఒక తరం వెనకపడిఉన్న నాయనమ్మకు వినిపించింది. ప్రకృతిని కైవసం చేసుకుంటూ ఉన్న విజ్ఞానశాస్త్రవేత్తల కృషిని మనముందు ఉంచడంలో ఆచార్య ఆత్రేయ చూపిన తీరు ఎంతో ప్రశంసనీయమయింది. కవి విశ్వజనీనతను ఎట్లా సృష్టించాడో గమనించండి.

బూచాడమ్మా బూచాడు – బుల్లి పెట్టెలో వున్నాడు
కళ్ళ కెపుడు కనపడడూ – కబురులెన్నో చెబుతాడు. ॥బూచా॥

గురుగురుమంటూ గోలెడతాడు హల్లో అని మొదలెడతాడు
ఎక్కడ వున్నా ఎవ్వరినైనా – పలుకరించి కలుపుతాడు ॥బూచా॥
తెలుగు తమిళ హిందీ కన్నడ భాషా భేదా లెరుగనివాడూ
కులము మతము జాతే దైనా – గుండెలు గొంతులు ఒకటంటాడూ ॥బూచా॥

ఢిల్లీ, మద్రాస్, హైద్రాబాద్
రష్యా, అమెరికా, లండన్, జపాన్
ఎక్కడికైనా వెళుతుంటాడూ
ఎల్లలు మనకు లేవండాడూ
ఒకే తీగపై నడిపిస్తాడూ
ఒకే ప్రపంచం అనిపిస్తాడు ॥బూచా॥

సమాధానం:– టెలిఫోను. ఇది అత్యాధునిక పరికరం. దీనికి భాషా భేదం లేదు. ఎంత దూరమైనా ఫరవాలేదు. ప్రపంచం నాలుగు చెరగులా దీని ప్రభావం ఉంది.

చాలా రోజుల క్రిందట హాస్యాన్ని అందిచ్చే వ్యంగ్యాన్ని రంగరించుకొన్న ఒక పొడుపుకథ వచ్చింది. పొడుపుకథ మేరకే ఆలోచిస్తే వ్యంగ్యం స్పష్టంగా ఉంది. సమాధానంలో మాత్రమే చూస్తే వ్యంగ్యమే ఉండదు. ఆనందవర్ధనుని ధ్వని వాదానికి ప్రధానమయిన వ్యంగ్యం ఎంత చక్కగా చోటు చేసు

క్కున్నదీ చూడవచ్చు. ఆ పొడుపు కథను పరిశీలించండి. జానపద గేయ వాఙ్మయంలోనిదే తీసుకొని బాలరాజు సినిమాలో చేర్చారు.

ఒక్కరికి చెయ్యినిచ్చి, ఒకరికి కాలు నిచ్చి
ఒకరికి నడుము నిచ్చి కూకున్నా నోయ్ రాజా।
కూకున్నా నోయ్

ఆ అనాఘ్రాత పుష్పాన్ని మనసారా ప్రేమిస్తున్నవాడికి ఈ మాటలు గుండెల్లో సూదిగా నాటుకొన్నాయి. నమ్మి నమ్మలేని స్థితిలో ఒక్కసారి ఉక్కిరి బిక్కిరై ఎవరికి? అని ప్రశ్నిస్తాడు. సమాధానం చెప్పి చిత్తు జేస్తుంది ఆ వయ్యారి వగలాడి.

గాజుల్కి చెయ్యినిచ్చి, అందెల్కి కాలు నిచ్చి
వడ్డాణాన్కి నడుమూనిచ్చి కూకున్నానోయ్ రాజా।

రాగద్వేషాలకూ, సుఖదుఃఖాలకు అతీతంగా ఉండటం ఒక్క యోగులకు తప్ప అందరికీ సాధ్యం కాదు గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నా చిరునవ్వుతో పలకరించ గల ధీరులు యోగులు కాక మరెవ్వరు? వారు నవ్వడమే కాక ఎదుటి వారిని నవ్వించడానికి హాస్యరసస్ఫూర్తి కావాలి. కొంతమంది వారి వికారచేష్టలతో హాస్యాన్ని సృష్టిస్తారు. మరికొంతమంది వారి సంభాషణలద్వారా హాస్యాన్ని అందిస్తారు. ఈ రెండో రకం ఉత్తమమయింది. ధ్వని, వ్యంగ్యం, అర్థశ్లేష, పదాలమీద ఇచ్చే ఊనిక (Stress), పదాలను పలికే తీరు (Intonation) తో భాషా పరమయిన హాస్యం జనిస్తుంది

కడుపుబ్బా నవ్వించే ఘట్టాలకు హాస్యరస పాత్రలకు ఒకరకం పొడుపు కథలను పాటల రూపంలో నేడు సినీ సాహిత్యంలో వాడుతున్నారు. పాటలో మనలను ఉక్కిరి బిక్కిరి చేస్తూ పతాకస్థాయి వరకు చేర్చి చివరకు సమాధానం చెప్పి కాళ్ళూ చేతులూ చల్లబరిచే హాస్యాన్ని సృష్టించడం ఈ కోవలోకే వస్తుంది. ఏయసులో ఉన్న భార్య నిజం చెప్పి తన భర్తను ఆటపట్టించిన తీరు మనలను తప్పుదారి పట్టిస్తుంది. కేవలం ప్రశ్న-సమాధానం రూపంలో లేని పాట పొడుపు కథ అవుతుందా? అని శంకించ కూడదు. ఈ పాట "కల్లు-ఇల్లాలు" చిత్రంలోని రెండు హాస్యపాత్రలమధ్య జరిదిన సంభాషణ.

ఆమె:- వినరా సూరమ్మ కూతురు మొగుడా!
విషయమ్ము చెబుతాను-అసలు విషయమ్ము చెబుతాను

అతడు:- చెప్పుమరీ

ఆమె:- కారుమబ్బులు కమ్మేవేళా-కాకులు గూటికి చేరేవేళా

అతడు:- కా-కా

ఆమె:- చందమామ తొంగి చూసేవేళా-సన్నజాజులు పూసేవేళా

అతడు:- అహా-ఓహో

ఆమె:- ఒంటిగ నేను ఇంట్లో వుంటే
ఉయ్యాల ఎక్కి వూగుతువుంటే
లాలి లాలి లాలి లాలి లాలిలో

అతడు:- ఏం జరిగింది?

ఆమె:- తలుపు కిర్రున తప్పుదైనదీ-గుండె ఝల్లునా కొట్టుకొన్నదీ.
మెల్ల మెల్లగా కళ్లు తెరచి-నేవచ్చిన దెవరో చూశాను

అతడు:- ఎవలాలు?

ఆమె:- నల్లనివాడు-గుంటకన్నులవాడు
గుబురు మీసాలవాడూ

అతడు:- అయ్యబాబోయ్

ఆమె:- ఆరడుగుల పొడుగువాడు-ముద్దులిమ్మని నన్ను అడిగినాడు

అతడు:- ఏయ్ వాణ్ణి నేన్నరికెత్తాను

ఆమె:- నేనివ్వ రానంటూ మొఖము దాచుకున్నా
పోనివ్వ పోనివ్వ ముద్దివ్వమంటూ జడను లాగినాడూ
అమ్మా-నాన్నా-అమ్మా-నాన్నా
కాపాడమంటూ అల్లాడి పోయాసూ
అయినా కాని వదలకనన్నూ ఒడిసి పట్టినాడు
అంతలో వచ్చింది

అతడు:- ఏమిటి మూర్ఛా?

ఆమె:- కాదు మా అమ్మ

అతడు:- ఊఁ ఏమందీ

ఆమె:- వెళ్ళవే నాతల్లి వెళ్ళవే అమ్మా
ముద్దులిస్తే నీకు డబ్బు లిస్తాడు
మంచి బట్టలిస్తాడు అని ముందుకు

అతడు:- ఆ-అది తల్లా కాదు రాక్షసి, పిశాచి,
దయ్యం, తల్లాతేమయిందో చెప్పు

ఆమె:- తప్పని సరియై వెళ్ళాను-సిగ్గుపడుతు నిలుచున్నాను

అతడు:- ఆఁ

ఆమె:- గదిలో కెత్తుక పోయాడు-కథలూ కబుర్లు చెప్పాడు
తన దుప్పటిలో చోటిచ్చాడు.

అతడు:- ఛీ! కులటా! పాపాత్మురాలా! నువ్వు నాకొద్దు-
పో వాడి దగ్గరకే పో.

సంభాషణ పతాకస్థాయి చేరుకొంది. ఇప్పుడు సమాధానంతో ఏమవుతా మో చూదండి.

ఆమె:- అంతకోపం ఎందుకయ్యా
అప్పుడు నా వయసైదయ్యా

అతడు:- ఏమిటీ అప్పుడు నీ కైదేళ్ళా!

ఆమె:- వచ్చిందీ మా తతయ్యా-తాతయ్యా

అతడు:- తాతయ్యా మరి చెప్పవేఁ-తాతయ్యా

ఆమె:- తకదియ్య

అతడు:- తాతయ్యా నేను ఎవరో అనుకున్నాను-
తాతయ్యా కొంప ముంచేశాడు

ప్రకరణంచేత, మాటలు ఒకదానిపై ఒకటి పేర్చడం ద్వారా దీనిః సృష్టించాడు.

పాతాళభైరవిలో పొడుపుకథలాంటి ఒక చిక్కు లెక్క ఉంది. దీనిని ఆధారం చేసుకొని "మేరా నామ్ జోకర్" లో ఒక పాట పెట్టారు. ఈ చిక్కు లెక్క చూదండి.

పిల్లికి ముందు రెండు పిల్లులు
పిల్లికి వెనుక రెండు పిల్లులు
పిల్లికి పిల్లికి మధ్య ఒకపిల్లి
మొత్తం పిల్లుల సంఖ్య ఎంత?

తొమ్మిది పిల్లులు, ఏడు పిల్లులు అని చెప్పేవారు ఉన్నారు. కాని నిజానికి మొత్తం పిల్లుల సంఖ్య మూడే. పిల్లులకు బదులు పావురాలని "మేరా నామ్ జోకర్" సినీమాలో పాట పెట్టారు.

ఇల్లరికం సినీమా సరాసరి పొడుపుకథ మీదే నడిచింది. ఆ పొడుపు కథకు సమాధానాలు చెప్పుకోవాలని విద్యార్థినుల ప్రతినిధికి, విద్యార్థుల ప్రతినిధికి పోటీ పడుతుంది. తరవాత పరస్పరం ప్రేమించుకొంటారు. దానిమీద కథ అంతా నడిచింది.

ఒంటి కాలిపై నుండీ
హఠ యోగ నిద్రలో నుండీ
గుట్టుగ తనపని సాధించునది
వివరిస్తావా? చిన్నదానా?

అని ఆరంభమవుతుంది. కుక్కగొడుగు అని జవాబు చెబితే "కొంగ" అని చెబుతాడు విద్యార్థుల ప్రతినిధి. ఆమె మరో పొడుపుకథ పొడుస్తుంది. ఇతడు సమాధానం చెబుతాడు. కాదంటుంది. వేరే సమాధానం చెబుతుంది. మరో పొడుపుకథ ఇతడు పొడుస్తాడు. ఇట్లా సాగుతుంది. హిందీలో "ససురాల్"తో కూడా ఈ పొడుపుకథలతోనే ఆరంభమవుతుంది.

మూగమనసులలో "గౌరమ్మా నీ మొగుడెవరమ్మా" అన్న పాటలో పొడుపుకథల ఛాయలున్నాయి.

కాశీమజిలీ కథలు, మరికొన్ని జానపద సంబంధమైన కథలు సినీమా కథలుగా వచ్చాయి. వీటిలో రాజకుమారికలు స్వయంవరంలో తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన వారినే వివాహమాడటం ఉంటుంది. అవి అన్నీ కాకపోయినా కొన్ని పొడుపుకథ లనవచ్చు.

గాలిపటం సినీమాలో ఒక పొడుపుకథ ఉంది. మంగమ్మ శపథం (పూర్వం ప్రతి) లో ఒక పొడుపుకథ ఉంది. అది చూడండి.

రాజు అడుగుతాడు. నువ్వుల్లో పుట్టి నువ్వుల్లో పెరిగిన చినదానా! నువ్వు గింజకంటె చిన్న ఆకు ఉన్న చెట్టు ఏది?

దీనికి మరో ప్రశ్న వేస్తుంది ఆ చిన్నది అది చూడండి

పువ్వుల్లో పుట్టి పువ్వుల్లో పెరిగిన ఓ పువ్వుల రాజా!
పువ్వుల్లో మూడు రంగుల పువ్వు పూచే చెట్టు ఏది?

రెండింటికీ ఒక్కటే సమాధానము అవుతుంది అది వెలుతురు చెట్టు.

ఈ ప్రకారంగా సినీ సాహిత్యంలో కూడా పొడుపుకథలు చోటు చేసుకున్నాయి.

ఇంతవరకు మనం మన సాహిత్యంలో పొడుపుకథలకు ఉన్న స్థానం చూశాం. మనకు సోదరభాష అయిన తమిళంలోని కొన్ని పొడుపుకథలు గమనించండి. కన్నడంలోను, హిందీ, ఇంగ్లీషు భాషలలోను ఉన్నవాటిని తరవాత మనవిచేస్తాను

తమిళంలోని పొడుపుకథలు :

1. శెంబు నిరయణంబు అది యెన్నె? (మాదీఫలం)

2. ఆయిరం తెచ్చుఅగూడి అళగాన మండపం కట్టి వొరువన్ కన్ బట్టు వుడైంద దామండపం అది యెన్నె? (తేనెపట్టు)

3. ఎంగళ్ వీటుక్కిణత్తిల్ వెళ్ళికిణ్ణమ్ యెదక్కిరదు అది యెన్నె? (చంద్రుడు)

4. గణత్తి చుట్రి అగత్తి మఱం అది యెన్నె? (కనురెప్పలు)

5. అరియకూడి పెరియత్త అవశెగట్టికారి పాలుకుడక్కాయె పుళ్ళై వళప్పార్ ఏళియగట్టికారి అది యెన్నె? (కోడి)

6. ఎంగమా మాపీటి తోటత్తిలె మంజల్ కురివి ఊంచలాడదు. అది యెన్నె? (నిమ్మకాయ)

7. మన్నుక్కుళ్ళై యిరిక్కె మాయంది, ఉరిక్కె ఉరిక్కెలోలాంది. అది యెన్నె? (టెంకాయ)

8. పిల్ల ఇల్లాద వీటుక్కు అవన్ ఎట్టై? ఇల్లాద వీటుక్కు నాన్ అది యెన్నె? (టెంకాయ).

9. పొరి పొరిత్తు పొట్టియిల్ వై త్తెన్, పొటిందు, నిడుందు కానిర్పిల్లై అది యెన్నె ? (నక్షత్రాలు)

10. ఇరుట్టు వీట్టుక్కుళ్ళె ఎరుమైమాడు మేయుదు. అది యెన్న ? (పేను).

తెలుగు తమిళభాషలలో ఒకేవిధంగా ఉన్న పొడుపుకథలు పరిశీలించండి.

1. అన్న కందవు—అమ్మ కందుతాయి
ఆణ్ణ నుక్కు ఎట్టాదు—తంబికి ఎట్టుదు } పెదవులు

2. ఒస్తాడు పోతాడు తిమ్మప్ప ఓకాల నిలుస్తాడు తిమ్మప్ప
పోవాన్ వారువాన్ తిమ్మప్పన్ ఒరుకేకాల్ నిప్పన్ తిమ్మప్పన్ (తలుపు).

కన్నడ భాషలోని పొడుపుకథలు:-

1. అంకు దొంకద బావి
శంఖు చక్రద బావి
నారాయణ కేరిల్లద బావి (చెవి)

2. అంగడింద బర్తానె
అంగికోటు బిచుతాదె
బావి యెల్లి దూకుతానె (అరటిపండు)

3. ఎరెడు మనిగె
ఒందు తొలె (ముకు)

4. చిక్క మనిగె
చెక్క తుంబెద (పలువరస)

హిందీ భాషలోని పొడుపుకథలు:-

1. హల్ హల్ తాథా, దహీ జమ్ తాథా
దిల్ తరజ్ తాథా, హాత్ నహీ పహుంచ్ తాథా । క్యాహై ।
నారియల్ (కొబ్బరికాయ)

2. కాలే వన్‌మే రహ్‌తాథా ।
లాల్ శారబ్ పీతాథా । క్యాహై । జూం (పేను)

3. చార్ కంబే ఖదే థే
దో పంఖే హిల్ తేథే
బీచ్ మే శమా జల్ టీథీ
నాగిన్ ఉస్‌సే ఖేల్ తీ థీ ? క్యాహై ? హాథీ (ఏనుగు)

4. బాభీ ! తుమ్ చేడీ క్యోం ?
హరీ సాడీ పహనీ క్యోం ?
పేటీమే తుమ్హారే సఫేద్ క్యోం ? క్యాహై ? (హరీమిర్చ్ యా క్తైరీ)
(పచ్చిమిరపకాయ లేదా మామిడికాయ).

5. చార్ చిడియాం చార్ రంగ్ కే
ఘర్ మే ఆయేతో ఏక్ రంగ్ కీ । క్యాహై ? పాన్ (తాంబూలం)

6. ఏక్ ఖబర్ మే కఈ ముర్దే। క్యాహై? (ఇలాచీ) ఏలకులు.

7. ఏక్ అకడా చార్ పకడా। క్యాహై? (శవం)

8. దోలటక్‌తే ఏక్ పకడ్‌తా। క్యాహై? తరాజు (త్రాసు)

9. తూచల్ మై ఆయా। క్యాహై (దర్వాజా) తలుపు.

10. సూఖీ నదీమే హిజడే నాచే: క్యాహై? (మురమురాలు)

హిందీ సినీ సాహిత్యంలో కూడా పొడుపుకథలు కనిపిస్తున్నాయి. హిందీ సినీమాలు 420 లోను, మేరేనామ్ జోకర్‌లోనూ, ససురాల్‌లోనూ పాటల రూపంలో పొడుపుకథలు వచ్చాయి. కేవలం పొడుపుకథలకు కొన్ని పుస్తకాలే (హిందీలో) వెలువడ్డాయి.

ఉర్దూభాషలో కవాలీలు ఉన్నాయి. బెంగాలీ భాషలో కూడా పొడుపు కథలకు ప్రచుర స్థానం ఉన్నది.

ఇంక ఇంగ్లీషు భాషలోని కొన్ని Riddles చూపిస్తాను. Riddle అంటే "పొడికథ, అంతరార్థము ఊహించే ఒక ఆట, సమస్య" అని అర్థాలు ఉన్నాయి.

It may well be doubted whether human ingenuity can construct an enaigma of the kind which human ingenuity may not, by proper application, resolve."

—Edgar Allen Poe

అని నిర్వచించాడు.

1. What makes the road broad?
"B" makes road broad.

2. It has no teeth but bites. What is it? "Shoes"

3. If yon take out one from nine, it makes ten. How is it possible? (Take Roman Number IX. And then take out one from it. It makes X).

4. "A" is father of 'B'. But "B" is not son of A. What is the relationship between A and B.
"B" must be daughter of A.

5. It is placed on the table. It is cut and distributed amongst the members. But it is not edible. What is it?
"Playing cards"

6. There are lakes without water, seas without fishes and mountains without rocks? Where are they? (In Atlas and in Dictionaries)

7. Can you find out the relationship between C and D. Their relationship is as follows:-
Fifty before Zero and five before "e".
(LOVE)

In Roman numbers "L" is written for fifty and "V" is written for five. Zero stands for "O". Now you can derive at the relationship.
"LOVE"

8. ఇంగ్లీషులో ఉచ్చారణ మాత్రం చేత సృష్టించే Riddles ఉన్నాయి. మచ్చుకు ఒక్కటి చూడండి.

సిక్టీ సిక్స్ వెంట్ టువి బాటిల్ ఫీల్డ్, ఫైవ్ షాట్ డెడ్. హౌ మెనీ ఆర్ దేర్?

తప్పకుండా 61 మంది అని చెబుతాం. కాని అది తప్పు. సరైన సమాధానం "౫౫ మంది" అవుతుంది.

ఇక్కడ చేసిన చిత్రమల్లా అరవై మంది సిక్కులు యుద్ధభూమికి వెళ్ళారు. అయిదుగురు చచ్చి పోయారు. ఇంకా ఎంతమంది మిగిలి ఉన్నారు? అన్నది పై దాని అనువాదం. "సిక్స్" అందే ఆరు అనుకొన్నాము. కాని సిక్కులని గ్రహించాలి.

9. Why "T" is called an island?
Because it is in the midst of water.
"WATER"

10. What will happen when a red brick is dropped in a yellow sea.
It will simply be drowned.

ఇంతవరకు తమిళం, కన్నడం, హిందీ, ఇంగ్లీషు భాషలలోని కొన్ని పొడుపుకథలు చూపడాను అన్నిటిలోను సామాన్య లక్షణాలు ఉన్నాయి. ప్రజల అనుభూతులనే చమత్కారంగా వర్ణించి దాని ఉనికిని రహస్యంగా ఉంచి, అది ఏమిటో చెప్పమనే తీరు ప్రతి దానిలోనూ మనకు కనిపిస్తూంది. ఊహను ప్రేరేపించడానికి కారణాలవుతున్న ఈ పొడుపుకథలు అన్ని భాషలలోనూ ఉన్నాయి అనడం అతిశయోక్తి కానేరదు. వాటి చిత్ర విచిత్రగతులు పిల్లల మనోధర్మంపై ముద్రవేస్తాయనడం నిర్వివాదం.



ఉపసంహారము

జానపదసాహిత్యంలోని పొడుపుకథలు చరిత్రను దిఙ్మాత్రంగా ప్రదర్శించడం జరిగింది లోతులకు పోయి అనర్ఘరత్నాలను బయటికి తేవలసిన పని ఇంకా మిగిలి ఉంది. వీటిలో మాండలిక భేదాలను చూపవలసిన పని ఇంకా ఉండి పోయింది. జాతి జాతీయతను ప్రతిబింబించే జానపద సాహిత్యంలో పొడుపుకథలు వేసిన జాతీయతాముద్ర పరిశీలించవలసి ఉంది. నేటి వఱకు మన దేశాన్ని అనేకమంది పరిపాలించేరు ఆ రాజకీయ ప్రభావం, సాంఘిక పరిసర ప్రభావాలు పొడుపుకథలలో ప్రతిఫలించాయా? వాటివల్ల భాషకు కలిగిన ప్రయోజనమేమిటి? ఏయే రీతిలో వాటి ప్రయోజనం మనము అనుభవించాలి. ఇవి సమగ్రంగా పరిశీలించి పరిశోధించవలసి ఉంది

సామ్యం చూపేది సామెత. జాతీయతను చూపేది జాతీయము. ఒక్కొక్క భాషకు ఒక్కొక్క నుడికారం ఉంటుంది. వాటిపై పొడుపుకథలు, పొడుపు కథలపై సామెతలు, జాతీయాలు, నుడికారాలు పరస్పరం ఆధారపడి ఉన్నాయి

సామెతలుగా కొన్ని పొడుపుకథలు నిలిచాయి. ఉదాహరణకు "పొట్టివానికి పుట్టెడు బుద్ధులు (సామెత). పొట్టి వానికి పుట్టెడు అంగీలు (పొడుపుకథ) సమాధానము (ఉల్లిపాయ) అయితే అన్ని పొడుపుకథలూ సామెతలు కావు. అన్ని సామెతలూ పొడుపుకథలూ కావు. అట్లే జాతీయాలు, నుడికారాలు, పొడుపుకథలుగానూ; పొడుపుకథల సారాంశాలు జాతీయాలుగానూ నుడి కారాలుగానూ ఉన్నాయి జాతీయాలను విరివిగా వాడిన చేమకూర వేంకటకవి విజయవిలాసం పరిశీలిస్తే ఈ పరిశోధన కొంతవరకు సాధ్యమవుతుంది.

భావాన్ని ఆశ్రయించి పొడుపుకథలను విభాగించవచ్చు అవి సాంఘికం, రాజకీయం, ప్రాంతీయం, పౌరాణికం, సాహిత్యం, కల్పన, శాస్త్రీయం, కథా కథనం, తాత్త్వికం, సంకీర్ణం అని అనేకవిధాలు.

అల్పాక్షరముల అనల్పార్థరచన చేయడానికి పనికి వచ్చే ఈ ప్రక్రియ ఇతోధిక ప్రోత్సాహాన్ని పొందితే విద్యార్థులు పెద్దవారు అందరూ దీని ఫలాన్ని అనుభవించడానికి వీలవుతుంది విద్యా. వైజ్ఞానిక రంగాలలో దీని ప్రయోజనం అశేషం

ఆటపాటల రూపంలో వినోదాన్ని విజ్ఞానాన్ని అందించేవీ, జానుతెనుగు తనాన్ని పుణికి పుచ్చుకొన్నవీ, బాల సాహిత్యంగానూ, ఆనంద సాహిత్యం గానూ. బాలానంద సాహిత్యంగానూ గణనకెక్కిన ఈ పొడుపుకథలు జానపద సాహిత్యంలో చోటు చేసుకొని పదిమందిలోకి వచ్చాయి. అందరి మన్ననలు అందుకొన్నాయి. మార్గసాహిత్యంలో కూడా అడుగు పెట్టాయి.

శైశవదశలో ఉండే కుతూహలం, వినోదం, క్రీడాతత్త్వం వీటిలో పుష్కలంగా ఉన్నాయి వీటితో విజ్ఞాన సమార్జన, ఆనంద ఉత్సాహాలకు ఆలంబన పొడుపుకథలలో చోటు చేసుకొన్నాయి.

శిశువు పెరిగినకొద్దీ తనలో అసూయ, ద్వేషం మున్నగు గుణాలు పెంచుకొని దైవత్వానికి దూరమవుతాడు. బ్రహ్మజ్ఞానిని "బాలోన్మత్తపిశాచవత్" అని వర్ణిస్తారు బాలత్వంలోని ఆ అమాయకత, స్వచ్ఛత దైవత్వానికి ప్రతి బింబాలు. అందుకే శైశవతత్త్వాన్ని నిలుపుకోవడం దైవత్వానికి దగ్గర కావడ మవుతుంది ఈ సాహిత్యం దానికి దోహదం చేస్తుందనవచ్చు

ఛందశ్శాస్త్రజ్ఞులు వారి కవితా ప్రభేదాలలో పాద భ్రమకాలుగా, పద్య భ్రమకాలుగా, అనులోమ, విలోమాలుగా అర్థకాఠిన్యాలుగా, అవధానవిధానాలలో

సమస్యలుగా చిత్రకవిత్వంలో పొడుపుకథలను స్వీకరించారు. ఒక్క పదంలో రెండు, మూడు పదాలు ఉండే పొడుపుకథలు, రెండేసి ప్రశ్నలకు ఒక్కొక్క సమాధానం చెప్పేవి, రెండు భాషలకు (సంస్కృతాంధ్రభాషలకు) సరిపోయే ఒక్కసమాధానం చెప్పే పొడుపుకథలు, గర్భకవిత్వంగా, బంధకవిత్వంగా మనకు సాక్షాత్కరిస్తున్నాయి రెండు భాషలకు సరిపోయే పద్యం పిటికోవలోనిదే.

అలంకార శాస్త్రజ్ఞులు కొన్ని అలంకారాలుగా పొడుపుకథలను తీర్చిదిద్ది వాటికి శాశ్వతత్వాన్ని కల్పించారు. శ్లేష, వక్రోక్తి, ఉత్తరాలంకారం, ముద్రాలంకారం, సమాసోక్తి, విరోధాభాస, అపహ్నుతి, ముక్తపదగ్రస్తం మున్నగు అలంకారాలు పొడుపుకథల ముద్రలున్నవే.


ఆనందవర్ధనుని ధ్వనివాదానికి ప్రధానమైన వ్యంగ్యం, పొడుపుకథలకు ప్రధానం కావడంవల్ల, కావ్యాలలో వీటి ప్రయోజనం అనన్యము. ఇవి కావ్యానికి ఆత్మగానే భాసిస్తాయి ధ్వనిలో ఆనందవర్ధనం ఉంటే వీటిలో బాలానందవర్ధనం ఉన్నాది.

రసస్ఫూర్తి వీటిలో పుష్కలంగా ఉంటుంది. ముఖ్యంగా హాస్య, అద్భుత రసాలు వీటిని ఆశ్రయించి ఉంటాయి. ఔచిత్యం సముచితంగా ఉంటుంది రస పరిపుష్టిత్వం కొన్ని పొడుపుకథలలో ఉన్నాది.

ఆధునిక సాహిత్యమైన సినీ సాహిత్యంలో కూడా ఈ పొడుపుకథలు పాటల రూపంలో ప్రవేశించాయి. కొన్ని సినిమా కథలు వీటి మీదనే ఆధారపడి ఉన్నాయి. జనరంజన ముఖ్యలక్షణంగా గల సినిమాలు వీటిని ఆదరించడం వాటి పురోభివృద్ధికి ప్రథమ సోపానం.

జాతీయాలు, నుడికారాలు, సామెతలు, కొన్ని వేదాంతతత్త్వాలు చక్కని జాను తెనుగులో పొడుపుకథలుగా మనకు కనిపిస్తున్నాయి ఈ ప్రక్రియను అలక్ష్యం చేయడం పనికిరాదు.

జాతీయతను ప్రతిఫలించేది జానపదం. ఈ పొడుపుకథ జానపద సాహిత్యానికి ప్రాణప్రదం. భావితరాలకు మన పూర్వులు కట్టిన ముడుపులు ఈ పొడుపులు. పసిడిమనసుల పసివారి జీవితంలో బంగారు పుటను తెరిచే ఈ పొడుపుకథా సాహిత్యం అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేసే జ్యోతి స్వరూపం. తెలుగు జాతీయతకు మణిదీపం.



తోడ్పడిన గ్రంథాలు

1. భారతం (తెలుగు)
2. భారతం (సంస్కృతం)
3. రావూరు రసికులకు నెల్లూరు నెరజాణలు వ్రాసిన ఉత్తరాలు
4. తిరుమలేశ శతకం
5. శృంగార యుక్తి చమత్కార రత్నావళి
6. జానపద గేయవాఙ్మయ వ్యాసావళి
7. పసిడి పలుకులు
8. తెలుగు సామెతలు
9. చాటుపద్య మణిమంజరి
10. చాటుపద్య రత్నాకరం
11. నానార్థ గంభీర రత్నమాల
12. భట్టి విక్రమార్క కథలు
13. వినోద కల్పవల్లి
14. అప్పకవీయము
15. చంద్రాలోకం
16. దండి కావ్యాదర్శనము
17. సాహిత్యోపన్యాసములు
18. విదగ్ధ ముఖమండనం
19. లోకోక్తి సుధాకరం
20. కావ్యాలంకార సంగ్రహము
21. సాహిత్య దర్పణము
22. Riddles
23. కాశీమజిలీకథలు
24. పాణినీయం
25. విద్యార్థి కల్పతరువు

ఇవికాక శ్రీ అప్పల్ల సోమేశ్వరశర్మగారి రేడియో ప్రసంగవ్యాసాల, హిందీ, తమిళ, కన్నడ భాషలకు చెందిన మఱి కొన్ని గ్రంథాలు

—(o)—



